- నిరాయుధ నిర్ణయం మాది కాదు: మావోయిస్టు పార్టీ
- 'నో ఫ్లై జోన్'గా సెక్రటేరియట్: తెలంగాణ ప్రభుత్వం
- యూరియా తొక్కిసలాటలో గాయపడిన మహిళ మృతి
- స్కూల్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగులపై జీఎస్టీ మోత
- గుంతల వల్ల మరణిస్తే బల్దియాదే బాధ్యత: బాంబే హైకోర్టు

......లోపలిపేజీల్లో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

నిపుణ

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శనివారం SATURDAY 20.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16 Pages: 16 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 106 ‖ వెల (Price) రూ.6.50 | చతుర్దశి

శనివారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-14. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: చతుర్దశి రాత్రి 12-16 వరకు. నక్షత్రం: మఖ ఉదయం 8-06 వరకు, తదుపరి పూర్వఫల్గుణి. వర్జ్యం: సాయంత్రం 4-33 నుంచి సాయంత్రం 6-15 వరకు. రాహుకాలం: ఉదయం 9-07 నుంచి ఉదయం 10-38 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-05 నుంచి ఉదయం 7-45. అమృతకాలం: రాత్రి 2-44 నుంచి తెల్లవారుజామున 4-26 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



కరెంట్ తీగలు పట్టుకుని

నిరుద్యోగి ఆత్మహత్య

కొలువుల కలలు కల్లలై..

ఇంటికి తిరిగివెళ్లేందుకు చార్జీలూ లేక తీవ్రనిరాశ

హైదరాబాద్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పైకెక్కి మల్లేశ్ బలవన్మరణం

వెంగళరావునగర్, సెప్టెంబర్ 19: కలలు కల్లలై.. ఆశలు అడియాసలై నిరాశ నిస్పృహలకు లోనైన ఓ నిరుద్యోగి హైదరాబాద్ ఎస్‌ఆర్ నగర్‌లో శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉన్నత చదువులు చదివినా.. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎంతకీ సర్కారు నౌకరీ రాకపోవడంతో ఆ నిరుద్యోగి కుంగిపోయాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పైకెక్కి.. 2వ పేజీలో

తెలంగాణ నోట్లో ఆల్‌మట్టి!




కృష్ణా నీటిపై పెను కుట్ర

ఆల్మట్టి ఎత్తు పెంపుతో కృష్ణాకు కర్ణాటక గండి.. తుంగభద్ర నీటి మళ్లింపుతో ఏపీ తొండి!

భీమా-కొయినా లింకుతో మహారాష్ట్ర పన్నాగం.. వంత పాడుతూ మద్దతిస్తున్న కేంద్రం

బ్రిజేశ్ ట్రిబ్యునల్-2 అవార్డే అందరికీ అస్త్రం.. వారి చేతిలో పావుగా ముఖ్యమంత్రి రేవంత్



- రెండేండ్లుగా కాళేశ్వరంపై విషం చిమ్మడం వెనుక కారణమిదే!
- తమ్మిడిహట్టిని తెరపైకి తెచ్చి కృష్ణా పంపకాల్లో ఏపీ చేతికి అస్త్రం
- సమైక్య పాలకుల బాటలోనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రాణం
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కృష్ణాను కాదని గోదావరి జలాల తరలింపు
- బ్రిజేశ్ ట్రిబ్యునల్-2 అవార్డుతో కృష్ణా నీటికి ఏపీ, కర్ణాటక చెర
- కేంద్రం పావులు కదుపుతున్నా.. ప్రేక్షకపాత్రలో రేవంత్ సర్కారు
- అవార్డు అమలైతే శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు చుక్కనీరూ కష్టమే!

?

పక్కనే కృష్ణానది ఉండగా రంగారెడ్డికి ప్రాణహిత ఎందుకు?

దానివల్ల కృష్ణానీటిలో మన వాటా నష్టపోతే బాధ్యులెవరు?

ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడం కాదా?

(గుండాల కృష్ణ /మ్యాకం రవికుమార్) హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): 'కృష్ణాజలాల్లో 500 టీఎంసీలు.. గోదావరిలో వెయ్యి టీఎంసీలు ఇవ్వండి చాలు.. మిగిలిన ఎన్ని నీళ్లు ఎవరు వాడుకున్నా మాకు అభ్యంతరం లేదు' అని కొన్ని రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశామాషీగా అన్నది కాదని, దాని వెనుక భారీ కుట్ర దాగి ఉన్నదని సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కృష్ణా-గోదావరిలో తెలంగాణను కేవలం 1500 టీఎంసీలకు పరిమితం చేయాలనే కుతంత్రం చాపకింద నీరులా అమలవుతున్నదని తేల్చిచెప్తున్నారు. అసలు కృష్ణాజలాల్లో తెలంగాణకు మరోసారి చారిత్రక ద్రోహం చేసేందుకే కాళేశ్వరాన్ని ఎండబెట్టి బనకచర్లకు జై కొట్టినట్టుగా అనుమానిస్తున్నారు. అందులో భాగంగానే బీజేపీ-బాబుతో కలిసి రేవంత్ రచించిన కపట ప్రణాళిక 8వ పేజీలో

కండువా కప్పితే కాంగ్రెస్‌లో

చేరినట్టా?

- ఫిరాయింపులపై నిర్దిష్ట నిబంధనల్లేవ్: సీఎం
- పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పిన
- ఎల్ అండ్ టీ సంస్థ నా మాట వినకుంటే ఊరుకోను
- యూరియా కొరతకు బీజేపీ, బీఆర్‌ఎస్సే కారణం
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కండువా మెడలో వేసినంత మాత్రాన పార్టీ ఫిరాయించినట్టేనా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తన ఇంటికి వచ్చిన వారికి అందుబాటులో ఉన్న కండువా వేస్తానని, అంతమాత్రాన పార్టీ ఫిరాయించినట్టు అవుతుందా? అని బుకాయించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో పార్టీ ఫిరాయింపులను కప్పిపుచ్చుకొనేందుకు ఆపసోపాలు పడ్డారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్టమైన నియమాలంటూ ఏమీ లేవని బుకాయించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసుల విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని స్పీకర్‌కు సూచించానని, స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉన్నదన్నారు. తన ఎమ్మెల్యే జీతం నుంచి నెలకు రూ.5 వేలు బీఆర్‌ఎస్‌ఎల్పీకి వెళ్లినట్టు ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారని తెలిపారు. ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన 12వ పేజీలో

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేవు!

- ఎప్పుడు నిర్వహిస్తామో ఇప్పుడే చెప్పలేం
- కోర్టును మరింత గడువు కోరుతాం: సీఎం

2

ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ తెలుస్తారు

- ఫిరాయింపుపై కడియం కొత్త బొంకులు
- కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని వెల్లడి

3



శుక్రవారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాగంటి గోపీనాథ్ భార్య సునీత, పార్టీ ముఖ్యనేతలు

కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కూల్చివేతలకు లైసెన్స్

- జూబ్లీహిల్స్ నుంచే బీఆర్‌ఎస్ జైత్రయాత్ర
- ఈ ఉప ఎన్నిక తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించేది
- మళ్లీ కేసీఆర్ రావాలంటే కాంగ్రెస్‌కు సురుకు పెట్టాలి
- మాగంటి కుటుంబానికి అండగా నిలవాలి
- రాష్ట్రంలో కాంగ్రెస్ ముసుగులో బీజేపీ పాలన
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జూబ్లీహిల్స్ నేతలతో సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తేతెలంగాణ): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేసి ఢిల్లీకి చెందిన బేకార్ పార్టీలను తరిమికొట్టాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. చెయ్యి గుర్తుకు ఓటేస్తే హైడ్రా కూల్చివేతలకు లైసెన్స్ ఇచ్చినట్టేనని స్పష్టంచేశారు. 24 నెలల్లో హైదరాబాద్‌లో ఒక్క గుంత కూడా పూడ్చని, ఒక్క ఇటుక కూడా పేర్చని సీఎం రేవంత్‌రెడ్డి.. హైడ్రాను తెచ్చి వేలాది పేదల ఇండ్లను నేలమట్టం చేశారని మండిపడ్డారు. 'బుల్డోజర్లు పంపి ఇండ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యామా? కనీసం ఒక్క బ్రిడ్జి అయినా కట్టినవా? అండర్‌పాసైనా అందుబాటులోకి తెచ్చినవా? ఫ్లై ఓవర్‌కైనా ముగ్గుపోసినవా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నికలో పార్టీ గెలుపునకు ఏవిధంగా ముందుకెళ్లాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తలు..అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. 'కేసీఆర్ మళ్లీ రావాలంటే కాంగ్రెస్‌కు సురుకుపెట్టాలి..జూబ్లీహిల్స్ నుంచే బీఆర్‌ఎస్ జైత్ర యాత్ర మొదలుపెట్టాలి' అని శ్రేణులకు పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు ఢిల్లీ పార్టీల దుష్ప్రచారాన్ని నమ్మకుండా సరైన తీర్పే ఇచ్చారని పేర్కొన్నారు. కానీ పల్లె ప్రజలు కాంగ్రెస్ ఏవో పథకాలు ఇస్తుందని నమ్మి ఇప్పుడు అరిగోస పడుతున్నారని చెప్పారు.

పెద్దలకు ఓ నీతి..పేదోళ్లకు మరోనీతా?

ఎఫ్‌టీఎల్‌లో ఉన్న రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి, మంత్రులు పొంగులేటి, వివేక్, కాంగ్రెస్ నేత కేవీపీ ఇండ్లను వదిలిపెట్టి పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను పంపుతున్నారని కేటీఆర్ తూర్పారబట్టారు. తన ఇల్లు కూల్చివేస్తారనే భయంతోనే కూకట్‌పల్లికి చెందిన బుచ్చమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని గుర్తుచేశారు. కనీసం చిన్న పిల్లల పుస్తకాలు, వాటర్ బాటిళ్లు కూడా తీసుకోనివ్వకుండా ఇండ్లు కూల్చారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఏనాడూ పేదలపై ప్రతాపం చూపలేదని, గుడిసెల్లో ఉంటున్న లక్షల మందికి పట్టాలిచ్చారని, లక్ష ఇండ్లు కట్టించారని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. రేవంత్‌రెడ్డి మాత్రం అసమర్థ పాలనతో హైదరాబాద్‌ను అతలాకుతలం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కట్టిన ఫ్లైఓవర్లు, బిల్డింగ్‌లకు పెయింటింగ్ వేయడం..రిబ్బన్ కటింగ్‌లు గొప్పగా చేస్తున్నారు తప్ప రేవంత్ సర్కారు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీలకు రెండేళ్లయినా ముహూర్తం దొరకడంలేదా? అని చురకలంటించారు.

> జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గోపీనాథ్ ఉన్నప్పుడు పేదలకు ఏ కష్టం వచ్చినా అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా అండగా నిలిచిండ్రు. కష్టాల్లో ఉన్న సర్దార్ కుటుంబాన్ని ఆదుకున్నరు. ఆయన ఆశయ సాధన కోసం గోపన్న కుటుంబాన్ని ఆదరించాలె.
> -కేటీఆర్



గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంత్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనేతలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయగౌడ్

బీఆర్‌ఎస్‌లోకి గద్వాల కాంగ్రెస్ నేతలు

గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. ధరూర్, మల్దకల్, కేటీదొడ్డి మండలాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనేతలు ఆ పార్టీని వీడారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంత్ నాయుడు నేతృత్వంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వారంతా బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని, కష్టపడ్డ వారికి భవిష్యత్తులో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

పార్టీలో చేరింది వీరే..

మాజీ సర్పంచులు: ప్రతాప్ (అల్లపాడు), ధర్మారావు (కొత్తపాలెం), ఈరన్న (మార్లబీడు), ఆంజనేయులు (చిన్నపాడు), ఆంజనేయులు (వానపల్లి), హనుమంతు (నేతోనిపల్లి), హనుమంతు (ఈర్లబండ), గోకరి (మాజీ ఉప సర్పంచ్, బిజ్వారం)

మాజీ ఎంపీటీసీలు: లక్ష్మీరెడ్డి (చింతరేవుల), హనుమంతు (పార్చర్ల), ప్రహ్లాద్ (వానపల్లి), ఆంజనేయులు (మన్నపురం), గోవింద్ (మల్లాపురం), సీ కే రంగన్న (విండో వైస్ చైర్మన్, అల్వాల్‌పాడు), మంత్రా నాయక్, రమేశ్ ఎల్కూర్ (సింగిల్ విండో డైరెక్టర్లు)

ముఖ్యనేతలు: కష్టారెడ్డి (అమరవాయి), రవి (గార్లపాడు), ముదిరాజ్ ఆంజనేయులు (గార్లపాడు), మెకానిక్ గోవింద్ (బిజ్వారం), నాగరాజు(ఎల్కూర్).

> రేవంత్‌రెడ్డి గద్దెనెక్కగానే హైడ్రాను తెచ్చి నగర ప్రజలకు నరకం చూపిస్తున్నడు. పెద్దల ఇండ్లను వదిలి పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపుతున్నడు. కాంగ్రెస్ నేతల కల్లబొల్లి మాటలు నమ్మితే వాళ్లిక తిరుగులేదని భావించి మరింత దుర్మార్గంగా వ్యవహరిస్తరు. ఇప్పుడు పక్క బస్తీలకు వచ్చిన హైడ్రా రేపు మీ ఇండ్లపైకి వస్తది. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలె.
> -కేటీఆర్

అజారుద్దీన్ ముసుగులో ముస్లింలకు ధోకా

జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్లకోసమే సీఎం రేవంత్‌రెడ్డి అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పేరిట ధోకా ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా ఆయన ఎంపిక చెల్లబోదని తేల్చిచెప్పారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్రు సత్యనారాయణను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే అప్పటి బీజేపీకి చెందిన మహిళా గవర్నర్ తిరస్కరించిన విషయాన్ని ప్రస్తావించారు. హైకోర్టు చెప్పినా వినకపోవడంతో శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమీర్‌అలీఖాన్, కోదండరాంను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయగా బీజేపీతో రేవంత్‌రెడ్డికి ఉన్న మైత్రిబంధంతో మోదీ సూచన మేరకు గవర్నర్ ఆమోదించారని చెప్పారు. కానీ కేసు పెండింగ్‌లో ఉండగా ఎలా ఎంపిక చేస్తారని సుప్రీంకోర్టు వారి ఎన్నిక చెల్లదని మధ్యంతర తీర్పు వెలువరించిందని తెలిపారు. ఇప్పుడు అమీర్‌అలీఖాన్‌ను పక్కనబెట్టి అజారుద్దీన్‌ను మళ్లీ తెరపైకి తెచ్చి ముస్లింల ఓట్లను కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని, ఆయనను అడ్డం పెట్టుకొని ముస్లింలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ ముసుగులో బీజేపీ సర్కారు

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కాంగ్రెస్ ముసుగులో బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. అందుకే కేంద్రంలోని బీజేపీ సర్కారు పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్‌చట్టాన్ని దేశంలో తొలిసారిగా తెలంగాణలో అమల్లోకి తెచ్చారని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలిచిన ఘనత ఆయనకే దక్కిందని చురకలంటించారు. ముస్లింలకు వ్యతిరేకమైన ఆ చట్టాన్ని రాజ్యసభలోని నలుగురు బీఆర్‌ఎస్ సభ్యులు వ్యతిరేకించారని గుర్తుచేశారు. 'రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌కు చెందిన వాడైనా మోదీ పార్టీలో స్కూల్ విద్య అభ్యసించిండు.. చంద్రబాబు వద్ద కాలేజీ పూర్తిచేసిండు.. ఇప్పుడు రాహుల్‌గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నడు.. మన దగ్గర కూడా హైస్కూళ్లలో చేరిండు.. కానీ పిల్లాడి బుద్ధి బాగాలేదని కేసీఆర్ హైస్కూల్ నుంచి వెళ్లగొట్టిండ్రు.. రేవంత్‌రెడ్డి మాత్రం ఈ విషయం దాచిపెడుతున్నడు' అంటూ తనదైన శైలిలో ఎద్దేవాచేశారు. మోదీ, అదానీ విషయంలో రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీతో విభేదిస్తున్నారని చెప్పారు. 'మోదీని రాహుల్ చౌకీదార్..ఓట్ చోర్ అంటే రేవంత్‌రెడ్డేమో బడే భాయ్ అంటున్నడు.. ఆయన అదానీని అవినీతి పరుడంటే, ఈయన మంచి దోస్త్ అంటడు.. ఆయన సీబీఐ కరాబ్ అంటే.. ఈయనేమో అచ్చాయే అంటడు. ఆయన గుజరాత్ మోడల్ బేకార్ అంటే ఈయన బాగున్నదంటడు' అంటూ రేవంత్, మోదీ మైత్రి బంధాన్ని కేటీఆర్ ఎత్తిచూపారు. పక్కన ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రం కర్ణాటకలో సీబీఐకి అనుమతి నిరాకరిస్తే రేవంత్‌రెడ్డి ద్వారాలు తెరిచారని తూర్పారబట్టారు. రేవంత్‌రెడ్డిని అడ్డంపెట్టుకొని కేసీఆర్‌ను ఖతం చేసేందుకు గులాబీ జెండాను ఎగరకుండా చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని చెప్పారు.

ముగ్గురక్కలే సంతోషంగా ఉన్నరు..

కాంగ్రెస్ 22 నెలల పాలనలో అన్ని వర్గాలు ఆగమయ్యాయని కేటీఆర్ విచారం వ్యక్తంచేశారు. నాడు అన్నింటా ముందున్న హైదరాబాద్ నగర ప్రజలు నేడు నరకం అనుభవిస్తున్నారని వాపోయారు. రాష్ట్రంలోని అక్కాచెల్లెళ్లు రేవంత్ సర్కారుపై కోపంగా ఉన్నారని, కానీ ఆయన సతీమణి గీతక్క, మంత్రులు సీతక్క, సురేఖక్క మాత్రం సంతోషంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఒకరేమో సంపద వచ్చిందని, మరో ఇద్దరేమో మంత్రి పదవులు వచ్చాయని మురిసిపోతున్నారని చెప్పారు. కానీ స్కూటీలు, నెలకు రూ.2500, తులం బంగారం అందక ఆడబిడ్డలు మాత్రం ఆవేదనలో మునిగిపోయారని పేర్కొన్నారు.

కేటీఆర్‌కు మునుగోడు ట్రిపుల్ ఆర్ బాధితుల గోడు

మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్, నారాయణపూర్, మరిగూడెం, చింతపల్లి మండలాల ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు కేటీఆర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, సీనియర్ నేత చెరుకు సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. అలైన్‌మెంట్ మార్పుతో తమ బతుకు దెరువువైన భూమి పోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. సర్కారు వైఖరి, కాంగ్రెస్ పెద్దల ధన దాహానికి తాము బలవుతున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారితో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని సూచించారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.



శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో సమావేశమైన నల్లగొండ జిల్లా ట్రిపుల్‌ఆర్ బాధితులు. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, చెరుకు సుధాకర్

లోకం పోకడ



ఎంత ధైర్యం.. ఎవరో పిలగాడు గాలిపటం ఎగరేస్తున్నాడు సార్!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.9°c	23.9°c
రంగారెడ్డి	36.5°c	20.8°c
మెదక్	34.7°c	24.9°c
ఖమ్మం	34.0°c	24.0°c
వరంగల్	33.0°c	22.0°c
నిజామాబాద్	32.8°c	24.3°c
కరీంనగర్	32.0°c	24.0°c
హైదరాబాద్	31.6°c	21.8°c
నల్లగొండ	31.0°c	23.2°c
మహబూబ్‌నగర్	30.0°c	24.0°c

'స్థానిక' ఎన్నికలు ఇప్పట్లో లేవు!

ఎప్పుడు నిర్వహిస్తామో ఇప్పుడే చెప్పలేం

కోర్టును మరింత గడువు కోరుతాం: సీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి దాదాపు చేతులు ఎత్తేశారు. ఇప్పట్లో ఎన్నికలు లేవని తేల్చి చెప్పేశారు. శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. సెప్టెంబర్ 30లోపు సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇంకో 10 రోజుల్లో హైకోర్టు పెట్టిన గడువు ముగిసిపోతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కార్యాచరణపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ఎన్నికలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో కూడా స్పష్టంగా చెప్పలేకపోయారు. హైకోర్టు పెట్టిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు నిర్ణయంపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. ఇంత స్వల్ప సమయంలో ఎన్నికలు నిర్వహించలేమని చేతులెత్తేశారు. 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు పంపి దాదాపు నాలుగున్నర నెలలు గడిచిపోయాయని గుర్తుచేశారు. బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ నిర్ణయం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన 90 రోజుల గడువుపై తుదితీర్పు వచ్చే వరకూ ఎదురు చూస్తామని తెలిపారు. అప్పటివరకు తాము ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేమని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను హైకోర్టుకు వివరించి మరింత గడువు కోరుతామని స్పష్టంచేశారు.

సాయుధ పోరాట విరమణ పార్టీ నిర్ణయం కాదు

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సాయుధ పోరాట విరమణకు సంబంధించి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి పేరుతో కామ్రేడ్ సోనూ ఇచ్చిన ప్రకటన వ్యక్తిగతమైదేనని, అది పార్టీ నిర్ణయం కాదని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. ఆయన పద్ధతి విప్లవోద్యమానికి నష్టంచేకూర్చేలా ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఓ లేఖ విడుదల చేసింది. సాయుధ పోరాట విరమణపై పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నెలరోజుల వ్యవధి కావాలని కామ్రేడ్ సోనూ ప్రకటించడాన్ని అనాలోచిత చర్యగా పరిగణిస్తున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. ఉద్యమాన్ని విడిచి జనజీవన స్రవంతిలో కలవాలని కామ్రేడ్ సోనూ భావిస్తే పార్టీ కమిటీలో చర్చించి అనుమతి పొందవచ్చని తెలిపారు.



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి, జైపాల్ తదితరులు

ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును అడ్డుకోవాలి

- తెలంగాణ నీటి వాటాపై గొంతెత్తాలి
- కాంగ్రెస్ నిద్రావస్థ వీడాలి
- పాలమూరు ప్రాజెక్టుపై పోరుబాటకు రెడీ
- 28న అచ్చంపేటకు కేటీఆర్ రాక
- మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

అచ్చంపేట, సెప్టెంబర్ 19 : 'కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రలోంచి బయటకు రావాలి.. రాష్ట్రాభివృద్ధితో పాటు తెలంగాణ నీటి వాటా కోసం గొంతెత్తాలి.. కొట్లాడి కేటాయించిన జలాలను సాధించుకోవాలి' అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు ఈ నెల 28న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానుండగా పర్యటన ఏర్పాట్లను మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, స్థానిక నేతలు పరిశీలించారు. అనంతరం బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రమేశ్‌రావు గృహంలో మీడియాతో మాట్లాడారు. కృష్ణానది ఎగువన కర్ణాటకలో సముద్రమట్టానికి 519 ఎత్తులో ఉన్న ఆల్మట్టి డ్యాంను 524 మీటర్ల ఎత్తుకు పెంచుతున్నారని తెలిపారు. దీంతో కన్నడ రాష్ట్రంలో లక్షా 50 వేల ఎకరాల భూమిని సేకరించడంతో పాటు వందలాది గ్రామాలు ముంపునకు గురికానున్నాయని చెప్పారు. నీటి కేటాయింపు ట్రిబ్యునల్ ఫైనల్ వాటా ఇచ్చే వరకు డ్యాం ఎత్తు పెంచే పనులు అడ్డుకోవాలని సూచించారు. రేవంత్ రేవంత్‌రెడ్డి ఆల్మట్టిపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. 28న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అచ్చంపేటకు వస్తున్నారని, సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభలో వర్తమాన పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, స్థానిక సమస్యలు, రైతులు, కార్మికుల పరిస్థితి, ఇతర అంశాలపై చర్చ ఉంటుందన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని నిలబెడుతం

- కాంగ్రెస్‌కు ఔట్‌సోర్సింగ్ జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పిలిచి సమస్యలను దసరా లోపు పరిష్కరించకపోతే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తరపున అభ్యర్థిని నిలబెట్టి ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడిస్తామని రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య సర్కారును హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాదర్బార్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పులి లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు దుర్గం శ్రీనివాస్, మహమ్మద్, శేఖర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, క్రాంతికుమార్, రాజేశ్, జగదీశ్, సురేశ్, జహీర్, నజీర్, విజయలక్ష్మి, జ్యోతి, సరిత, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భిక్షాటన

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం
- ఐదు నెలలుగా వేతనాలు అందక మనస్తాపం
- సూర్యాపేట జిల్లాలో చిరుద్యోగి కన్నీటి వ్యథ

సూర్యాపేటటౌన్, సెప్టెంబర్ 19: సూర్యాపేట జిల్లాలో ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. వేతనాలు రాక కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతున్నదని, కుమారుడికి వైద్యం కూడా అందించలేని నిస్సహాయ స్థితిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మధుసూదన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం నాలుగో రోజు కొనసాగిన ధర్నాలో తన వెంట తెచ్చుకున్న రసాయనం తాగి బలవన్మరణానికి ప్రయత్నించాడు. తోటి ఉద్యోగులు గమనించి దవాఖానలోకి తరలించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు జీతాలు ఇస్తేనే ఈ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకుంటామని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేడుకుంటున్నారు.



శుక్రవారం సూర్యాపేటలో భిక్షాటన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆత్మహత్య చేసుకుంటేనే జీతాలిస్తరా?: రాంబాబు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం దురదృష్టకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మహత్యలు చేసుకుంటేనే జీతాలు ఇస్తుందా? అని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ప్రశ్నించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మధుసూదన్‌ను శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా జనరల్ దవాఖానలో పరామర్శించి మాట్లాడారు. భార్యాభర్తలు ఇద్దరూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కావడంతో తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆరు నెలలు జీతాలు లేకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు.

సోమిరెడ్డి కుటుంబానికి సాయం

మృతుడి పిల్లల పేరున రూ.2 లక్షల ఎఫ్‌డీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కంప్యూటర్ ఆపరేటర్ ఏలేటి సోమిరెడ్డి కుటుంబానికి ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్ ఆర్థిక సాయం అందజేసింది. మృతుడి పిల్లల పేరుతో రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసింది. ఆ బాండ్లను శుక్రవారం మృతుడి భార్య, పిల్లలకు అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే సోమిరెడ్డి.. ఈనెల 12న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆపరేటర్లసంఘం ప్రతినిధులు ముందు కు వచ్చి, బాధిత కుటుంబానికి భరోసాగా నిలిచారు.

పండుగ పూట కూడా పస్తులేనా?

రాష్ట్రంలో పలుశాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి అందని వేతనాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధశాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. కష్టాలు తాళలేక ఇప్పటికే పలువురు చిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. మరికొందరు ప్రాణాలు తీసుకొనేందుకు యత్నించారు. జీతాలు అందకపోవడంతో కుటుంబంలో కలహాలతో ములుగు మున్సిపాలిటీలో మల్టీపర్పస్ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సోమిరెడ్డి రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. 15 రోజుల వ్యవధిలోనే ఇద్దరు చిరుద్యోగులు బలన్మరణాలకు పాల్పడ్డారు. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శుక్రవారం సూర్యాపేట జిల్లా జనరల్ దవాఖానలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మధుసూదన్ ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం తాను పనిచేస్తున్న దవాఖానలోనే చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ చికిత్స పొందుతున్నాడు. పెండింగ్ వేతనాలపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడం, దసరా పండుగ పూట కూడా పస్తులేనా? అనే ఆందోళన ఉద్యోగులను కుంగదీస్తున్నది.

శాఖ	ఉద్యోగుల సంఖ్య	జీతాల పెండింగ్ (నెలలు)
పంచాయతీరాజ్	92,175	3
మిషన్ భగీరథ పథకం	18,000	4-12
టీజీఎస్ ఆర్టీసీ	1,000	2
లేబర్ డిపార్ట్‌మెంట్	90	4
104 విభాగం	1,072	5
వైద్యవిధాన పరిషత్	2,600	4
బాలరక్షణ	1,130	12
నీటి పారుదలశాఖ	1,200	3
ఆశ్రమ గురుకుల పాఠశాల	378	5
ఎస్టీ గురుకుల సొసైటీ	2000	5

కరెంట్ తీగలు పట్టుకుని నిరుద్యోగి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

కరెంట్ తీగలను పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన డీ మల్లేశ్(36) చదువుల్లో చురుకుగా ఉండేవాడు. సివిల్స్ సాధించాలని కలలు కన్నాడు. అందుకోసం గత ఐదేండ్లుగా సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. కానీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగమైనా చేద్దామని నిజామాబాద్ నుంచి 10 రోజుల క్రితం నగరానికి వచ్చాడు. కానీ తాను చదివిన చదువుకు సరైన ఉద్యోగం రాకపోవడంతో.. తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. చివరికి తిరిగి ఇంటికెళ్లాలన్నా చార్జీలకు డబ్బులు లేని దుస్థితి ఏర్పడింది.దీంతో శుక్రవారం సాయంత్రం ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కాడు. కరెంట్ తీగలపే చేతులతో పట్టుకున్నాడు. విద్యుదాఘాతంతో శరీరం తీవ్రంగా కాలిపోవడంతో పైనుంచి కిందపడ్డాడు. తీవ్రగా గాయపడిన అతడిని గాంధీ దవాఖానాకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లంబాడీలపై కుట్రలను తిప్పికొట్టాలి

- త్వరలో ప్రతి తండాలో బస్సుయాత్ర.. హైదరాబాద్‌లో భారీ సభ నిర్వహిస్తాం
- లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి
- లంబాడీల ఆత్మగౌరవ సభలో వక్తలు



శుక్రవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన లంబాడీల ఆత్మగౌరవ సభలో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, తెలంగాణ లంబాడీ ఆత్మగౌరవ వేదిక ప్రతినిధులు

కవాడిగూడ, సెప్టెంబర్ 19: రాజకీయ ప్రయోజనాల కోసం లంబాడీ తెగల మధ్య చిచ్చు పెట్టేందుకు కొంతమంది నాయకులు, కార్పొరేట్ శక్తులు కలిసి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని తెలంగాణ లంబాడీ ఆత్మగౌరవ వేదిక పిలుపునిచ్చింది. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ లంబాడీ ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సభలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, అమర్‌సింగ్, మాజీ ఎంపీలు సీతారాంనాయక్, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, తెగ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రనాయక్, కరాటే రాజునాయక్, నెహ్రూనాయక్, సంపత్‌నాయక్, శరత్‌నాయక్, రవీందర్‌నాయక్, భీంరావ్‌నాయక్ తదితరులు పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే లంబాడీ బంజారా ప్రజలను గిరిజన తెగలుగా గుర్తించారని, నిజాం కాలంలో చేసిన జనగణనతో లంబాడీలను గిరిజనులుగా గుర్తించారని వక్తలు వివరించారు. చరిత్ర తెలియకుండా కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోని ప్రతి తండాలోని లంబాడీ ప్రజలను చైతన్యం చేసేందుకు బస్సుయాత్ర చేపడతామని, లంబాడీ గిరిజన హక్కుల సాధన కోసం హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో లంబాడీ ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లంబాడీ, ఇతర తెగలకు మధ్య జరుగుతున్న వివాదాన్ని నివారించేందుకు ప్రభుత్వం పెద్దన్న పాత్ర వహించి ఇరుపక్షాలను కూర్చోబెట్టి మాట్లాడాలని కోరారు. రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన జాటోత్ టానునాయక్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ ట్రైకార్ చైర్మన్ రామచంద్రునాయక్, మాజీ జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్, హరికిషన్‌నాయక్, ఎల్జేఏసీ కన్వీనర్ జైసింగ్‌రాథోడ్, టీచర్స్ యూనియన్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, నాయకులు విజేందర్‌నాయక్, సురేశ్‌నాయక్, మహేశ్‌నాయక్, రమేశ్‌రాథోడ్‌తోపాటు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడియం తొండిమాటలు

ఫిరాయింపుపై కొత్త బొంకుడు

ఏ పార్టీలో ఉన్నది ఆయనకే తెలియదట

ఏ పార్టీలో ఉన్నారో స్పీకర్ తేలుస్తారట

సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ

హనుమకొండ, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మరోసారి తొండిమాటలు మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నాడనేది అసెంబ్లీ స్పీకర్ చెబుతారని పేర్కొన్నారు. కడియం శ్రీహరి శుక్రవారం హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాన అంశంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని చెప్పారు. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు డైరెక్షన్ మాత్రమే ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ స్పీకర్ నుంచి నోటీసు వచ్చిందని, సమాధానం ఇచ్చేందుకు ఇంకా గడువు ఉన్నదని చెప్పారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పీకర్ నిర్ణయం ప్రకారం నడుచుకుంటానని అన్నారు. టీడీపీ నుంచి బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన కడియం ఫిరాయింపులను సమర్థించనని చెప్పడంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆరుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మళ్లీ నోటీసులు

- మరిన్ని ఆధారాలు కావాలని సూచన
- ఎమ్మెల్యేల విచారణకు ట్రయల్ షురూ చేయనున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్.. పార్టీ ఫిరాయించిన ఆరుగురు ఎమ్మెల్యేలకు మరోసారి నోటీసులు జారీచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు నోటీసులు పంపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదుచేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జీ జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్‌కు కూడా నోటీసులు అందజేశారు. ఈ వివాదంలో మరిన్ని ఆధారాలు సమర్పించాలని స్పీకర్ ఇరుపక్షాలకు సూచించారు. ప్రస్తుతం ఉన్న ఆధారాలు సరిపోవని, అదనపు డాక్యుమెంట్లు లేదా సాక్ష్యాలు అవసరమని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులు అందిన మూడురోజుల్లో సమాధానాలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసుల్లో సూచించారు. కాగా, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ ప్రక్రియను స్పీకర్ ప్రసాద్‌కుమార్ మొదలుపెట్టనున్నారు. డిఫెక్షన్ చట్టం కింద ఈ విచారణ జరగనున్నది. ఇప్పటికే ఫిర్యాదులు అందిన నేపథ్యంలో త్వరలోనే విచారణ సెషన్లు ప్రారంభమవుతాయని అధికారవర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తీసుకురానున్నాయి. బీఆర్‌ఎస్ నాయకత్వం ఈ నోటీసులను స్వాగతిస్తూ, తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హత వేటు ఎదుర్కోవాల్సిందేనని డిమాండ్ చేస్తున్నది.

పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలు

బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం జూలై 31న తీర్పు వెలువరించింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై తేల్చాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలు జారీచేసింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com







చీకటి పాలనపై నిప్పుల తూటాలు

యూరియా కోసం రైతులు అవస్థల పాలవుతున్నారు. వారి అవస్థలను సూడలేక క్యూలో నిల్చోవడానికి చెప్పులు సైతం తిప్పలు పడుతున్నాయి. కానీ, పాలకులు మాత్రం 'పాపం' అని కనికరించడం లేదు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉరికొయ్యల కోసం ఉరుకుతా ఉంటే.. పచ్చని చెట్లు సైతం కన్నీళ్లు రాలుస్తున్నాయి. అయినా, 'రైతన్నా.. నీకు నేనున్నా..' అని ఏ నాయకుడి కన్నూ చెమర్చడం లేదు.

ఈ విషపు కూడు మేం తినలేమంటూ గురుకులాల విద్యార్థులు గుక్కపట్టి ఏడుస్తున్నారు. వారి బాధలు సూడలేక తల్లిదండ్రులు 'బిడ్డా.. మనకు గిదేం గోస..' అని గుండెలు బాదుకుంటున్నారు. కానీ, ఏలికలకు చీమ కుట్టినట్టయినా అనిపించడం లేదు. ఓ దిక్కు నీళ్లు లూటీ చేస్తూనే.. మరో దిక్కు 'ప్రాజెక్టు పనికిరాద'ని విషప్రచారాలు చేయజూస్తున్నారు.

వెరసి అరచేతి వైకుంఠం పాలన అస్తవ్యస్థమైంది. అసత్యాల ప్రభుత్వంలో ప్రజల జీవనం దుర్భరమైంది. అందుకే, జన ప్రభంజనం జాగృతమై తిరగబడుతున్నది. పండుగ ఏదైనా 'దేఖ్ లేంగే' అని వార్నింగ్ ఇస్తున్నది. నాడు స్వరాష్ట్రం కోసం సకల జనుల సమ్మెకు ఉద్యమించిన తెలంగాణ సమాజం నేడు సర్కారు దమన నీతి మీద సమరం చేస్తున్నది. సకలజనులకు మద్దతుగా కవిలోకం కలాలు ఝళిపిస్తున్నారు. కవనాలు నూరుతున్నారు. చీకటి పాలనపై వారు గురిపెట్టిన నిప్పుల తూటాల పరంపర ఇదీ...

బరాబర్ అద్భుతం

తెలంగాణ విముక్తి ఫలాలు బుక్కుతూ
తెలంగాణ తెచ్చినోళ్ళని , జనాన్ని
ఈసడించుకుంటూ, బట్టగాల్చి మీదేసి
బద్నాంజేస్తూ, ఆనందించే శాడిస్టులను
ఏందిదని నిలదీసి, బరాబర్ అద్భుతం

పరాన్నబుక్కులు, మన నీళ్ళను తాగ్తుంటె,
కళ్ళుండీ చూడని, కబోదులమని కూకుని
అధికారపు మత్తుల జోగుతూ, ఊకున్నోళ్ళని
రేపు తెలంగాణ మాగాణమెట్ల పండుద్దని
మీడియా ముందర నిలబెట్టి, బరాబర్ అద్భుతం

బుర్దల బొర్లె మట్టి మనుషుల దిక్కే చూడక
నీళ్ళియ్యక, గింజలియ్యక, ఎర్వులియ్యక
రైతు సహాయ మందక, అప్పులు దొరక్క
ముప్పు తిప్పల బడ్తున్న కాడి బతుకుల
వెతల కతలు బయటెట్టి, బరాబర్ అద్భుతం

బీదా బిక్కి, ముక్కీ కక్కి, చెమట్ల గార్చి నీడేస్కుంటె
వంకర నిర్మాణాలను కూల్చి, ఏం సాధించ్రను?
గోసిపాతంత, మూసీ బాగుపడి బట్ట గట్టలె,
వాళ్ళ ఉసురు, ఓట్ల ముసురై ముంచెస్తే,
మీరే గుడిశల దాక్కుంటరని, బరాబర్ అద్భుతం

గురుకులాల, పేదల పిల్లోళ్ళు, కుళ్ళిన బువ్వ
గత్త పారుడ్లాంటి, పుల్సు మింగలేక మింగి,
దవాఖాన్ల షరీకై సత్తుంటె, తూతూ మంత్రంగా,
పల్కరించి పోతె, వాళ్ళకి ముందుకాలం ఏది?
కడ్పుల బాధొచ్చి, ఇదేంటని బరాబర్ అద్భుతం

కులవృత్తులోళ్ళ సత్తువ సన్నగిల్లి సచ్చుబడ్తె
ఆకలి కత్తుల వంతెన మీన గతిలేక పండబట్టె.
వాళ్ళకాయాలు, వల్ల కాట్లో కాలక మురిగ పోతుంటె
ఎవర్నడగాలో, ఏం చెయ్యాలో, ఎట్ల బత్కాల్నోనని
కుముల్తున్న జనం కష్టాన్ని, బరాబర్ అద్భుతం

మందింతగా, ఎన్నో గోసలు పడ్తున్నా, గుడ్లప్పగించి
చచ్చిన గొడ్డు కాడ కూకున్న రాబందుల్లాంటి వాళ్ళు
వచ్చిపోయే చుట్టాల మాటేగాని మంచీ చెడూ లేదు
ఆపదల్లో ఇరుక్కున్న ఆపన్నుల కంటి నీరు చూడలేక
ముందుకొచ్చి, జనంతో కల్సి, బరాబర్ అద్భుతం



కమ్మ రంగారావు
94401 79410



నన్ను దేవున్ని చేసింద్రు.. వసుదేవుడిని!



ఉప్పుల శ్రీనివాస్
91002 57358

తాత మా అయ్యకు చెప్తే...
నాయిన నాకు చెప్పిండు
బిడ్డా... మనం రైతులమే కాదు
దేశానికే రాజులమని
ఇగ నేను ఊహల ప్రపంచంలో
ఉయ్యాలలూగుడు మొదలుపెట్టిన...

భళిరా అంటే బండి గీరె
మీదెసుకొనే రకం నేను
నాయకులందరూ పైకి లేపి నన్ను
చెట్టు ఎక్కిచ్చింద్రు అనుకున్న
మునగ చెట్టు అని తెలుసుకోలేకున్న..
ఎందుకంటే నేను
ఊహల ప్రపంచంలో ఊరేగుతున్న...
||ఊహల ప్రపంచంలో||

పిల్లనిచ్చే మామ అడిగిండు
ఏం నౌకరి నీదని..
ఎవ్వనికి తల వంచని
ఉద్యోగం నాదని
గల్లా ఎగిరేసి చెప్పిన..
ఎందుకంటే... నేను...
||ఊహల ప్రపంచంలో||

నీ చేతులు మట్టిని తాకితేనే
మా వేళ్ళు నోట్లోకి పోతాయి
అనే ప్రసంగాలు విని
ఉబ్బి తబ్బిబ్బయి పోయిన..
నా అంత మొనగాడే లేడనుకున్నా
ఎందుకంటే నేను
||ఊహల ప్రపంచంలో||

నువ్వే దేశానికి నిజమైన రాజువు
నువ్వే వెన్నెముకవు అని చెప్పి
నాయకులే నా వెన్నుపూసను
విరగ్గొట్టినా.. విరగ్గొడుతున్నా
పసిగట్టలేకపోతున్నా..
ఎందుకంటే నేను
||ఊహల ప్రపంచంలో||


నేడు ఒక్క బత్త యూరియా కోసం
రాజు నుంచి ఏకంగా నన్ను
దేవున్ని చేసింద్రు.. 'వసుదేవున్ని'
అయినా మంచిదే.. నోరు మూసుకున్న
ఎందుకంటే నేను
||ఊహల ప్రపంచంలో||

తన బిడ్డను బ్రతికించుకోవడం కోసం..
ఆనాడు గాడిద అడ్డం
నా పంటను బతికించుకోవడం కోసం...
ఇప్పుడు నాయకులడ్డం

ఇప్పుడు నేను ఊహల ప్రపంచం నుంచి
బయటపడ్డ రాజును కాదని తెలుసుకున్న

నిజానికి నేను/ ఎద్దు కొమ్మును..
నాగటి కర్రను../ బండి ఇరుసును..
గద్ద ముక్కును.../ గరుత్మంతుని రెక్కను..
ఏనుగు తొండాన్ని../ ఎలుగుబంటి గోరును
పులి పంజాను.. అయినా/ నేను ఉత్త మనిషినే...
సత్తువ లేని రైతునే../ ఎందుకంటే నేను
ఊహల ప్రపంచం నుంచి బయటపడ్డ...

చెట్టు ఉసురు ఊరికే పోదు



మట్టి చేలో తిరగాల్సిన పాదాలు
ఎరువుగోదాముల్లో ఇరుక్కుపోయాయి
మొక్కను తడమాల్సిన చేతులు
క్యూ లైన్లలో పిసుక్కునే పనిలో పడ్డాయి
చాలీచాలని ఎరువు దరువులు
రైతుల గుండెల్లో మార్మోగుతుంటే
ఆశలు వదులుకున్న
చిగురు చిన్నబోయింది

చెట్టు ఉసురు ఊరకే పోతుందా
పొద్దు ఎరుగక కాపు కాచినా
అరకొరగా బస్తాల
బరువు నెత్తిన కుంపటై
రాత్రి నిద్రను కూడా తరిమేస్తోంది
ఎన్ని ఏకరువులు
ఏకమై గగ్గోలు పెట్టినా
గోడ దాటి గోడు
ఆవలికి వెళితే ఒట్టు

కాళ్ళు నరాలు ఎంత లాగినా
ఒంటి స్తంభం లెక్కన
నిల్చోవడమే పనైంది
రైతు వస్తాడు ఎరువు తెస్తాడు
ప్రాణం నిలుపుతాడని
ఎన్నో ఆశలు పోగేసుకుంది పంట
నిర్లక్ష్యం కాటు వేసే స్థితి గతుల మధ్య
రైతు లోకం పడిగాపులు కాస్తోంది
కళ్ళకు ఒత్తులు వేసుకొని
ఎదురు చూస్తోంది

పోషకాలు కరువైన
పిప్పి పంటలే శరణ్యమా
దిగుబడి లేని పంట రాశుల
కింద నలిగిపోవడమేనా
ఒట్టి కడుపులు చేతబట్టుకొని
కాచుక్కూర్చోవడమేనా
ఎరువు తిప్పలు ఎన్నని చెప్పను
మొక్కను బ్రతికించుకోవడానికి
ఎన్నెన్ని బాధలో...



నరెడ్డుల
రాజారెడ్డి
96660 16636

గురుకుల గోస గిది..!



చదువుల నావ అది
సోపతి సోర్సు గది
బాలల భవిత ఇది
కన్నోళ్ల కలల గది
రేపటి రూపమిది
ముచ్చన్నెల గర్వమది
గురుకుల 'వసతి గది'..!

పాకురు ట్యాంకు అది
మారని పంక గది
'వంకర' వంట గది..
ఎలుకల కొట్టమది
చినుకుకు వణికె గది
చీకటి చిమ్మె ఇది..!
'శిథిల అవస్థ' గది
'కాటి'కి దారి గిది
గురుకుల 'వసతి ఇది'..!

పేదల 'పెట్టె' గది
జల్లెడ లేని గది
'తెల్లటి చరిత' లేని
నల్లటి రాత ఇది
అయినా వసతి గదే..!

సైన్స్ ల్యాబు అది
పాటల తోట గది
'ఎవరెస్టు ఎత్తు' గిది
అయినా
ఇంకా అద్దె గదే..!

'ఓట్లు' లేని గది
పాలకులకు
'పడని' గది
'నిధులు' రాని గది
మసక సూపు గిది
సర్కారు కక్ష ఇది
సంగతి ఏంది మరి?

ఒత్తిడి ఓడేది
సదువు గెలిసేది
'ఫిన్లాండ్' దేశమది
కానని 'మెల్ల' మనది..!

కూలిన గోడలల్ల
మొలిచిన
మొలకలవి..
కుళ్లిన బువ్వ గిన్నెల
'రాలిన మొగ్గ'లెన్ని?

గుండెల బాధ ఇది
'గురుకుల గోస' గిది...



సురేంద్ర బండారు
90108 47120

అరిగోస..!

ఎడతెరపి లేకుండా
ఎడదలదరంగ రైతుల
పంట పొలాలపై
పిడుగుల జడివాన
అతివృష్టి, అనావృష్టి
రైతాంగ సేద్యాలకు
నష్ట నైవేద్యాలు
బీభత్స దృశ్యాలు
సకాలంలో అందని
యూరియాలు!?
పాలకుల ఉదాసీనత
గోడదెబ్బ చెంప
దెబ్బన్నట్లు
కొర్రిలతో కుదేలౌతున్న
హాలికులపై జాలిలేని
వానపోటు వెన్నుపోట్లకు
అతలాకుతలమైన
పంట పొలాలు
రైతన్నలకు ఎటు
చూసిన అంధకారమే
పాలుపోని వ్యథలే
ఆగు వర్షమా
సమయానుకూలంగా
వానలు చక్కగా
కురిస్తేనే కదా!
ప్రజలకు పట్టెడు కూడు
లేకుంటే
రాయచూరు ఫకీరు చిప్పే!



డాక్టర్ గన్నోజు
శ్రీనివాసాచార్య
85558 99493

కాచే వారెవరురా

పంట పొలము నడిచొచ్చి
వరుసకట్టి ఎండుతున్నది.
ఏదయా! యూరియా!!

అడిగి అడిగి ఎండ
దగడు తాకినట్టు నోరెండే
ఆసరా లేక డొక్కలు గుంజి
వశము దప్పి మట్టికాళ్లు కుంగుతున్నవి

ఆశలన్నీ విత్తులేస్తే
అడుగులేసిన పైరు
కళ్ళతోనే ఎత్తుకొని
సంటి పిల్ల లెక్క బుజగరిస్తూ
సాకే మారాజు
గుండెలో బుగులు పుట్టే
బువ్వకే ఎసరొచ్చే

ఎవడు వినునో గోసనంతా
నాయకుడా? దైవమా? దేశమా?

కాపు కష్టం కాయలేని
ప్రభుత ఎందుకు?
కోడి పిల్లను గద్దలాగా
ఎత్తుకెళ్లే సూపుల
దళారీలు వాలిపోయే

చేతిలో చిల్లరెట్టి
గంపగుత్తగా అంతా ఊడ్చుకెళితే,
ఎవరికి చెప్పుకోను
దిక్కు తెలవక
దిగులుపడే దీనుడయ్యా
దన్ను లేక వెన్నెముక
ఒరుగుతున్న దయా

కూడుపెట్టే మనసు చల్లగా
కడుపు చల్లగా ఉండునా
కలుపులెరుగని పంట లొచ్చునా...



గడ్డం
సులోచన
77028
91559

దేఖ్ లేంగే!

ఇది ఒట్టి పాటే గాదు
తెలంగాణ గుండె చప్పుడు
అవకాశం కోసం
ఎదురుచూస్తున్న రణ నినాదం!
మాట తప్పిన ప్రతిసారి
మంత్రమైన జన తంత్రమై
డీజేల నెత్తిమీద ఊరేగే
సమరశంఖారావం!
నిమజ్జనం ఒక నెపం మాత్రమే
పల్లె పట్నం తేడా లేదు
సారే కావాలంటున్నరు
సారే రావాలంటున్నరు!!
సందర్భం ఏదైనా కావచ్చు
తుఫానై ఎగిసిపడే
యుద్ధగీతం దేఖ్ లేంగే!
తిరుగుబాటుకు పెద్ద కారణాలక్కర్లేదు
నేపాల్‌లో సోషల్ మీడియా నిషేధం
నిప్పులు వెదజల్లుతే
ఇక్కడ యూరియా బస్తా
ఉరితాళ్లు పేనవచ్చు
చరిత్ర ధర పెరిగిన
ఉల్లి చేసిన లొల్లి మరిచిపోలేదు!
ఉపద్రవాలకు
నిర్దిష్ట రూపాలుండవు
మేలుకోకపోతే పాటలు కూడా
సునామీలు సృష్టిస్తాయి!!



కోట్ల వేంకటేశ్వర రెడ్డి
94402 33261

ఎర్రబడుతున్న కళ్ళు

నరం లేని నాలుక మాటలు విని
మాటలే సచ్చుబడుతున్నాయి
పరి పరి రూపాలు మార్చుకునే
ఈ మనుషుల్ని చూసి
ఊసరవెల్లులే ఉలిక్కి పడుతున్నాయి

మాట మీద నిలబడాలన్నమాటనే
పొడిచి పొడిచి చంపేస్తున్నారు
మాటంటే వాగ్భూషణం కాదు
మాటంటే మహాద్రోహం అని చాటుతున్నారు

వీళ్ళు ఎక్కడున్నా కాడి ఎత్తేసిపోయే రకమే
గుడినీ, గుడిలో బొమ్మనీ మింగేసే వైనమే

నిలబెట్టినోళ్ళు
జెండాలు పట్టి గెలిపించినోళ్లే
వీళ్లు మా వాళ్లు కాదని చెప్తుంటే
మీరున్నా లేనట్లే

ఏ రోటికి ఆ పాటే చెప్పి
మాయం చేసే రకాలను చూసి
రోకళ్లు లేస్తున్నాయి
సామెతలు సోమసిల్లుతున్నాయి
విలువలు బోరునా విలపిస్తున్నాయి

ఎన్నుకున్న నేతలను చూసి ప్రజల పశ్చాత్తాపం
ఎన్నికైన నేతలను చూసి రాజ్యాంగం కంట నీటి మంట

చెప్పిందే మాట అని, చేసిందే వేదమని
గెలుపును నోట్లతో ఎన్నిసార్లైనా కొనుక్కుంటామని
విర్రవీగే వీళ్లను చూస్తూ వదిలేస్తే
ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తారు

చట్టసభలు తమని తాము కాపాడుకోకపోతే
నేరగాళ్లదే, వేటగాళ్లదే అధికారం అవుతాది


ఎక్కడపడితే అక్కడ, ఏ ఆట పడితే ఆ ఆట
ఆడగలమనే వారి ఆటలు కట్టించాలి
రెండు రోజులు అయితే జనం మర్చిపోతారు
అనుకుంటారు కదూ
జనం దేన్నీ మరువరు
వాళ్ల చేతుల్లో ఓటు అనే
వజ్రాయుధాలున్నాయి మరువకండి

కంచెలు చేనులను మేస్తుంటే
రాయకుండా ఉండలేను
ప్రమాద హెచ్చరికలు రేవు దాటుతుంటే
సామాన్యుడు చూస్తూ ఊరుకోడు

పౌర సమాజం చూస్తూ ఊరుకోదు
జనం మేల్కొనే ఉన్నారు
కళ్ళు ఎర్రబడుతున్నాయి ఖబర్దార్



జూలూరు
గౌరీ శంకర్



నిన్ను మించినోడు లేడు

తెలంగాణ గుండె దరువు తెగిపోని బంధమ్మువు
తెలంగాణ ఆత్మాభిమానమ్మువు ఆరిపోని దీపమ్మువు
తెలంగాణ పోరులోన అగ్గిని రాజిల్లినోడ కేసీఆర్
తెలంగాణ తెచ్చినోడ దీపం వెలిగించినోడ ||తె||

వీరత్వం, ధీరత్వం, నీ తత్వం విప్లవానికే వెలుగు
చెదిరిపోని గుండెనీది అదిరిపోని కాంతివి కేసీఆర్
నీకెవ్వరు ఎదురు కేసీఆర్ నీకు నువ్వే సాటివైతివి
తెలంగాణ బతుకులన్ని మొండిమాను
బతుకులాయెనాని ||తె||

ఎండిపోయిన చెరువులను చూసి కలత చెందినావు
పాడుబడ్డ నుయ్యిలన్నీ పాతరేసి పోయెనాని కేసీఆర్
కూలిన దేవాలయాలు రాలిన కోటలు
రైతుల బతుకులు చూసి వెతలు చెందినావు ||తె||

పోరుబాట పట్టినావు పోరాడి నిల్చినావు
ఉద్యమాలనే నిర్మించి జగత్తంత చల్లినావు కేసీఆర్
కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిన్ను మించినోడు లేడు
తెచ్చిన తెలంగాణ నింపుకున్న ధీరత్వం ||తె||

నిలుపుకున్న పరువు సాటిలేని పోరాటం
వీరుడవై నిల్చినావు విజయాన్ని పొందినావు ||తె||



డాక్టర్ సందినేని
రవీందర్
94910 78515

జయహో కాళేశ్వరం

కుంగిందన్నారు
కూలిందన్నారు అవినీతన్నారు
పనికిరాదన్నారు దండగన్నారు
ఇప్పుడు మల్లన్నసాగర్ నుండే
నిరంతరం నీళ్లు అంటున్నారు
ఎంతమార్పు వేగిరమ్ముగా 'ప్రజా మార్పు'

పశువుల కాళ్లకు గాలి సోకినట్లు
వాళ్లకు కూడా ఏమన్నా సోకిందేమో
ఒకటే కుంటారు గెంతారు
దుష్ప్రచారం విపరీత వింత ప్రచారం
ప్రపంచంలో దేనికి మస్క లేనట్టు
పుట్టింది పుట్టినట్టే ఉన్నట్లు బీరాలు పలికింద్రు
మూసీ సుందరీకరణకు
భాగ్యనగర్ మంచినీటికి
కేసీఆర్ కట్టిన కాళేశ్వరమే దిక్కాయే..

ఎటు పోయింద్రు
లక్ష కోట్లు దోచింద్రు కుంభకోణాలంటూ

కానుగాకుల మీద కత్తులు నూరిన మేధావులు
తాగు సాగు నీళ్లపై కారు కూతలు కూసిన
గొట్టాలు గళాలు, పాళీలకు చంద్రగ్రహణాలు
గంగానది కాలుష్యంలా
తెలంగాణపై విషం చిమ్మి అడ్డగోలు
ప్రకటనలు రాతలు
డెంగీ దోమల దాడులు

దోచుకున్నారంటూ దాచుకున్నారంటూ
జైలు తప్పదంటూ
నోటికెంతొస్తే అంత
మూసీ ప్రవాహపు చెత్తనోళ్లు
సొక్కమైన పత్తి పుల్లల్లా
ఇడుపులలికి చుక్కలు పెడుతుంద్రు
పల్లిరిగిన దువ్వెనతో పాపిటలు
తీసి పగులబడె నవ్వులు

అరవై ఏళ్లు జలగల్లా మన రుధిరాన్ని
పీలుస్తూ అధికారంలో ఉన్నారు
మనుషుల్లో ఎన్నడు మనుషులుగా లేరు
అధికార ఉగాదులన్నీ,
సంతక సంక్రాంతులన్నీ వాళ్ళవే
మొండి చేతుల్లో ఒక్క
జల కిరణమన్న ఉదయించలే
ప్రాణహిత ఎన్నికల
ప్రచారాస్త్రంగానే మిగిలింది
గంటెడు మన్ను తియ్యలే
వరిపోసంత వంతెన కట్టలేదు

పల్లెపల్లెనా పల్లేర్లు మొలిచి
బతుకులు దేశమెల్లిపోతుంటే
వాళ్ళిక్కడ పతంగులు ఎగరేసి
తైతక్కలాడింద్రు

టపాసులు కాల్చి
దీపావళులు జరిపింద్రు
నీళ్ల జాడను కనుక్కోలే
వలసల నివారణకు ఒక్క
విధానమన్నా నోచుకోలే

కాళేశ్వరం జలేశ్వరం
యుగయుగాల జీవధార
నిండుకుండల్లా రిజర్వాయర్లు కాలువలు
ప్రతి నీటిబొట్టు కర్షక శ్రమకు అంకితమవుతుంది
నీటి అద్దాలలో
కోల్పోయిన బతుకులు
తల్లిని దువ్వుకుంటున్నాయి

పాడిపంటలు పొంగి పొరలి
పండు వెన్నెల కోలాటాలతో కైగట్టిన పాటలతో
గుండెలు గొంతెత్తి గళాలిప్పుతున్నాయి
మేఘాలు జులువ రాగాలై తాళాలెత్తి దరువులు
జల కవిత్వ గానాలకు
పరవశించి ప్రకృతి శివతాండవం నర్తిస్తుంది

రైతులు భుజాలపై శెల్లలతో తలెత్తే చిరునవ్వులు
కొత్త కొత్త పక్షులు చెట్ల కొమ్మలపై
గూళ్లల్లుకుంటున్నాయి
ఆకుపచ్చ హరిత వసంతానికి
చిరునామా కాళేశ్వరం
చేప పిల్లలు కాళేశ్వర యదార్థ
సత్యాన్ని విని గంతులేస్తున్నాయి
నిజాన్ని ఒప్పుకొన్న అబద్ధపు
నాయకులు తలలు వాలేస్తున్నారు

(మల్లన్న సాగర్ నుంచి మంచినీళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి ప్రసంగం తీరుపై)



వనపట్ల
సుబ్బయ్య
94927 65358





ఇదా పరిపాలన..? ఇది ప్రజాపాలనా..?





మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది

పండుగకైనా జీతాలివ్వండి మహాప్రభో

- ప్రభుత్వానికి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది మొర
- మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన ఎదుట బైఠాయింపు

మారుతీనగర్, సెప్టెంబర్ 19 : బతుకమ్మ, దసరా పండుగలకైనా జీతాలివ్వండి మహాప్రభో.. అంటూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సామాజిక ప్రభుత్వ దవాఖానలో పనిచేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది ప్రభుత్వాన్ని వేడుకున్నారు. శుక్రవారం మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. జీతాలు రాక ఇల్లు గడవడం కష్టంగా ఉందని, అప్పులు చేసి వెల్లదీస్తున్నామని ఆవేదన చెందారు. పండుగకు పిల్లలకు బట్టలు కొనలేని దుస్థితి ఉందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎనిమిది నెలల నుంచి జీతాలు రాకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వాధికారులు తమపై దయచూపాలని, పండుగ పూట జీతాలిప్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకున్నారు.

చిమ్మచీకటిలో డెడ్‌బాడీతో జాగారం

- చెంచు మహిళ మృతదేహాన్ని అడవిలో వదిలి వెళ్లిపోయిన 108 అంబులెన్స్ సిబ్బంది
- అడవిలో బాధితుల ఆవేదన
- చెంచు సంఘం ఆగ్రహం



అంబులెన్స్ సిబ్బంది వదిలి వెళ్లిన మృతదేహాన్ని ఆటోలో సొంతూరుకు తరలిస్తున్న కుటుంబసభ్యులు

అమ్రాబాద్, సెప్టెంబర్ 19 : చెంచు మహిళ మృతదేహాన్ని 108 అంబులెన్స్ సిబ్బంది అడవి మధ్యలో వదిలేసి వెళ్లిన అమానవీయ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఈర్లపెంటకు చెందిన గురువమ్మ(29) పది రోజులు క్రితం అనారోగ్యానికి గురైంది. అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు వెళ్లగా.. వైద్యులు మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. మహబూబ్‌నగర్ దవాఖానలో గురువమ్మ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. మహబూబ్‌నగర్ నుంచి గురువమ్మ డెడ్‌బాడీని తీసుకొని 108 అంబులెన్స్ బయలుదేరింది. అమ్రాబాద్ మండలం ఫరహాబాద్ చౌరస్తాకు రాగానే అక్కడ మృతదేహంతోపాటు, కుటుంబ సభ్యులను కిందికి దింపారు. బాధిత కుటుంబం కాళ్లా.. వేళ్లాపడినా సిబ్బంది కనికరించ లేదు. చీకట్లో అడవిలో దిక్కుతోచని స్థితిలో.. డెడ్‌బాడీతో అక్కడే ఉన్నారు. శుక్రవారం ఉదయం స్థానికుల సాయంతో మన్ననూరుకు వెళ్లి, ఆటో మాట్లాడుకొని మృతదేహాన్ని సొంతూరు తీసుకెళ్లారు. ఆదివాసీలపై వివక్ష చూపడం సరికాదని చెంచులు, చెంచు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐటీడీఏ అధికారులకు సమాచారం ఇచ్చే డెడ్‌బాడీని అక్కడ దించి వెళ్లామని అంబులెన్స్ సిబ్బంది చెప్తున్నట్టు సమాచారం.

'నో ఫ్లైజోన్'గా సెక్రటేరియట్!

- డ్రోన్‌లు ఎగరవేయకూడదని ఆదేశాలు
- సచివాలయాన్ని చిత్రీకరించకుండా ప్రభుత్వ కుట్ర అని నెటిజన్ల ఆగ్రహం
- కేసీఆర్ ఖ్యాతిని చూసి... రేవంత్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారని తీవ్ర విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సచివాలయంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాష్ట్ర పరిపాలన భవనాన్ని ఇక నుంచి 'నో ఫ్లైజోన్'లో ఉంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సచివాలయం చుట్టూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. సెక్రటేరియట్‌పై, చుట్టుపక్కల డ్రోన్ ఎగరవేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. సచివాలయం ప్రారంభోత్సవం దగ్గర్నుంచి నేటి వరకు రోజూ వేలాది మంది పర్యాటకులు అక్కడ ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. చాలామంది యువత ఆ చారిత్రక కట్టడం వద్ద బర్త్‌డేలు జరుపుకుంటూ.. ఆనందం పొందుతున్నారు. అక్కడ దృశ్యాలు చిత్రీకరించుకుంటూ మధుర జ్ఞాపకాలను పదిలపర్చుకుంటున్నారు. కాగా ఇటీవల ముగిసిన వినాయక చవితి నిమజ్జనాల్లో వినాయక విగ్రహాలు సచివాలయం ముందుకు రాగానే ఎనలేని శోభను సంతరించుకున్నాయి. తెలంగాణకు ఐకాన్‌గా ఉన్న ఈ అపూర్వ కట్టడం ఎదురుగా రాగానే చాలా మంది భక్తులు వినాయకుడి పాటలకు నృత్యాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. అదే సందర్భంలో కేసీఆర్ పాటలకు డ్యాన్సులు చేసి తమ అభిమానాన్ని వ్యక్తంచేశారు. నిమజ్జనాలు మొదలైన రోజు నుంచే వారం రోజులపాటు 'దేఖ్ లెంగే..' 'మళ్లీ సారే రావాలంటున్నారే..' 'గులాబీల జెండలే రామక్క..' వంటి పాటలు సచివాలయం వద్ద హోరెత్తాయి. ఆ పాటలకు డ్యాన్సులు చేస్తూ అభిమానులు తీసుకున్న ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒక్కో వీడియోకు కోట్లలో వ్యూస్, లక్షలు, వేలల్లో లైకులు వచ్చాయి. అదొక ట్రెండ్‌గా మారడం, నిమజ్జనం రోజున కేసీఆర్‌పై అభిమానం కట్టలు తెంచుకోవడంతో.. నిమజ్జన ఏర్పాట్లు చూసేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కూడా.. ఆ పాటల జోరును ఎక్కువసేపు చూడలేక నిమిషాల్లోనే అక్కడ నుంచి తిరిగి వెళ్లిపోయారు. ఆ సందర్భంగా కొందరు అభిమానులు డ్రోన్లు ఎగురవేసి నిమజ్జనాన్ని, హడావుడి వాతావరణాన్ని కవర్ చేశారు. నిమజ్జనమైన మరుసటి రోజు కూడా కేసీఆర్ పాటల జోరు తగ్గకపోవడంతో పోలీసులు కలుగజేసుకొని యాంప్లిఫైర్‌లు, డీజేలు తీసుకొని, నిర్వాహకులపై కేసులు పెట్టారు. ఇదే అదనుగా భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా సచివాలయాన్ని నో ఫ్లైజోన్‌గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల పట్ల నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కేసీఆర్ నిర్మించిన అద్భుతమైన సచివాలయ భవనాన్ని చూసి రేవంత్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారని మండిపడుతున్నారు. కేసీఆర్ ఖ్యాతిని కెమెరాల్లో బంధించకుండా చూసినంత మాత్రాన ప్రజల గుండెల్లో నుంచి చెరిపివేయడం రేవంత్‌రెడ్డి వల్ల కాదని తేల్చిచెప్తున్నారు.

సచివాలయ ఉద్యోగులకు తాగునీటి కష్టాలు

- ప్యూరిఫయర్లను రిపేర్ చేయించని సర్కార్
- తాగునీటి కోసం ఉద్యోగుల నుంచి నెలకు 300-400 వసూలు చేస్తున్న అధికారులు
- ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సచివాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కనీసం ఉద్యోగులకు తాగునీటిని కూడా అందించే పరిస్థితి లేకుండా పోయింది. సచివాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తాగునీటిని కూడా కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఉద్యోగులు, సిబ్బంది తాగునీటి అవసరాలు తీర్చడం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫయర్లకు ఏడాది క్రితం మరమ్మతులు చేయించాల్సి ఉంది. కనీసం వాటిని బాగు చేయించాల్సిన అధికారులు.. వాటివైపు కన్నెత్తి చూడటంలేదు. దీంతో ఉద్యోగులు నిత్యం గొంతు తడుపుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంత డబ్బులతో వాటర్‌క్యాన్‌లు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా తాగునీరు, నిర్వహణ ఖర్చులకు శాఖల వారీగా బడ్జెట్ కేటాయిస్తుంది. అయినా తాగునీటి కోసం ఉద్యోగుల నుంచి నెలకు రూ.300 నుంచి రూ.400 వరకు సొంత డబ్బులు వెచ్చించాల్సిన వస్తున్నదని ఉద్యోగులు వాపోతున్నారు. ఏడాది నుంచి సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదు. సాధారణంగా సచివాలయంలో పని చేసే ఉద్యోగులకు తాగునీరు, పారిశుధ్య నిర్వహణను ప్రభుత్వమే తీర్చాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక నిధులను ప్రతి మూడు నెలలకు ఒక సారి కేటాయిస్తుందని ఉద్యోగులు చెప్తున్నారు. కానీ సెక్షన్ ఆఫీసర్లు మాత్రం ప్రభుత్వం నుంచి వస్తున్న నిర్వహణ డబ్బులను కూడా వాటర్ క్యాన్స్ కొనుగోలు కోసమే వెచ్చిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వీరి వైఖరిపై కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరి ప్రభుత్వ అలసత్వం, అధికారుల కక్కుర్తికి తాము ఇబ్బంది పడాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



ఖమ్మం జిల్లా ఇల్లెందులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న డెయిలీవేజ్, కాంటింజెంట్ వర్కర్లు

- పట్టణంలో భారీ ర్యాలీ, క్యాంపు కార్యాలయం ఎదుట భిక్షాటన
- ఎనిమిది రోజులుగా డెయిలీవేజ్, కాంటింజెంట్ వర్కర్ల సమ్మె

ఇల్లెందు, సెప్టెంబర్ 19 : అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డెయిలీవేజ్, కాంటింజెంట్ వర్కర్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి భిక్షాటనచేశారు. ఈ సందర్భంగా డెయిలీవేజ్ వర్కర్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టళ్లలో డెయిలీవేజ్, కాంటింజెంట్ వర్కర్లు 20 ఏళ్లుగా పని చేస్తున్నారని చెప్పారు. వారికి ఇచ్చే రూ.26 వేల వేతనాన్ని రద్దు చేస్తూ జీవో 64 ద్వారా చర్యలు చేపట్టారని ఆరోపించారు. వెంటనే ఆ జీవోను రద్దు చేసి, పాత పద్ధతి ప్రకారమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సర్కార్‌పై దివ్యాంగుల సమరభేరి

- పింఛన్ల పెంపు కోసం పోరుబాట
- నేడు సామూహిక నిరాహార దీక్షలు
- దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపు చేపట్టాల్సిందేననే డిమాండ్‌తో దివ్యాంగులు పోరుబాటకు సిద్ధమయ్యారు. ఈ మేరకు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నేటి నుంచి ఆందోళనలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని అన్ని డివిజన్ కేంద్రాల్లో సామూహిక నిరాహారదీక్షలు చేపట్టనున్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్లు పెంచుతామన్న కాంగ్రెస్.. గెలిచిన తర్వాత కనీస చర్యలు చేపట్టలేదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రతినెలా రూ.6000 చొప్పున పింఛన్ అందజేయాల్సిందేనని తేల్చిచెప్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమానికి సిద్ధమయ్యామని చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ హయాంలో ప్రతినెలా 44.70 లక్షల మందికి, సుమారు రూ.1000 కోట్ల పింఛన్‌గా ఖాతాల్లో జమచేసేవారు. కానీ కాంగ్రెస్ సర్కారు పింఛన్ నగదు పెంచకపోగా లబ్ధిదారుల్లో కోతపెట్టిందని మండిపడుతున్నారు. 21 నెలల్లో 1.92 లక్షల మందిని జాబితా నుంచి తొలగించిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇచ్చిన వినతిపత్రాలు బుట్టదాఖలయ్యాయని ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ ఖజానాలో నిధుల్లేవని సాకులు చెప్తూ తప్పించుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓపిక నశించడం వల్లే ఆందోళనకు సిద్ధమయ్యామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపడుతామని, ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

20 నెలలైనా చేనేతల సమస్యలు పరిష్కరించలే..

సీఎం రేవంత్‌కు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడి బహిరంగ లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్నా అమలుకు నోచలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రూ.33 కోట్లు మాఫీ చేసేందుకు సర్కార్‌కు ఇంకెంత సమయం కావాలి? అని ప్రశ్నించారు. నేతన్న భరోసాకు దరఖాస్తులు స్వీకరించి ఆరు నెలలు గడుస్తున్నా, వాటిపై నేటికీ స్పష్టత లేదని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమ, కార్మికులు అంటే ప్రభుత్వానికి చులకన భావన సరికాదని, తమ సత్తా ఏంటో స్థానిక సంస్థల ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలని వీరమోహన్ డిమాండ్‌చేశారు.

పండుగ ప్రజలకు కాదు.. ఆర్టీసీకి!

- ప్రతి పండుగకు బస్సు చార్జీల పెంపు
- ఒక్కో టికెట్‌పై 50% అధికంగా వసూలు
- పాత జీవోలను చూపుతూ నిలువు దోపిడీ
- దసరాకు చార్జీల సవరణపై ప్రయాణికుల మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పండుల సమయంలో ఆర్టీసీ బస్సెక్కాలంటే భయమేస్తున్నదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఏ పండుగ వచ్చినా టీజీఎస్‌ఆర్టీసీ చార్జీలు పెంచేస్తున్నదని ఘొల్లుమంటున్నారు. ఒక్కో టికెట్‌పై కనీసం 50 శాతం వరకూ రేట్లు పెంచి.. ప్రయాణికులను దోచుకుంటున్నదని వాపోతున్నారు. ప్రతిసారి పాత జీవోలను సాకుగా చూపుతూ తమను జేబులు కొల్లగొడుతున్నదని మండిపడుతున్నారు. ప్రస్తుతం దసరా సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో 7,754 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ రోడ్డుపైకి దింపనుంది. ఇవి శనివారం నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు తిరగనున్నాయి. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రారంభం కానుండటంతో ఈ నెల 27 నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరుగనున్నది. వీరి కోసం 'స్పెషల్' అంటూ ఏర్పాటుచేస్తున్న సిటీ బస్సులలో కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ వంటి దూరపు ప్రాంతాలకు వెళ్లడం అసౌకర్యంగా ఉన్నదని ప్రయాణికులు అంటున్నారు.

రద్దీ పెరిగితే.. టికెట్ రేట్ చుక్కల్లోనే

ఇటీవల రాఖీ పండుగను ఆర్టీసీ సంస్థ అద్భుతమైనరీతితో 'క్యాష్' చేసుకుంది.



దూరాన్ని బట్టి ప్రత్యేక బస్సుల్లో 20 నుంచి 30శాతానికి మాత్రమే చార్జీలు పెంచామని చెప్పిన అధికారులు.. రద్దీ తీవ్రంగా ఉన్న చోట చార్జీలను 50-100 శాతానికి పెంచారు. అదే ఫార్ములా ఈసారి దసరాకు కూడా ఉంటుందని ఆర్టీసీ ముందుగానే తెలియజేసింది. దీంతో ప్రతి పండుగకు సొంతూళ్లకు వెళ్లాలనుకున్న తమను అదునుచూసి ఆర్టీసీ సంస్థ నిలువుదోపిడీ చేస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. నిరుడు ఉన్న రద్దీకి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడటంతో.. ఈ సారి స్పెషల్ బస్సు సర్వీసులను పెంచింది. అవసరమైన చోట సిటీ బస్సులు, డీలక్స్, సూపర్ డీలక్స్‌లను స్పెషల్ బస్‌లుగా నడిపేందుకు సిద్ధమైంది. ఇటువంటి రోజుల్లో చాలా రూట్లలో రెగ్యులర్ బస్సులు కనిపంచకపోవడంతో స్పెషల్ బస్సుల్లో ఎక్కుతున్నారు. దీంతో సాధారణ రోజుల్లో టికెట్ ధర రూ.100 ఉంటే.. స్పెషల్ బస్సుల్లో రూ.150 వరకూ వసూలు చేయనున్నారు. రూ.200 టికెట్ ధర ఉంటే.. రూ.300 వరకు వసూలు చేయనున్నారు.

అదునుచూసి.. పాయింట్‌పైకి స్పెషల్ బస్సులు

హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాలకు వెళ్లే రూట్లలో స్టార్టింగ్ పాయింట్‌లో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే స్పెషల్ బస్‌లను వదులుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో గంటల తరబడి బస్సు కోసం వేచి చూసిన వారు.. వచ్చిన ఆ ఒక్క స్పెషల్ బస్సును అందుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆయా డిపోల నుంచి రెగ్యులర్‌గా తిరిగే బస్సులకే స్పెషల్ బోర్డులు తగిలించి తిప్పడం ఆర్టీసీకి పరిపాటిగా మారిందని వాపోతున్నారు. ఏర్పాట్ల విషయంలో లోపాలు పెట్టుకొని.. తమ భావోద్వేగాలతో ఆడుకుంటూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారని మండిపడుతున్నారు. ఇటీవల స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్న నేపథ్యంలో ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా బస్టాండ్లు, బస్ పాయింట్లలో ఈసారి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్టు ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు.

దసరా స్పెషల్ బస్సుల్లోనే చార్జీల సవరణ

టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో వాస్తవం లేదు: ఆర్టీసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో వాస్తవం లేదని, దసరా స్పెషల్ సర్వీసుల్లోనే చార్జీల సవరణ చేపట్టామని టీజీఎస్ ఆర్టీసీ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. స్పెషల్ బస్సుల్లో మాత్రమే సాధారణ చార్జీలో 50 శాతం వరకు సవరణ అమల్లో ఉంటుందని తెలిపింది. ఆర్టీసీలో 2003 నుంచి ఈ పద్ధతి ఆనవాయితీగా వస్తున్నదని పేర్కొంది. ఇప్పుడే కొత్తగా చార్జీల సవరణ చేస్తున్నట్టు కొందరు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికింది. ప్రధాన పండుగలైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారని, రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతున్నామని తెలిపింది. ఈ నెల 20 నుంచి నడిచే స్పెషల్ బస్సుల్లోనే చార్జీల సవరణ చేయనున్నామని తెలిపింది.

దసరా వస్తే.. దండుకోవడమేనా?

- పండుగల వేళ చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తారా?
- ఆర్టీసీ బస్సుల్లో 50% చార్జీలు పెంచడం అత్యంత దుర్మార్గం
- బతుకమ్మ పండుగ సమయాన చీకట్లో గ్రామాలు: హరీశ్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ, దసరా పండుగలు వస్తే చాలు.. చార్జీల పేరుతో దండుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో ఆర్టీసీ బస్సు చార్జీలు అడ్డగోలుగా పెంచి, ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుండటం సిగ్గుచేటని శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు. పల్లెవెలుగు సహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో టికెట్ చార్జీలు విపరీతంగా పెంచి, బతుకమ్మ, దసరా పండుగుల సమయంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రత్యేక సర్వీసుల పేరుతో సాధారణ టికెట్ చార్జీలపై 50% అదనపు దోపిడీ ప్రయాణికులకు పెనుభారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ చార్జీల మోత ప్రజలకు పండుగల సంబురం కూడా లేకుండా చేస్తున్నదని, దీనికి కాంగ్రెస్ సర్కారే కారణమని మండిపడ్డారు. పండుగల సమయంలో.. ఆర్టీసీ బస్సులు పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే 'పండుగ స్పెషల్' అని బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికి ప్రజాపీడనే అవుతుందని స్పష్టంచేశారు. ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే ప్రజాపాలనా? ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి? అని ప్రశ్నించారు.

పండగ వేళ.. చీకట్లో గ్రామాలు

కాంగ్రెస్ సర్కార్ గ్రామీణ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో గ్రామ పాలనా వ్యవస్థను బలోపేతం చేస్తే, కాంగ్రెస్ పాలనలో అది కుప్పకూలిపోయిందని విమర్శించారు. బతుకమ్మ పండుగ పూట కూడా వీధిదీపాల బల్బులు వెలగడం లేదని, గ్రామాలు చీకట్లోనే మగ్గుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రహదారులు, డ్రైనేజీల మరమ్మతుల విషయంలో కూడా కాంగ్రెస్ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లకు డీజిల్ పోయించుకొనేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో అవి మూలనపడ్డాయని దుయ్యబట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేరని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని అన్నారు.

బతుకమ్మపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

తెలంగాణ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ పట్ల కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. పండుగ ఏర్పాట్లు ఎక్కడా కనిపించడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఏసీడీపీ నిధులను విడుదల చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో కంటే ఎక్కువగా ఢిల్లీలోనే ఉంటూ.. పాలన గాలికి వదిలేశారని విమర్శించారు.

అద్భుతం.. అమోఘం.. ఇది కదా అసలైన మార్పు!

'రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి, కేవలం 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే ఆలోచన అద్భుతం, అమోఘం.. కాంగ్రెస్ ప్రభుత్వ ఇంజినీరింగ్ నైపుణ్యానికి ఇది మరో నిదర్శనం. ఇది కదా.. అసలైన మార్పంటే' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్స్ వేశారు. 'మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ వరకు మొత్తం ప్రాజెక్టు ఖర్చు రూ.84,000 కోట్లు అయితే, జస్ట్ తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి అయ్యే ఖర్చు రూ.35,000 కోట్లు అవుతాయట! కాళేశ్వరం పథకంతో 37 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందివ్వాలనేది లక్ష్యం కాగా, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుతో కేవలం 4.47 లక్షల ఎకరాలకే సాగు నీరు అందిస్తారట. కాళేశ్వరంలో నీటి వినియోగం 240 టీఎంసీలు అయితే, ప్రాణహిత-చేవెళ్లలో 80 టీఎంసీలు మాత్రమే అవుతుందట' అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చితే మూడో వంతు ఖర్చు చేస్తూ, పదోవంతు ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వరట అని శుక్రవారం ఎక్స్ వేదికగా దెప్పిపొడిచారు.

లాభాల్లో 35 శాతం వాటా ప్రకటించాల్సిందే!

- కేసీఆర్ హయాంలో అడగకుండానే ఇచ్చారు
- కాంగ్రెస్ పాలనలో కార్మికులకు అన్యాయం
- టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్
- హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముట్టడి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తేతెలంగాణ):ప్రభుత్వంసింగరేణి కార్మికులకు వెంటనే 35 శాతం లాభాల వాటా ప్రకటించాలని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్నా బోనస్ ఇవ్వడంలో జాప్యమెందుకని ప్రశ్నించారు. శుక్రవారం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. 'కాంగ్రెస్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.. లాభాల్లో వాటా ప్రకటించాలి..' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అడగకుండానే సింగరేణి కార్మికులకు హక్కులను కల్పించి, గౌరవించారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ సర్కార్ అన్యాయం చేస్తున్నదని దుయ్యబట్టారు. 2023-24లో సింగరేణి వాస్తవ లాభాల్లో కేవలం 16 శాతం వాటా ఇచ్చి మోసం చేసిందని నిప్పులు చెరిగారు. అభివృద్ధి పేరిట రూ.2289 కోట్లు పక్కనబెట్టిందని ఆరోపించారు. ఇప్పటివరకు ఆ నిధుల ఖర్చుల వివరాలు వెల్లడించలేదని మండిపడ్డారు. నాడు సింగరేణి కార్మికుల ఓట్లు దండుకొనేందుకు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఇప్పుడు విస్మరిస్తున్నదని ధ్వజమెత్తారు. 2024-25 సంవత్సరంలో సంస్థ గణనీయంగా లాభాలు సాధించినందున.. వెంటనే 35 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి నష్టాల్లో కూరుకుపోయిందని, మూతపడే ప్రమాదమున్నదని చెప్తూ కాంగ్రెస్ సర్కార్ కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్నదని విమర్శించారు. చేతగాని విధానాలతోనే బొగ్గుగని కార్మికుల ఉసురు తీస్తున్నదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శులు కాపు కృష్ణ, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పర్లపల్లి రవి, కుసన వీరభద్రం, మంగీలాల్, అన్వేష్, బండి రమేశ్, నాగలి సాంబయ్య, బడితెల సమ్మయ్య, గడప రాజయ్య, వెంకటేశ్వర్లు, సంపత్, అవినాశ్, పొగాకు రమేశ్, సత్తయ్య, లక్ష్మణ్, రాజేశం, శేషగిరి, వాసర్ల జోసెఫ్, ఉప్పులేటి పర్వతాలు, జనగామ మల్లేశ్, అప్సర్‌పాషా, పుప్పాల రవీందర్, అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగిన కార్మికులు. చిత్రంలో సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి

సింగరేణి సీఎండీకి వినతి

సింగరేణి కార్యాలయం ముట్టడి సందర్భంగా కొప్పుల ఆధ్వర్యంలో సీఎండీకి వినతిపత్రం అందజేశారు. లాభాల్లో 35 శాతం వాటా ఇవ్వాలని, కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయించాలని, అలవెన్స్‌లపై ఆదాయ పన్నును యాజమాన్యమే భరించాలని, మెడికల్ బోర్డుకు వెళ్లే కార్మికులను వెంటనే అన్‌ఫిట్ చేయాలని, వేలంతో సంబంధంలేకుండా సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఇదా పరిపాలన..? ఇది ప్రజాపాలనా..?

● పొద్దటేల నుంచే క్యూలైన్



మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామ పరిధిలో ఉన్న రైతువేదిక వద్ద శుక్రవారం ఉదయం నుంచే యూరియా కోసం భారీ క్యూలైన్‌లో వేచి ఉన్న రైతులు

● కడుపు మండి రోడ్డు బంద్



యూరియా కోసం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రానికి కుటుంబాలతో సహా వచ్చిన రైతులు. యూరియా దొరకపోవడంతో తుంగతుర్తి-నాగారం మెయిన్ రోడ్డుపై బైఠాయించిన రైతులు

● నడి ఎండలో తప్పని క్యూలైన్



ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురంలో ఉన్న పీఏసీఎస్ గోడౌన్ వద్ద ఎండలోనే లైన్‌లో నిల్చున్న రైతులు

● సరిపడా ఇవ్వండి సారూ!



సరిపడా యూరియా బస్తాలు ఇవ్వాలని వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న అధికారులు

● పచ్చి బాలింతకూ తప్పని పాట్లు



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో యూరియా కోసం రెండున్నర నెలల చిన్నారితో క్యూలైన్‌లో నిల్చున్న బాలింత వాంకుడోత్ జమీల

మహిళా రైతు ప్రాణాలు తీసిన
యూరియా కొరత



మృతిచెందిన మహిళా రైతు పాతులోతు దస్సీ(ఫైల్)

అడవిదేవులపల్లి, సెప్టెంబర్ 19: యూరియా కొరత మరో మహిళా రైతు ప్రాణాలను తీసింది. లైన్‌లో నిల్చొని గాయాలపాలై 8 రోజులుగా దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూసింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. మహిళా రైతు పాతులోతు దస్సీ (55) గ్రామ పరిధిలో 30 గుంటల భూమిలో వరి సాగుచేశారు. యూరియా కోసం మండల కేంద్రంలోని రైతు వైదిక వద్ద రోజూ లైన్‌లో నిల్చుండేది. ఈ నెల 11న రైతులు భారీగా తరలి రావడంతో స్వల్పంగా తొక్కిసలాట జరిగింది. ఈ సందర్భంగా దస్సీ కిందపడిపోగా, ఆమె తుంటి ఎముక విరిగి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు దస్సీని మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నల్లగొండలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు చేర్పించారు. అక్కడ తుంటి ఎముకకు శస్త్రచికిత్స చేశారు. వారం రోజులుగా చికిత్స పొందుతున్నది. అయినా కడుపు లోపలి గాయాలు తీవ్రమై ఆమె ఆరోగ్యం విషమించి, శుక్రవారం మృతిచెందింది. ఆమె వైద్యానికి సుమారు రూ.3 లక్షలకు పైగా ఖర్చయ్యాయని, తమకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారని ఆమె భర్త కస్న తెలిపారు.

రోడ్డుప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

నెల్లికుదురు, సెప్టెంబర్ 19: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు సొసైటీలో శుక్రవారం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు బొల్లు భరత్ రెండు యూరియా బస్తాలు తీసుకున్నాడు. అందులో ఒక బస్తాను తన బైక్‌పై ఇంటి వద్ద దించి రెండో బస్తాను తీసుకొచ్చేందుకు తిరిగి నెల్లికుదురుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలోని మామిడితోట వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి పోయింది. దీంతో భరత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం భరత్‌ను వరంగల్ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

యూరియా.. దయ లేదాయె!

- కేంద్రాల వద్ద తప్పని పడిగాపులు
- యూరియా దొరక్క రైతుల ఆగ్రహం
- పలుచోట్ల అన్నదాతల రాస్తారోకో
- దోప్తాలలో రైతుపై ఏఎస్ఐ దౌర్జన్యం
- చికిత్స పొందుతూ మహిళా రైతు మృతి
- రోడ్డు ప్రమాదంలో మరొకరికి గాయాలు



ఆదిలాబాద్ జిల్లా దోప్తాల గ్రామంలోని పీఏసీఎస్ వద్ద రైతుపై దౌర్జన్యం చేస్తున్న బేల పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జీవన్‌కుమార్

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: రైతులకు యూరియా కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులకు యూరియా అడుక్కునే పరిస్థితి దాపురించింది. పోలీసుల వద్ద టోకెన్ల కోసం చేతులు చాచి అడుగుతున్నారు. బేల మండలం దోప్తాల పీఏసీఎస్ కేంద్రం వద్ద శుక్రవారం రైతులు పోలీసులకు దండంపెట్టి టోకెన్లు అడిగిన తీరు దయనీయ పరిస్థితిని తెలియజేస్తున్నది. అయినా టోకెన్ల కోసం వచ్చిన రైతును అక్కడి ఏఎస్ఐ జీవన్‌కుమార్ మోచేతితో నెట్టేసి, చెయ్యెత్తి దౌర్జన్యం ప్రదర్శించారు. ఏఎస్ఐ తీరుపై అక్కడున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, ఆ వీడియో తీసిన వ్యక్తిపై వ్యవసాయ శాఖ అధికారులు బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో యూరియా దొరుకుతుందో లేదోనని గురువారం అర్ధరాత్రి నుంచే రైతులు అక్కడి రైతు వేదికలోనే నిద్రించారు. యాదాద్రి తిరుమలగిరి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద నడి ఎండలో క్యూలైన్‌లో ఉన్న రైతులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు, తాగునీరు అందించి బాసటగా నిలిచారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం యూరియా కోసం రైతులు తుంగతుర్తి - నాగారం ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలో అర్థరాత్రి నుంచే సొసైటీల ముందు గంటలకొద్దీ నిల్చున్నా, ఒక్క బస్తా కూడా యూరియా దొరకపోడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. దీంతో అర్వపల్లిలోని పీఏసీఎస్ కేంద్రం ఎదుట జనగాం - సూర్యాపేట జాతీయ రహదారిపై రైతులు గంటసేపు ధర్నా నిర్వహించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి సొసైటీ వద్ద చెప్పులు వరుసలో పెడితే కూపన్లు, యూరియా ఇచ్చేది లేదని చెప్పడంతో, రైతులు వరుస క్రమంలో తమ ద్విచక్ర వాహనాలు పెట్టారు. అయితే గతంలో ఇచ్చిన కూపన్లు చెల్లవని చెప్పడంతో ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించారు.

ఎక్కడికక్కడ రోడ్కెక్కిన రైతులు

ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) కార్యాలయం, జిన్నింగ్ మిల్లు ప్రాంగణానికి యూరియా కోసం రైతులు భారీగా తరలివచ్చారు. కూపన్ల కోసం రైతులందరూ ఒక్కసారిగా ఎగబడటంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలోనే మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే ఆయనను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. తెల్లవారుజాము నుంచి యూరియా కోసం ఎదురుచూస్తున్నా పంపిణీ చేయలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా యూరియా బస్తాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో బీఆర్ఎస్, సీపీఎం ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. సరిపడా యూరియా అందించడంలేదని ఆరోపిస్తూ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాదన్నపేటలో బీఆర్ఎస్, ఎంసీపీఐ(యు), సీపీఐ(ఎంఎల్), న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాదన్నపేట, నాగుర్లపల్లి, పర్శనాయక్ తండా, భోజ్యానాయక్ తండా రైతులు పాల్గొన్నారు. గోడౌన్‌లో యూరియా బస్తాలు ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో రైతులు రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో యూరియా కోసం కలకత్తా తండాకు చెందిన బాలింత వాంకుడోత్ జమీల తన రెండున్నర నెలల చిన్నారితో క్యూలో నిల్చున్నది. లైన్‌లో ఉన్న మహిళలు మానవత్వంతో అమెకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. రైతులకు సరిపడా యూరియా అందజేయాలని మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. యూరియా పక్కదారి పట్టడంతో రైతులు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో ఏవోను నిలదీశారు. హనుమకొండ జిల్లా శాయంపేటకు వచ్చిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు.

బలమున్నోడిదే యూరియా!

- ఒకటి కాదు పదుల సంఖ్యలో దారిమళ్లిన యూరియా లారీలు
- మిర్యాలగూడలో దారిమళ్లిన 30-40 యూరియా లోడ్‌లు
- మంత్రి కోమటిరెడ్డి అండతో చక్రంతిప్పిన ఎమ్మెల్యే బీఎల్ఆర్
- ఇదే అదనుగా సాగర్‌కు కొన్ని లారీలు మళ్లించుకున్న జానారెడ్డి?
- ఎమ్మెల్యే గన్‌మెన్ ఘటనలో వెలుగులోకి కొత్త విషయాలు
- ఆయనను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు సమాచారం



అడవిదేవులపల్లి మండలకేంద్రంలోని రైతు వేదిక వద్ద బారులు తీరిన రైతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కర్ర ఉన్నోడిదే బర్రె అన్న చందంగా అధికార బలం ఉన్నవారికే యూరియా అందుతున్నది. యూరియా కోసం రైతులు రోజుల తరబడి పీఏసీఎస్ కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. అనారోగ్యంతో క్యూలో నిలిచి ప్రాణాలు కోల్పోతున్నారు. కేంద్రం ఇవ్వడం లేదని, స్టాకు లేదని సాకులు చెప్తూ కాలం గడుపుతున్న ప్రభుత్వాధినేతలు.. వచ్చిన యూరియాను అస్మదీయుల కోసం దారి మళ్లిస్తున్నట్టు తెలుస్తున్నది. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) గన్‌మెన్ లారీ యూరియా లోడును దారి మళ్లించిన ఘటనలో తవ్వేకొద్ది కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకటి రెండు లారీల యూరియా కాదు.. ఏకంగా 30 నుంచి 40 లారీల వరకు యూరియా పక్కదారి పట్టినట్టు తెలుస్తున్నది. రాత్రికి రాత్రే వాటిని తమ ప్రాంతాలకు తరలించి ఎక్కడికక్కడ లోడును దింపేసుకున్నట్టు సమాచారం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండతో జిల్లా ఉన్నతాధికారి ఆదేశాలతో ఈ తతంగమంతా నడిచినట్టు స్థానిక విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే అదనుగా కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కూడా తన కుమారుడి నియోజకవర్గం నాగార్జునసాగర్‌కు పదుల సంఖ్యలో యూరియా లారీలు మళ్లించుకున్నట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అవసరమైన యూరియా రైల్వే వ్యాగన్ల ద్వారా మిర్యాలగూడ కేంద్రంగా దిగుమతి అవుతుంది. ఈ యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లకు, డీలర్లు చెల్లించిన డీలర్లకు చేరవేయాల్సి ఉంటుంది. వారు రైతులకు అందిస్తారు. రైల్వే వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను లారీల్లో లోడుచేసిన తర్వాత జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండతో, జిల్లా ఉన్నతాధికారి ఆదేశాలతో వ్యవసాయాధికారులు ఏకంగా 30-40 యూరియా లారీలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చెప్పిన ప్రాంతాలకు మళ్లించినట్టు తెలిసింది. కొన్ని వీడియోలు గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. యూరియా బస్తాల లోడుతో రాత్రి వేళ వెళ్తున్న ట్రాక్టర్ల వీడియోలు సైతం వాట్సాప్ గ్రూప్‌లలో చక్కర్లు కొడుతున్నాయి. లారీలకు ముందువెనుక బైక్‌లపై కొందరు అనుసరిస్తున్నట్టు వీడియో స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి తమ నియోజకవర్గ రైతులు కూడా యూరియాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తమకు కొన్ని లారీల లోడు కావాలని మళ్లించుకున్నట్టు తెలిసింది. పదుల సంఖ్యలో యూరియా లారీలు సాగర్ నియోజకవర్గానికి వెళ్లినట్టు అక్కడి విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. కాగా, లారీ యూరియా లోడు దారి మళ్లించిన ఘటనలో బీఎల్ఆర్ గన్‌మెన్‌పై జిల్లా ఎస్పీ చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. అతన్ని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు సమాచారం.

మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

- ప్రజాభవన్ వద్ద అన్నదాత కుటుంబం ఆవేదన

ఖైరతాబాద్, సెప్టెంబర్ 19: ప్రజాభవన్ వద్ద ఓ మహిళా రైతు ఆత్మహత్యకు యత్నించడం కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన మోక్ష మేరి (63)కు మూడు ఎకరాల 18 గుంటల వ్యవసాయ భూమి ఉంది. స్థానికంగా ఆమె బంధువులు భూమిని ఆక్రమించుకున్నారని మేరి చెప్తున్నది. గ్రామంలో ఎవరూ న్యాయం చేయడంలేదని, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తూ మనస్తాపానికి గురైంది. శుక్రవారం భర్త లాజర్ (66), కొడుకులు ప్రసాద్‌రాజ్, దిలీప్‌తో కలిసి ప్రజాభవన్ వద్దకు వచ్చింది. మీడియా పాయింట్ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.



పరిగి మండలం రంగాపూర్ రైతువేదిక వద్ద రైతుల ఆందోళన

రేడియల్ రోడ్డు వద్దే వద్దు

- వికారాబాద్ జిల్లాలో బాధిత వ్యవసాయ రైతుల ఆందోళన
- పరిగి మండలం రంగాపూర్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం
- భూములిచ్చే ప్రసక్తే లేదని వెల్లడి


పరిగి, సెప్టెంబర్ 19 : శంషాబాద్ నుంచి పరిగి రేడియల్ రోడ్డు నిర్మాణం చేపట్టవద్దంటూ భూములు కోల్పోతున్న రైతులు శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ రైతువేదిక వద్ద రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పచ్చటి పంటలు పండే పొలాల్లో రేడియల్ రోడ్డు వేస్తామంటే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రేడియల్ రోడ్డు నిర్మాణంతో రంగాపూర్, పెద్ద మాదారం, చిన్న మాదారం, మంచన్‌పల్లి, మరియపురం, పుడుగుర్తి, కంకల్, మిట్టకంకల్‌లో పేదల భూములు పోతాయని వాపోయారు. పేదల భూములే లక్ష్యంగా 333 ఫీట్ల వెడల్పుతో శంషాబాద్ నుంచి పరిగి రేడియల్ రోడ్డు వేస్తామంటూ ప్రభుత్వం పేర్కొనడం సరికాదని మండిపడ్డారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్ వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. శంషాబాద్ నుంచి నాగర్‌గూడ వరకు ఉన్న వంద ఫీట్ల రోడ్డును కొనసాగించి నేవీ రాడార్ వరకు ఇవ్వాలేకాని కానీ శంషాబాద్-పరిగి రోడ్డు వద్దని తేల్చిచెప్పారు. రేడియల్ రోడ్డుకు వ్యతిరేకంగా త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు. రైతులకు సంఘీభావంగా పూడూరు మాజీ ఎంపీపీ మల్లేశం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి కొడంగల్, పరిగి ప్రజలపై ప్రేమ ఉంటే పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ఆరు లేన్‌ల రోడ్డు, షాద్‌నగర్ నుంచి పరిగి రోడ్డును పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. సీఎం త్వరగా కొడంగల్‌కు వెళ్లాలనుకుంటే ఉన్న రోడ్డునే మరో 2 లేన్‌లు పెంచాలని సూచించారు. ట్రిబుల్ ఆర్‌కు రేడియల్ రోడ్డు నిర్మాణం దేనికని, రైతుల ప్రాణాలు తీయడానికా అని రైతు నాయకుడు ఆనంద్ ప్రశ్నించారు.

రేడియల్ రోడ్డుతో ఎకరం పొలం పోతుంది

ప్రభుత్వం కొత్తగా చేపట్టనున్న రేడియల్ రోడ్డు నిర్మాణంతో మా ఎకరం భూమి పోతున్నది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి రూ.3 కోట్లు పలుకుతున్నది. మాకు తెలియకుండానే రేడియల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ విడుదల చేశారు. ఉన్న కొంత భూమి రోడ్డుకు పోతుంటే మేము ఎట్ల బతకాలి. మా జీవితాలన్నీ ఆగమవుతాయి. రోడ్డు కోసం మా భూములు తీసుకోవద్దు.

-బాల్‌రాజ్, రైతు, రంగాపూర్

● మా భూములు లాక్కోవద్దు



తమ జీవనాధారమైన సాగు భూములు రీజినల్ రింగ్ రోడ్డుకు తీసుకోవద్దని చిట్టిగిద్ద, దాతాపూర్, చించల్‌పేట, వట్టిమీనపల్లి, యావపూర్, నవాబుపేట మండల రైతులు మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. శుక్రవారం బాధిత రైతులు స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి తమ గోడును వినిపించారు. - నవాబుపేట

పరిహారం వద్దు.. మా భూములు మాగ్గావాలె

- సీసీఎల్ఏ కోర్టులో ఫార్మా రైతులు



సీసీఎల్ఏ కోర్టుకు హాజరైన ఫార్మా బాధిత రైతులు

యాచారం, సెప్టెంబర్19: రంగారెడ్డి జిల్లా ఫార్మా బాధిత రైతులు శుక్రవారం నగరంలోని నాంపల్లి (సీసీఎల్ఏ) అథారిటీ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ద్వారా రైతులు అందుకున్న నోటీసులను జడ్జికి అందజేసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఫార్మాసిటీకి తీసుకున్న భూములకు గతంలోనే పరిహారం డబ్బులను అథారిటీలో జమచేశామని, మీరు ఎందుకు తీసుకోవడంలేదని, ఇంకా ఏమైనా పరిహారం ఎక్కువ కావాలా అని జడ్జి రైతులను అడిగారు. దీంతో ఫార్మాకు భూములు ఇవ్వలేదని, తమకు పరిహారం ఎందుకు ఇస్తున్నారని బాధిత రైతులు కళ్లెం లక్ష్మి, మర్రి సుభాష్‌రెడ్డి, ఉడుతల బాలమణి, కానమోని గణేశ్, ముత్యాల అనంతరెడ్డి ప్రశ్నించారు. అవార్డు రద్దు అయిన కాపీ, కోర్టు ఆర్డరు కాపీని సైతం జడ్జికి అందజేశారు. హైకోర్టులో అవార్డు రద్దు అయి, కోర్టులో స్టే ఉండగా మళ్లీ నోటీసులు ఎలా పంపిస్తారని రైతులు నిలదీశారు. తమకు ప్రభుత్వ పరిహారం వద్దని, ప్రాణం పోయినా ప్రభుత్వానికి భూములివ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. అవసరమైతే ఉన్నత న్యాయస్థానానికి వెళతామని స్పష్టంచేశారు. వృద్ధులను కోర్టు చుట్టూ తిప్పడం అధికారులకు ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

ఘట్‌కేసర్‌లో రైతుల భిక్షాటన

రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ ● ప్రభుత్వ తీరుపై వినూత్న నిరసన ప్రదర్శన

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీ కొర్రీలపై అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. దీంతో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వైఖరిపై రైతులు నిప్పులు చెరుగుతున్నారు. రైతు రుణమాఫీ వర్తింపచేయాలంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ ఉమ్మడి మండల రైతులు భిక్షాటన చేసి ప్రభుత్వంపై నిరసన తెలిపారు. ఘట్‌కేసర్‌లోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద 'రైతు రుణమాఫీ సాధన సమితి' ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల రిలే నిరహార దీక్ష 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న రైతులకు బీఆర్ఎస్ ఘట్‌కేసర్ పట్టణ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, పట్టణ జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మండల రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ బిక్షపతిగౌడ్, డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు దీక్షతో స్పందించకపోతే భవిష్యత్తులో ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గడ్డురోజులేనని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మహేశ్వర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న రైతులు, పాల్గొన్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు

అల్పాహారంలో పురుగులు

- వీర్నపల్లి కస్తూర్బాలో కలకలం
- సోషల్ మీడియాలో వైరల్

వీర్నపల్లి, సెప్టెంబర్19 : రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం అల్పాహారం (ఉప్మా)లో పురుగులు రావడం కలకలం రేపింది. పురుగులను గుర్తించిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పురుగులకు సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో ఎంఈవో శ్రీనివాస్ పాఠశాలకు చేరుకొని, ఘటనపై ఆరాతీశారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అల్పాహారంలో పురుగులు వచ్చాయనే విషయం ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ విషయంపై ఎంఈవో శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా, అల్పాహారంలో పురుగులు వచ్చినట్టు ముగ్గురు విద్యార్థినులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. పునరావృతమైతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

...కృష్ణా నీటిపై పెను కుట్ర

- రేవంత్ ప్రభుత్వం 21 నెలలుగా మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతు చేయకుండా ప్రాణహిత నీటిని దిగువకు ఎందుకు వదిలిపెడుతున్నది?
- ఏపీ సీఎం చంద్రబాబు ఉన్నపళంగా రూపకల్పన చేసిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం ఆగమేఘాల మీద సమావేశాన్ని ఏర్పాటు చేస్తే రేవంత్ ఢిల్లీకి పోయి సంతకాలు ఎందుకు పెట్టొచ్చారు?
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 5 లక్షల ఎకరాలకు కృష్ణా నీళ్లు ఇచ్చేందుకు కేసీఆర్ టెండర్లు పిలిస్తే.. వాటిని రద్దుచేసిన రేవంత్‌రెడ్డి తమ్మిడిహట్టి వద్ద బరాజ్ కట్టి గోదావరి జలాలు ఇస్తామని ఎందుకు ప్రకటించారు?
- తెలంగాణను ఎడారిగా మార్చే బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్-2 అవార్డు (కేడబ్ల్యూడీటీ) అమలు ద్వారా కృష్ణాజలాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయాలని బీజేపీ ప్రభుత్వం పావులు కదుపుతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి ఎందుకు నోరెత్తడం లేదు?
- తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే ఆల్మట్టి ఎత్తు పెంపునకు కర్ణాటక సర్కారు క్యాబినెట్ ఆమోదం తెలిపితే.. సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపుతామని మహారాష్ట్ర సీఎం ప్రకటించారు. మరి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం నాలుగు రోజులైనా దానిపై ఎందుకు స్పందించడం లేదు?



మొదటిపేజీ తరువాయి...

పర్యవసానమే కృష్ణాలో 500.. గోదావరిలో 1000 టీఎంసీల ప్రకటనగా అభివర్ణిస్తున్నారు. మరి నదీ పరీవాహక ప్రాంతం, ప్రాజెక్టులు, వినియోగం అంతకుమించి సాగు భూములను బేరీజు వేస్తే ఏ చట్టాల ప్రకారమైనా తెలంగాణకు హక్కుభుక్తంగా రెండు నదుల్లో 3000 టీఎంసీలకు పైగా వాటా వస్తుంది. అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం అందులో సగం చాలని అనడం వెనుక అసలు కుట్ర దాగి ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు దక్కాల్సిన 3 వేలకు పైగా టీఎంసీల్లో 1500 టీఎంసీలు మాత్రమే చాలంటే మిగిలిన నదీ జలాలను పొరుగు రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు రంగం సిద్ధమైందని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కేంద్రంతో కలిసి వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. కాళేశ్వరంను బద్నాం చేస్తూ మేడిగడ్డను ఎండబెట్టి బనకచర్లకు మార్గం సుగమం చేయడం.. తమ్మిడిహట్టి రూపంలో ప్రాణహిత-చేవెళ్లను తెరపైకి తెచ్చి కృష్ణాజలాల్లో మన వాటాకే గండికొట్టడం.. చివరగా ఆల్మట్టి ఎత్తు పెంపుతో కర్ణాటక, తుంగభద్ర-ఆర్డీఎస్ కుడి కాల్వలతో ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణాలో వాటా పెంచడం.. ఇలా పద్ధతి ప్రకారం తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని సాగునీటి రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ప్రాణహిత ఫినిష్ ఇలా..

సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు గోదావరి జలాల్లో జరిగిన ప్రధాన అన్యాయం ఏమిటంటే నీళ్లున్న చోట ప్రాజెక్టులు లేవు, ప్రాజెక్టులున్న చోట నీళ్లు లేవు! ఇందుకు కారణం.. నీళ్లున్న ప్రాణహిత మీద ప్రాజెక్టులు కడితే కింద ఉన్న ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు నీళ్లు రావు. అందులో భాగంగానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నీళ్లులేని తమ్మిడిహట్టి దగ్గర రూపొందిస్తే కేసీఆర్ నీళ్లున్న మేడిగడ్డ దగ్గరకు మార్చారు. మిగిలిన ప్రాజెక్టు అంతా గతంలోనిదే. కాకపోతే సమైక్య పాలకులు 16.4 టీఎంసీల నీటి నిల్వకు రిజర్వాయర్లు కడితే కేసీఆర్ 141 టీఎంసీల నిల్వ కోసం రిజర్వాయర్లు నిర్మించారు. దీని ద్వారా పుష్కల నీటిలభ్యత ఉన్న ప్రాణహిత జలాలను వినియోగించుకోవచ్చు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత సరిగ్గా ఎక్కడైతే అన్యాయాన్ని సవరించారో.. దాన్నే తప్పుపట్టి తిరిగి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నట్టుగానే తయారు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే దాన్ని సాకుగా చూపి గత రెండు సీజన్ల నుంచి ప్రాణహిత జలాలను కింద ఉన్న ఏపీకి వదిలిపెడుతున్నారు.

ఇదే అదునుగా బనకచర్లకు బాబు స్కెచ్

రౌతు మెత్తనైతే.. గుర్రం మూడు కాళ్ల మీద నడిచిందట! తెలంగాణ ముఖ్యమంత్రే మేడిగడ్డను ఎండబెట్టి ప్రాణహిత జలాలను కిందకు వదులుతుండటం ఏపీ సీఎం చంద్రబాబుకు కలిసొచ్చింది. అందుకే పోలవరం కాకుండా అదనంగా మరో 500-600 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకునేందుకు 200 టీఎంసీల ప్రాతిపదికన బనకచర్ల ప్రాజెక్టును రూపొందించారు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు బనకచర్లను ఆపుతానని ప్రకటించిన రేవంత్.. ఢిల్లీకి వెళ్లి సంతకం చేసివచ్చారు. కమిటీ ప్రతిపాదన నామమాత్రంగానే ఉన్నా తెలంగాణ అంగీకరించిందని చంద్రబాబే చెప్తున్నారు. ఇలా గోదావరిలో రాష్ట్రానికి తీరని ద్రోహం జరిగింది.

బనకచర్లతో కృష్ణాజలాల్లో గండి

బనకచర్లతో కేవలం గోదావరిలోనే కాదు.. కృష్ణాజలాల్లోనూ తెలంగాణకు భారీ నష్టం వాటిల్లనున్నది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే పోలవరం ప్రాజెక్టు పనులు మొదలు కాగానే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రకు కృష్ణా జలాల్లో అదనంగా 35 టీఎంసీల వాటా పెరిగింది. మిగిలిన 45 టీఎంసీలు తెలంగాణకు రావాల్సి ఉన్నా ఇప్పటికీ కేంద్రం, ఏపీ ఇవ్వడం లేదు. రేపు 200 టీఎంసీల బనకచర్ల ప్రాజెక్టు పనులు మొదలు కాగానే పోలవరంలాగానే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు కృష్ణా నీటిలో అదనంగా మరో 87.5 టీఎంసీల వాటా ఇవ్వాల్సి ఉంటుంది. 200 టీఎంసీల్లో అది పోను మిగిలిన 112.5 టీఎంసీల వాటాను గతంలో మాదిరిగానే ఎటూ తేల్చరు. ఏపీ కృష్ణా, పెన్నా బేసిన్‌కు ఎలాగూ అదనంగా గోదావరి జలాలను తరలించి అవసరాలు తీర్చుకుంటుంది. తెలంగాణ ఎటూ కొరగాకుండాపోతుంది. ఇలా మనకు అన్యాయమై ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రకు లబ్ధి కలుగుతుంది.

కృష్ణాలో నేరుగా కుట్రలు

గోదావరిలో తెలంగాణను దెబ్బకొట్టి ఇతర రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చేందుకు కాంగ్రెస్ సర్కారు పరోక్షంగా సహకరిస్తుండగా, ఇప్పుడు కృష్ణా జలాల్లో నేరుగా తెలంగాణకు నష్టం చేకూర్చి ఎడారిగా మార్చే మరో కుట్రకు బీజేపీ-బాబు వ్యూహం పన్నారు. అదేమంటే 75 శాతం విశ్వసనీయతపై (100 ఏళ్లలో 75 ఏళ్ల పాటు నదిలో వచ్చిన నీటిని లెక్కగడతారు) బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1) 2,130 టీఎంసీల కృష్ణాజలాలను బేసిన్‌లోని మూడు రాష్ట్రాలకు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్-811 టీఎంసీలు, మహారాష్ట్ర-585 టీఎంసీలు, కర్ణాటక-734 టీఎంసీలు) రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. 1976లో ఇది అమలులోకి వచ్చింది. ఆ తర్వాత కృష్ణా బేసిన్‌లో 65 శాతం విశ్వసనీయతపై జలాలను పంపిణీ చేసేందుకు కేంద్రం 2004లో బ్రిజేశ్‌కుమార్ (కేడబ్ల్యూడీటీ-2) ట్రిబ్యునల్ వేసింది. ఆ ట్రిబ్యునల్ బచావత్ కేటాయింపుల జోలికి వెళ్లకుండా అంతకు మించి ఉన్న 448 టీఎంసీలను మాత్రమే మూడు రాష్ట్రాల మధ్య (మహారాష్ట్ర-81, కర్ణాటక-173, ఉమ్మడి ఏపీ-194 టీఎంసీలుగా) పంపిణీ చేసింది. అయితే ఈ ట్రిబ్యునల్ నిర్ణయాల వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని అప్పట్లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం, మహారాష్ట్ర సుప్రీంకోర్టును ఆశ్రయించగా స్టే వచ్చింది. దీంతో ఇప్పటివరకు 448 టీఎంసీల పంపకం అనేది అమల్లోకి రాలేదు.

కేంద్రంలో చక్రం తిప్పుతున్న ఏపీ, కర్ణాటక

గతంలో నలుగురు.. ఇప్పుడు ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను తెలంగాణ గెలిపించిది. కానీ గతంలో పైసా రాలేదు. ఇప్పుడూ నయా పైసా రావడం లేదు. కానీ కర్ణాటక బీజేపీ ఎంపీలు మాత్రం.. తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం పెండింగులో ఉన్న బ్రిజేశ్ ట్రిబ్యునల్ అవార్డును అమల్లోకి తేవాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బ్రిజేశ్ అవార్డును వ్యతిరేకించినా.. ఇప్పటి ఏపీ సర్కారు మాత్రం వ్యతిరేకించడంలేదు. ఇందుకు ప్రధాన కారణం.. ఈ విషయంలో కర్ణాటకకు ఏపీ సహకరిస్తే ప్రతిఫలంగా తుంగభద్రలో ఏపీకి కర్ణాటక సహకరించే అవగాహనే అని సాగునీటిరంగ నిపుణులు చెప్తున్నారు. అంటే బ్రిజేశ్ ట్రిబ్యునల్ అవార్డు అమలైతే కర్ణాటక, ఏపీ ప్రయోజనం పొందనుండగా తెలంగాణకు మాత్రం అనేక రూపాల్లో తీవ్ర నష్టం వాటిల్లనున్నది. వాస్తవానికి కర్ణాటక, ఏపీ ఒత్తిడితో కేంద్రం ఇప్పటికే బ్రిజేశ్ అవార్డును అమలుచేసే దిశగా పావులు కదుపుతున్నది. విషయం తెలిసినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం కిమ్మనడం లేదు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం బ్రిజేశ్ ట్రిబ్యునల్ ముందు సమర్థ వాదనలు వినిపిస్తున్నామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నది. అసలు నదిలో కిందకు వరద వచ్చే దారులే మూసుకుపోతుంటే అడ్డుకోవాల్సిన ప్రభుత్వం వాటా కోసం కొట్లాడుతున్నానంటూనే పట్టింపులేనట్టుగా ఉండటం అనుమానాలకు తావిస్తున్నది.

చుక్క నీరు లేక తెలంగాణ ఎడారే

1. బ్రిజేశ్‌కుమార్ (కేడబ్ల్యూడీటీ-2) ట్రిబ్యునల్ అవార్డు అమలైతే మొదటగా తెలంగాణ మీద పిడుగులా పడేది ఆల్మట్టి ఎత్తు పెంచడం. కృష్ణా బేసిన్‌లో మొదటి జలాశయం ఆల్మట్టి. దాని ఎత్తు 519.6 మీటర్లు ఉండగా, నీటి నిల్వ 123.08 టీఎంసీలు. బ్రిజేశ్-2 ట్రిబ్యునల్ ఆల్మట్టి ఎత్తు పెంచుకునేందుకు అనుమతినిచ్చింది. 519.6 నుంచి 524.256 మీటర్ల వరకు ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుకోవచ్చని చెప్పింది. పెరిగే ఎత్తు 4.65 మీటర్లు మాత్రమే. కానీ నీటి నిల్వ సామర్థ్యం ఏకంగా 100 టీఎంసీలు పెరుగుతుంది. అంటే ఇప్పటివరకు 123.08 టీఎంసీలు నిల్వ చేసుకోగలిగిన కర్ణాటక.. ఎత్తు పెంపుతో 223.08 టీఎంసీలను నిల్వ చేసుకోవచ్చు. దీంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా మలుపుకొని ఆపై వచ్చే వరదను ఆల్మట్టిలోనే నిల్వ చేసుకుంటుంది. కిందికి చుక్క నీళ్లు రావు.
2. బ్రిజేశ్-2 అవార్డు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 194 టీఎంసీలు కేటాయించారు. అందులో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్యారీ ఓవర్ కింద 150 టీఎంసీలు, ఆర్డీఎస్ కుడి కాల్వకు 4, తెలుగుగంగకు 25, జూరాల 9, కోయిల్‌సాగర్ 3.9 టీఎంసీలు, ఇతరత్రా కేటాయింపులున్నాయి. ఇప్పుడు రెండు రాష్ట్రాలైనందున 194 టీఎంసీలను ఏపీ, తెలంగాణ పంచుకోవాలి. ముఖ్యంగా క్యారీ ఓవర్ కింద 150 టీఎంసీలు ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు కలిసొచ్చే అంశం. ఆరు దశాబ్దాల ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ తెలంగాణ గడ్డపై పట్టుమని పది టీఎంసీల కృష్ణాజలాలు నిల్వ చేసుకునే ప్రాజెక్టులు కట్టలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ అనేవి ఉమ్మడి ప్రాజెక్టులు. ఉన్న జూరాలలో పట్టుమని పది టీఎంసీలు కూడా ఉండవు. కానీ ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడే ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కేవలం పెన్నా బేసిన్‌లోనే 351 టీఎంసీల నిల్వకు రిజర్వాయర్లు నిర్మించుకున్నారు. ఇప్పుడు బ్రిజేశ్-2 అవార్డు అమల్లోకి వస్తే వరద వచ్చినప్పుడు పోతిరెడ్డిపాడు ద్వారా పెన్నాకు కృష్ణాజలాలను తరలించుకుపోయి నిల్వ చేసుకునే ఏపీ, వరదలేని సమయాల్లో శ్రీశైలం, సాగర్‌లోని నిల్వల వైపు చూస్తుంది. దీంతోపాటు ఆర్డీఎస్ కుడి కాల్వ ద్వారా ఉన్న నీటినీ పట్టుకుపోతుంది. దీంతో తెలంగాణ పరిస్థితి దయనీయంగా తయారవుతుంది.
3. బ్రిజేశ్-2 అవార్డు అమలుతో ఏపీ-కర్ణాటక పరస్పర సహకారంలో భాగంగా తుంగభద్ర నీటిని శ్రీశైలంకు రాకుండా వాడుకోవడం! ఇప్పటివరకు తుంగభద్ర కింద కర్ణాటకలో 9.3 లక్షల ఎకరాలు, ఏపీ లో 6.25 లక్షల ఎకరాలు సాగవుతుంటే తెలంగాణలో కేవలం 87 వేల ఎకరాలే సాగవుతున్నది. అంటే తుంగభద్ర నీటి వినియోగానికి తెలంగాణలో పెద్దగా అవకాశంలేదు. అందుకే కర్ణాటక-ఏపీ పరస్పర సహకారంతో ముందుకుపోతున్నాయి. ఇందులో భాగంగానే కర్ణాటక తుంగభద్ర డ్యాంలో పూడిక పేరుకుపోయి నిల్వ తగ్గిందనే సాకుతో ప్రస్తుతం ఉన్న లోలెవల్ కెనాల్‌కు సమాంతరంగా మరో కాల్వను తవ్వనున్నది. దీంతోపాటు తుంగభద్ర జలాల నిల్వకు 31 టీఎంసీల నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు పెంచుకోనున్నది. ఏపీ కూడా ప్రస్తుతమున్న హైలెవల్ కాల్వకు సమాంతరంగా మరో కాల్వను తవ్వనున్నది. అంటే నీటి వినియోగం రెట్టింపు కంటే ఎక్కువ కానున్నదని నిపుణులు చెప్తున్నారు.

నాగార్జునసాగర్‌కు వరద వచ్చేదెలా?

కృష్ణా బేసిన్‌లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి శ్రీశైలం జలాశయానికి వరద మూడు మార్గాలనుంచి ప్రధానంగా వస్తుంది. ఇందులో ఎక్కువ ఇన్‌ఫ్లోలు వచ్చే కీలకమైన మార్గాలు తుంగభద్ర, ఆల్మట్టి. భీమా నుంచి మోస్తరు ఇన్‌ఫ్లో మాత్రమే ఉంటుంది. బ్రిజేశ్-2 ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకొస్తే ఆల్మట్టి ఎత్తు పెరిగి అక్కడి నుంచి వరద దిగువన ఉన్న నారాయణపూర్‌కు, అటునుంచి జూరాల, తద్వారా శ్రీశైలం జలాశయానికి రావడమనేది కష్టమేనని నిపుణులు చెప్తున్నారు. ఇంకోవైపు తుంగభద్ర జలాల వాడకాన్ని పెంచుకునేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ భారీ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. బ్రిజేశ్-2 అవార్డు అమల్లోకి వస్తే ఆ ప్రాజెక్టులన్నీ పట్టాలెక్కి తుంగభద్ర ద్వారా శ్రీశైలానికి వచ్చే వరద భారీగా తగ్గుతుంది. ఎలాగోలా వచ్చే వరదను పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ ఎప్పటికప్పుడు మళ్లిస్తుంది. అంటే బ్రిజేశ్-2 అవార్డు అమల్లోకొస్తే ఇన్ని గండాలు తెరపైకొస్తాయి. వీటిని దాటుకొని కృష్ణా జలాలు సాగర్‌కు వచ్చేదెన్ని? అందులో ఏపీ వాటాను తట్టుకొని తెలంగాణ వాడుకునేదెన్ని?

*మాటలు సరే.. చేతల్లో చిత్తశుద్ధి ఏదీ?!

ఇప్పుడు కృష్ణాజలాల పంపకంపై కొనసాగుతున్న ట్రిబ్యునల్ జరిగేది తెలంగాణ-ఏపీ మధ్యనే. అందునా బచావత్ కేటాయించిన 811 టీఎంసీలపై మాత్రమే! అందులోనే ఏపీకెన్ని? తెలంగాణకు ఎన్ని? అనేది తేలుతుంది. అంటే ఇందులో వాటాను సాధించడం ఒక్కటే తెలంగాణకు పరిష్కారం కాదు. రాష్ట్రాన్ని ఎడారిగా మార్చే బ్రిజేశ్-2 అవార్డు అమలుపై పోరాటం సాగించాల్సిందే. లేదంటే శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు వరద వచ్చే దారులు మూసుకుపోయి భవిష్యత్తులో సాగునీటి సంక్షోభం తలెత్తే ప్రమాదమున్నది. అంతటి ముప్పును ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన రేవంత్ సర్కార్.. దానిపై కనీసంగా దృష్టిసారించడం లేదంటే ముఖ్యమంత్రి మాటల్లోనూ, చేతల్లోనూ చిత్తశుద్ధి లేదనేది స్పష్టమవుతున్నది. అందుకు ఆల్మట్టి ఎత్తు పెంపు పరిణామమే చక్కటి ఉదాహరణ. ఆల్మట్టి ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచుకొని అదనంగా వంద టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు కర్ణాటక దాదాపు 1.33 లక్షల ఎకరాల భూమిని సేకరిస్తున్నది. ఇందుకు రూ.70 వేల కోట్లు ఖర్చు చేసేందుకు అంచనాలు రూపొందించింది. ఈ మేరకు ఆల్మట్టి ఎత్తు పెంపు ప్రాజెక్టుకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇటీవల సీఎం సిద్ధరామయ్య అధ్యక్షతన భేటీ అయిన మంత్రివర్గం ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసింది. స్పందించిన మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ బ్రిజేశ్-2 అవార్డు అమలుతో తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీనిపై సుప్రీంకోర్టు తలుపు తడతామని ప్రకటించారు. కానీ మహారాష్ట్ర కంటే అనేక రెట్లు ఎక్కువ నష్టపోయే తెలంగాణ ముఖ్యమంత్రి నుంచి కనీస స్పందన లేకపోవడం దేనికి సంకేతం?

ఆల్మట్టి ఎత్తు పెంపు వ్యయంతో పోలిస్తే కాళేశ్వరం ఏపాటిది?

ఆల్మట్టి ఎత్తు పెంచి అదనంగా వంద టీఎంసీల నిల్వ పెంచుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం 1.33 లక్షల ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి వస్తుంది. ఈ ప్రాజెక్టుకు ఏకంగా రూ.70 వేల కోట్ల అంచనాను రూపొందించారు. భవిష్యత్తులో మరింత పెరగవచ్చు. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టు సామర్థ్యాన్ని వంద టీఎంసీలు పెంచేందుకే కర్ణాటక రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. అదే కాళేశ్వరం ప్రాజెక్టు తీసుకుంటే 240 టీఎంసీల గోదావరి జలాల మళ్లింపుతో దాదాపు 500 టీఎంసీల నీటి వినియోగం కోసం వేల కిలోమీటర్ల కాల్వలు, వందల కిలోమీటర్ల టన్నెళ్లు, పంపుహౌస్‌లు, బాహుబలి మోటర్లు, 3 బరాజ్‌లు.. ఇలా కండ్లు చెదిరే భారీ నిర్మాణాలు చేపట్టింది. ఇందుకు రూ.80 వేల కోట్లకు పైగా ఖర్చు చేసింది. అంటే ఆల్మట్టి ఎత్తు పెంపు అంచనా వ్యయంతో పోలిస్తే కాళేశ్వరానికి అయిన ఖర్చు ఏపాటిదో స్పష్టమవుతున్నది.

6

రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు కనబడుతున్నది. అధికారం చేపట్టిన రెండేండ్లలోనే ఆర్థిక విధ్వంసం, అస్తిత్వ విధ్వంసంతోపాటు తరతరాల తెలంగాణ ప్రయోజనాలపై గొడ్డలిపెట్టులాంటి నిర్ణయాలను అమలు జరుపుతున్నది. దశాబ్దాల పోరాటంతో, ఎన్నో గండాలు దాటి సాధించుకున్న తెలంగాణ చివరికి ఈనగాచి నక్కల పాలైందన్న వాస్తవం ప్రజల అనుభవంలోకి వస్తున్నది. ఇంకా.. ఇంకా.. అదృశ్యశక్తుల కనిపించని కుట్రలేవో రాష్ట్రాన్ని కమ్ముతున్నట్టు అనిపిస్తున్నది.

ఏ పాలకుడైనా తన రాజ్యం బాగుండాలనుకుంటాడు. ప్రజలు బాగుండాలని, సంపద పెరగాలని కోరుకుంటాడు. కానీ, దానికి భిన్నమైన దృశ్యం ఇప్పుడు తెలంగాణలో కనబడుతున్నది. బనకచర్ల పేరుతో సగం గోదావరిని ధారపోశారు. ఇచ్చంపల్లికి తలూపి మిగిలిన సగం వదలేసుకున్నారు. ఇప్పడిక కృష్ణాపై పడ్డారు. కన్నడనాట కాంగ్రెస్ సర్కారు ఆల్మట్టి ఎత్తు పెంచినా ఇక్కడి ప్రభుత్వం కిమ్మనడం లేదు. పైగా రంగారెడ్డికి తమ్మిడిహట్టి నీళ్లిస్తామని నిస్సిగ్గు ప్రకటనలు! కృష్ణా బేసిన్‌కు గోదావరి బేసిన్ నుంచి నీళ్లు తెస్తామని బేసిక్ అవగాహన ఉన్న ఎవడైనా అంటడా? ఇది మిడిమిడి జ్ఞానమా? లేక తెలంగాణ హక్కులకు నీళ్లొదిలే కుట్రనా?

తుంగభద్ర నీటిని వరద జలాల పేరుతో ఏపీ స్వాహా చేస్తున్నది. పోతిరెడ్డిపాడుతో కృష్ణా నది మొత్తం సీమకు తరలిపోతున్నది. ఆల్మట్టి పెంపుతో వంద టీఎంసీల నీటికి కర్ణాటక ఎసరుపెడుతున్నది. నావలి అదనం. అయినా ప్రభుత్వం నోరెత్తడం లేదు. అంటే గోదావరే కాదు, కృష్ణానది కూడా చేయిదాటినట్టే. ఈ అన్యాయాన్ని నిలదీయాల్సిన సర్కారు కొడంగల్ లిఫ్ట్ పనులు, కాంట్రాక్టర్లకు అడ్వాన్సులు, కమీషన్లు , ఢిల్లీ కప్పాల వ్యవహారాల్లో తలమునకలై ఉన్నది. తన నిష్క్రియాపరత్వంతో తెలంగాణకు చరిత్ర కూడా సరిదిద్దలేని శాశ్వత అన్యాయానికి కాంగ్రెస్ ఒడిగడుతున్నది. ఉన్న రెండు నదులను ఇటో రాష్ట్రం, అటో రాష్ట్రం చెరపడితే.. రేపు రాష్ట్ర భవిష్యత్తు ఏమిటి? రైతాంగం భవిష్యత్తేమిటి? కర్ణాటక, ఏపీ ప్రతిపాదించిన ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ నోట్లే మట్టే! చేతులు కాలాక.. ట్రిబ్యునళ్ల ముందు పార్లు దండాలు పెట్టినా, గుండెలు బాదుకున్నా ప్రయోజనం ఉండదు.

కట్టిన ప్రాజెక్టులకు నీటిని తిరస్కరించే హక్కు ఏ ట్రిబ్యునల్‌కూ ఉండదు. ఇదే కాంగ్రెస్ 1956లో సమైక్య రాష్ట్రం పేరుతో ఒక ద్రోహం చేసి అరవై ఏండ్లు తెలంగాణను అరిగోస పెట్టింది. మన నేల మీద మనదికాని బతుకు బతకాల్సి వచ్చింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ అంతకు మించిన చారిత్రక ద్రోహానికి ఒడిగడుతున్నది. పార్టీలు అధికారంలోకి వస్తాయ్.. పోతయ్. కానీ రాష్ట్రం శాశ్వతం. ప్రజల హక్కులు శాశ్వతం. వనరులు శాశ్వతం. విజన్ లేని.. విజ్ఞత లేని.. వికృత ప్రభుత్వం అధికారం చేపడితే ఆ రాష్ట్రానికి ఏ గతి పడుతుందో చెప్పడానికి తెలంగాణ ఒక ఉదాహరణగా మారుతుండటమే విషాదం!!

ఆల్మట్టి ఎత్తు పెంపు రాష్ట్రానికి మరణశాసనం

దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే కుట్ర

ఇంత జరిగితే ఢిల్లీలో రేవంత్ జల్సాలు

కృష్ణాల్లో హక్కు కోల్పోయే ప్రమాదం

- సుప్రీంలో కేసుండగా కర్ణాటక కాంగ్రెస్ సర్కారు దుర్మార్గపు నిర్ణయంపై రేవంత్ మాట్లాడరేం?
- మహారాష్ట్ర సీఎం స్పందించినా చలనం రాదా?
- ఓట్ చోరీ కంటే ఎమ్మెల్యేల చోరీ పెద్ద నేరం
- రాహుల్‌కు సిగ్గూశరం ఉంటే ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరాలి:కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి తెలంగాణ రైతాంగానికి మరణ శాసనం రాస్తుంటే, రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జల్సాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచాలని మూడు రోజుల కిందట కర్ణాటక మంత్రి మండలి నిర్ణయం తీసుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి దున్నపోతు మీద వాన పడ్డట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేవలం 100 టీఎంసీల కోసమే ఆల్మట్టి ఎత్తు పెంచడం లేదని, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కును బొందపెట్టి ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను ఎడారులుగా మార్చేందుకు కర్ణాటక కాంగ్రెస్ కుట్ర పన్నిందని ధ్వజమెత్తారు. ఈ కుట్రపై రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను వెంటనే అడ్డుకోకపోతే రైతులతో కలిసి మహోద్యమాన్ని నిర్మిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

రంగారెడ్డి ఎత్తిపోతల నిర్వీర్యం

ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఎందుకూ పనికిరాకుండా పోతుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో 90 శాతం పనులు పూర్తయినా ఈ పథకం నిర్వీర్యమవుతుంటే పాలమూరు బిడ్డగా చెప్పుకొనే రేవంత్ చూస్తూ ఊరుకోవడం దారుణమని మండిపడ్డారు. కర్ణాటక నుంచి కృష్ణా నీళ్లు రాకపోతే జూరాల ప్రాజెక్టే నిండదని, రేవంత్ మొదలుపెట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కూడా పడావు పడుతుందని హెచ్చరించారు.

ఎత్తు పెంపు అంశం సుప్రీంకోర్టులో

ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నదని కేటీఆర్ గుర్తుచేశారు. 2013లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం, కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్-II ఇచ్చిన అనుమతిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిందని తెలిపారు.ఎత్తు పెంపుతో మన రైతుల హక్కులు దెబ్బతింటాయని వాదించి స్టే తెచ్చిందని పేర్కొన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ కూడా ఈ పోరాటాన్ని కొనసాగించి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసి ఆ స్టే కొనసాగేలా చేశారని గుర్తుచేశారు.

మహారాష్ట్ర మద్దతుతో పోరాడాలి

కర్ణాటక నిర్ణయంపై మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ వెంటనే సుప్రీంకు వెళ్తామని ప్రకటించారని, కానీ రేవంత్ ఇంకా మొద్దునిద్ర వీడలేదని కేటీఆర్ విమర్శించారు. మహారాష్ట్ర మద్దతు కూడగట్టుకుని సుప్రీంలో పోరాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉన్నదని గుర్తుచేశారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం కేసీఆర్ పక్క రాష్ట్రాల సీఎంలతో స్వయంగా మాట్లాడి, అభ్యంతరాలను తొలగించి పూర్తిచేశారని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలన్న చిత్తశుద్ధి రేవంత్‌కు లేకపోవడం ఇక్కడి ప్రజల దురదృష్టమని వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టును బలిపెట్టి గోదావరి జలాలను ఏపీకి ధారాధత్తం చేస్తున్న రేవంత్‌రెడి, ఇప్పుడు కృష్ణా జలాలను కర్ణాటకకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నదులపై హక్కులను కాలరాస్తున్న జలదోపిడీకి వ్యతిరేకంగా మహోద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం

ఓట్‌చోరీపై గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణలో ఆ పార్టీ చేసిన ఎమ్మెల్యేల చోరీపై ఏం సమాధానం చెప్తారని కేటీఆర్ ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. రాహుల్‌గాంధీకి సిగ్గూశరం ఉంటే బీఆర్‌ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకొన్న ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని దేశమంతా తిరుగుతూ ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల దొంగతనం గురించి రాహుల్‌గాంధీ ఉపన్యాసాలు ఇస్తున్నారని గుర్తుచేశారు. కానీ, తెలంగాణలో ఆయన పార్టీ చేస్తున్న ఎమ్మెల్యేల దొంగతనం కనిపించకపోవడం, కాంగ్రెస్ డీఎన్‌ఏలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలకు, రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు.

సిగ్గుమాలిన చర్య కాదా?

బీఆర్‌ఎస్ సిద్ధాంతాలు కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసించి తెలంగాణ ప్రజలు గెలిపించిన పది మంది ఎమ్మెల్యేలను అధికార మదంతో డబ్బును ఎరగా చూపి కాంగ్రెస్‌లో చేర్చుకోవడం అనైతికం, సిగ్గుమాలిన చర్య కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా తీర్పును కాలరాసి కాంగ్రెస్ చేసిన సిగ్గుమాలిన చర్య ఓట్లను దొంగిలించడం కంటే ఘోరమైన నేరమని మండిపడ్డారు. ఓట్‌చోరీ గురించి మాట్లాడే ముందు, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన ఎమ్మెల్యేల చోరీపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా తీర్పును అపహాస్యం చేసి సంతలో పశువుల్లా తెలంగాణలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన తీరుపై భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసిన రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ము, ధైర్యం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని,ఎవరి బలం ఏంటో ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా రాహుల్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ఫిరాయింపు రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

5 అడుగుల ఎత్తుకే రూ.70 వేలకోట్లు

ఆల్మట్టి ఎత్తు పెంపు ఖర్చుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన అవినీతి ఆరోపణలను కేటీఆర్ తిప్పికొట్టారు. కేవలం 5 అడుగుల ఎత్తు పెంచేందుకు అవసరమైన భూసేకరణ కోసమే రూ.70 వేల కోట్లు ఖర్చు చేయడంతోపాటు లక్షా 30 వేల ఎకరాల భూమిని సేకరిస్తున్నామని కర్ణాటక ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. మరి 5 అడుగుల భూసేకరణకే అంత ఖర్చయితే, 3 బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1700 కిలోమీటర్ల కాలువలు.. 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్ల ఖర్చులో తప్పేమున్నదని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో ఆరు దశాబ్దాలపాటు నీటివాటాలో జరిగిన అన్యాయాన్ని సరిచేసిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ జీవధార అని పునరుద్ఘాటించారు. తెలంగాణకు కల్పతరువు, కామధేనువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు చిల్లర, డొల్ల, దుర్మార్గ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికైనా సత్యాన్ని తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





ఆర్ణవ్‌కు కాంస్యం

ఏషియన్ స్కేటింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: డెహ్రాడూన్ వేదికగా జరిగిన ఏషియన్ ఓపెన్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ స్కేటర్ ఆర్ణవ్‌రెడ్డి కాంస్య పతకంతో మెరిశాడు. బాలుర 333మీటర్ల రేసులో బరిలోకి దిగిన ఆర్ణవ్.. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ మూడో స్థానంలో నిలిచాడు. ఆసియాలో టాప్ స్కేటర్లను ఎదుర్కొంటూ టాప్-3 దక్కించుకున్నాడు. స్కేటింగ్‌లో నిలకడగా రాణిస్తున్న ఆర్ణవ్ ప్రస్తుతం కోచ్‌లు ఖాదర్, సయ్యద్ ఏషాన్, సయ్యద్ సఫీ దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడు. చిన్న వయసులోనే స్కేటింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్న ఆర్ణవ్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలన్న ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నాడు.

సూరజ్ ఓటమి

ప్రపంచ రెజ్లింగ్ టోర్నీ

జాగ్రెబ్(క్రొయేషియా): ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ సూరజ్ వశిష్ట్ పోరాటం ముగిసింది. తొలిసారి సీనియర్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన సూరజ్ అంచనాలకు మించి రాణించాడు. పురుషుల 60కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుని ఆకట్టుకున్నాడు. క్వార్టర్స్‌కు ముందు జరిగిన రెండు బౌట్లలో సూరజ్ 3-1తో అంజెల్ టెల్లెజ్‌పై, 3-1తో విక్టర్(మాల్డోవా)పై అద్భుత విజయాలు సాధించాడు.

దల్జీత్‌సింగ్‌పై ఫిర్యాదు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో అనిశ్చితి పర్వం కొనసాగుతూనే ఉన్నది. ప్రస్తుతం హెచ్‌సీఏ తాత్కాలిక అధ్యక్షునిగా కొనసాగుతున్న దల్జీత్ సింగ్ పై బీసీసీకి పలువురు క్లబ్ సెక్రటరీలు ఫిర్యాదు చేశారు. ఈనెల 28న ముంబైలో బీసీసీఐ 95వ ఏజీమ్ జరుగనుంది. ఇందుకోసం బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు ఆహ్వానం అందింది. దల్జీత్‌సింగ్ కొనసాగడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమంటూ పలువురు కార్యదర్శులు బోర్డు లేఖ రాశారు.



శాంసన్ (56)

భారత్ కష్టంగా..

ఒమన్‌పై చెమటోడ్చి విజయం ● రాణించిన శాంసన్ ● కలీమ్, మీర్జా అర్ధసెంచరీలు

అబుదాబి: ఆసియాకప్ టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన భారత్‌కు పసికూన ఒమన్ ముచ్చెమటలు పట్టించింది. సులువైన ప్రత్యర్థే కదా అని అలవోకగా తీసుకున్న టీమ్‌ఇండియా..ఒమన్‌పై చెమటోడ్చి నెగ్గింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 21 పరుగుల తేడాతో ఒమన్‌పై గెలిచింది. తొలుత టీమ్‌ఇండియా 20 ఓవర్లలో శాంసన్(45 బంతుల్లో 56, 3ఫోర్లు, 3సిక్స్‌లు), అభిషేక్‌శర్మ(38) రాణించడంతో 188/8 స్కోరు చేసింది. వీరికి తోడు అక్షర్‌పటేల్(26), తిలక్‌వర్మ(29) ఆకట్టుకున్నారు. ఫైజల్, జితెన్, కలీమ్ రెండేసి వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ 20 ఓవర్లలో 167/4 స్కోరు చేసింది. ఆమిర్ కలీమ్(46 బంతుల్లో 64, 7ఫోర్లు, 2సిక్స్‌లు), హమ్మద్ మీర్జా(33 బంతుల్లో 51, 5ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరి ధాటికి ఒక దశలో ఒమన్..భారత్‌కు షాక్ ఇస్తుందా అనిపించింది. హార్దిక్, అర్ష్‌దీప్, రానా, కుల్దీప్ ఒక్కో వికెట్ తీశారు.

కలీమ్, మీర్జా ధనాధన్: టీమ్‌ఇండియా నిర్దేశించిన లక్ష్యఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ సాధికారిక ఆటతీరుతో ఆకట్టుకుంది. నిర్జీవమైన పిచ్‌పై పసలేని టీమ్‌ఇండియా బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ ఒమన్ బ్యాటర్లు వీరవిహారం చేశారు. మరో ఓపెనర్ ఆమిర్ కలీమ్‌తో కలిసి కెప్టెన్ జతిందర్‌సింగ్(32) జట్టుకు మెరుగైన శుభారంభం అందించడంలో సఫలమయ్యాడు. గత మ్యాచ్‌లో వరుసగా విఫలమవుతూ వస్తున్న జతిందర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో కలీమ్ కూడా జత కలువడంతో ఒమన్ పవర్‌ప్లే ముగిసే సరికి 44 పరుగులు చేసింది. కుల్దీప్ 9వ ఓవర్‌లో ఎల్బీడబ్ల్యూ నుంచి కలీమ్ తప్పించుకోగా, బంతి తేడాతో జతిందర్‌సింగ్..క్లీన్‌బౌల్డ్ కావడంతో తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఇక్కణ్నుంచి కలీమ్, హమ్మద్ మీర్జా ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లారు. టీమ్‌ఇండియా బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని అంతకంతకు తగ్గించే ప్రయత్నం చేశారు. అప్పటికే మంచి టచ్‌లోకి వచ్చిన కలీమ్..దూబే 15వ ఓవర్‌లో సిక్స్‌తో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా టీమ్‌ఇండియాకు లాభం లేకపోయింది. అయితే రానా 18వ ఓవర్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన కలీమ్..హార్దిక్ సూపర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో 93 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు ముగింపు పడింది. కలీమ్ ఔటైనా మీర్జా తన జోరు కొనసాగిస్తూ అర్ధసెంచరీ చేరుకున్నాడు. హర్షిత్ 19వ ఓవర్‌లో క్యాచ్ ఔట్‌తో మీర్జా మూడో వికెట్‌గా వెనుదిరిగాడు.

శాంసన్ రాణించగా: ఇప్పటికే సూపర్-4కు అర్హత సాధించిన భారత్..ఒమన్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో పోరుకు సన్నాహకంగా భావించింది. టాస్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ మరో ఆలోచన లేకుండానే బ్యాటింగ్‌వైపు మొగ్గుచూపాడు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న గిల్(5) మరోమారు నిరాశపరిచాడు. షా ఫైజల్ వేసిన రెండో ఓవర్ మూడో బంతికి గిల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. షకీల్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్ తొలి బంతికే ఎల్బీడబ్ల్యూ నుంచి బయటపడ్డ అభిషేక్ తన సహజశైలికి తగ్గట్లు బ్యాటు ఝులిపించాడు. షకీల్‌ను లక్ష్యంగా చేసుకుంటూ గిల్..రెండు ఫోర్లు, భారీ సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. మూడో స్థానంలో వచ్చిన సంజూ శాంసన్..అభిషేక్ జత కలిశాడు. క్రీజులో నిలదొక్కుకునేందుకు శాంసన్ ప్రయత్నించగా, మరో ఎండ్‌లో అభిషేక్ బ్యాటు ఝులిపించాడు. నదీమ్ వేసిన ఐదో ఓవర్‌లో అభిషేక్ మూడు ఫోర్లతో కదం తొక్కడంతో స్కోరుబోర్డు ఊపందుకుంది. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా వికెట్ నష్టానికి 60 పరుగులు చేసింది. అభిషేక్‌కు జత కలుస్తూ శాంసన్ సిక్స్, ఫోర్‌తో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో అభిషేక్..రామానంది బౌలింగ్‌లో కీపర్ ఖత్తాకు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత క్రీజులో వచ్చిన హార్దిక్(1) అనూహ్య రీతిలో రనౌటయ్యాడు. ఈ తరుణంలో ఇన్నింగ్స్ బాధ్యతను శాంసన్ భుజానికెత్తుకున్నాడు. అక్షర్‌పటేల్(26)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. బౌండరీలతో టచ్‌లోకి వచ్చిన అక్షర్..కలీమ్ బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌తో ఔట్ కావడంతో నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా..శాంసన్ నిలకడ కనబరిచాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన దూబే(5)..కలీమ్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. ఏడో స్థానంలో వచ్చిన తిలక్‌వర్మ(29) నిలదొక్కుకోవడం టీమ్‌ఇండియాకు కలిసి వచ్చింది. తన ఇన్నింగ్స్‌లో రెండు భారీ సిక్స్‌లు, ఫోర్‌తో అలరించిన వర్మ..ఆరో వికెట్‌కు శాంసన్‌తో కలిసి 41 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో శాంసన్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆఖర్లో హర్షిత్‌రానా(13 నాటౌట్) రాణింపుతో టీమ్‌ఇండియా 188 స్కోరు అందుకుంది. ఇదిలా ఉంటే బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం కెప్టెన్ సూర్యకుమార్ ఆఖరి స్థానానికి పరిమితం కావడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 188/8(శాంసన్ 56, అభిషేక్‌శర్మ 38, ఫైజల్ 2/23, అమీర్ కలీమ్ 2/31), ఒమన్: 20 ఓవర్లలో 167/4(కలీమ్ 64, మీర్జా 51, కుల్దీప్ 1/23, రానా 1/25)

సెమీస్‌లో సాత్విక్ జోడీ

సింధుకు చుక్కెదురు, చైనా మాస్టర్స్ టోర్నీ



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత సీనియర్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లోనే నిష్క్రమించగా, స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-14, 21-14తో చైనా జోడీ రెన్ జింగ్ యు, జీ హనోన్‌పై అలవోక విజయం సాధించింది. 38 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ఎనిమిదో సీడ్ సాత్విక్, చిరాగ్ జంట వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఇటీవల నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న ఈ ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ..చైనీస్ షట్లర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కండ్లు చెదిరే స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్, డ్రాప్‌షాట్లతో భారత యువ జంట టైటిల్‌కు మరో రెండడుగుల దూరంలో నిలిచింది. సెమీస్‌లో మలేషియాకు చెందిన ఆరోన్ చియా, సోహ్ వు యిక్‌తో సాత్విక్, చిరాగ్ తలపడుతారు. మరోవైపు మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 14-21, 13-21తో ఒలింపిక్ చాంపియన్ అన్ సె సంగ్(చైనా) చేతిలో ఓటమి పాలైంది. 38 నిమిషాల్లోనే ముగిసిన పోరులో అన్‌సీడెడ్ సింధు..టాప్‌సీడ్ సంగ్‌కు ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది.

వెల్లలగె తండ్రి అస్తమయం

● గుండెపోటుతో ఆకస్మిక మృతి



అబుదాబి: శ్రీలంక యువ క్రికెటర్ దునిత్ వెల్లలగె కుటుంబంలో విషాదం నెలకొన్నది. వెల్లలగె తండ్రి సురంగ వెల్లలగె(54) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం అఫ్గానిస్థాన్‌తో శ్రీలంక మ్యాచ్ తర్వాత తన తండ్రి చనిపోయిన విషయం తెలుసుకున్న దునిత్ హుటాహుటిన స్వదేశానికి బయల్దేరి వెళ్లాడు. దీంతో జట్టులో ఒకింత ఉద్విగ్న వాతావరణం నెలకొన్నది. ఇప్పటికే సూపర్-4కు చేరుకున్న లంక జట్టుకు దునిత్ అందుబాటులో ఉండేదానిపై అస్పష్టత నెలకొన్నది. శనివారం బంగ్లాతో తలపడనున్న లంక, 23న పాకిస్థాన్‌తో, 26న భారత్‌తో ఆడనుంది. ఇదిలా ఉంటే దునిత్ తండ్రి మృతిపై శ్రీలంక క్రికెట్ బోర్డు తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ క్లిష్ట సమయంలో అతని వెన్నంటి ఉంటామని జట్టు చీఫ్ కోచ్ సనత్ జయసూర్య ప్రకటించారు. గురువారం అఫ్గన్‌తో జరిగిన మ్యాచ్‌లో దునిత్ బౌలింగ్‌లో మహమ్మద్ నబీ ఐదు సిక్స్‌లు కొట్టి జట్టుకు పోరాడే స్కోరు అందించిన సంగతి తెలిసిందే.

పడిక్కల్ సెంచరీ

భారత్ ఏ, ఆసీస్ ఏ టెస్టు డ్రా



లక్నో: భారత్ 'ఏ', ఆస్ట్రేలియా 'ఏ' మధ్య అనధికారిక తొలి టెస్టు మ్యాచ్ ఎలాంటి ఫలితం లేకుండానే డ్రా గా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ 'ఏ' వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. ఓపెనర్లు సామ్ కొన్‌స్టాస్(27 నాటౌట్), క్యాంప్‌బెల్(24 నాటౌట్) నిలకడగా రాణించారు. యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ(5-3-4-0) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 403/4తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన యువ భారత్ 531/7 వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు దేవదత్ పడిక్కల్(281 బంతుల్లో 150, 14ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీతో కదంతొక్కాడు. ఆసీస్ యువ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో ఏడో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో ధృవ్ జురెల్(140)తో కలిసి ఐదో వికెట్‌కు 228 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కోరె రిచోలీ(3/159) మూడు వికెట్లు తీశాడు.

చారిత్రక సిరీస్‌పై గురి

నేడు భారత్, ఆస్ట్రేలియా మూడో వన్డే




న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. సొంతగడ్డపై త్వరలో మొదలుకానున్న ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచ కప్ టోర్నీకి సన్నాహకంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా..చారిత్రక సిరీస్‌పై కన్నేసింది. శనివారం జరిగే నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆసీస్‌పై గెలిచి తొలిసారి సిరీస్ దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్నది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో జరిగే డై అండ్ నైట్ మ్యాచ్‌లో ఆసీస్‌పై పట్టు సాధించేందుకు హర్మన్‌ప్రీత్‌కౌర్ కెప్టెన్సీలోని భారత్ పట్టుదలతో ఉన్నది. ఓపెనింగ్ జోడీ ప్రతికా రావల్, స్మృతి మంధన సూపర్ ఫామ్ మీద ఉండటం జట్టుకు లాభిస్తున్నది.భారత్..ఫీల్డింగ్‌లో మరీ నాసిరకంగా తయారైంది.రెండు మ్యాచ్‌ల్లో 10 క్యాచ్‌లు జారవిడవడం ఆందోళన కల్గిస్తున్నది.

టైటాన్స్ గెలుపు బాట

● తమిళ్ తలైవాస్‌పై అద్భుత విజయం



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. లీగ్‌లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిన టైటాన్స్ జూలు విదిల్చింది. శుక్రవారం సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 43-29 తేడాతో తమిళ్ తలైవాస్‌పై ఘన విజయం సాధించింది. టైటాన్స్ తరఫున విజయ్(10), భరత్(8), అంకిత్(4) రాణించారు. మరోవైపు వరుస విజయాలతో జోరుమీద కనిపించిన తలైవాస్‌కు అర్జున్ దేశ్వాల్(7), నరేందర్(6), రోనక్(4) ఆకట్టుకున్నారు. లీగ్‌లో నిలువాలంటే ఇప్పటి నుంచి ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో తెలుగు టైటాన్స్ సమిష్టి ప్రదర్శన కనబరిచింది. స్టార్ రైడర్లు విజయ్ మాలిక్, భరత్ రైడింగ్‌కు వెళ్లిన ప్రతీసారి కచ్చితంగా పాయింట్లు తీసుకొచ్చారు. ఈ విజయంతో టైటాన్స్‌నాలుగో స్థానంలో కొనసాగుతున్నది.



చిత్రం

'కాంతార-చాప్టర్ 1' సస్పెన్స్ వీడింది!

భారతీయ సినిమాలో 'కాంతార' ఓ సంచలనం అని చెప్పొచ్చు. ఈ కన్నడ డివోషనల్ థ్రిల్లర్‌కు దేశవ్యాప్తంగా ఆదరణ దక్కింది. కన్నడంలో మధ్యస్థాయి హీరోగా గుర్తింపు ఉన్న చిత్ర హీరో, దర్శకుడు రిషబ్‌శెట్టి ఈ ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా పాపులర్ అయ్యారు. ఈ నేపథ్యంలో 'కాంతార'కు సీక్వెల్‌గా రాబోతున్న 'కాంతార-చాప్టర్ 1'పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. దసరా పర్వదినం సందర్భంగా అక్టోబర్ 2న భారీ స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. అయితే రిలీజ్ డేట్ దగ్గరపడుతున్నా.. ఇప్పటివరకు ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయలేదు. దీంతో ట్రైలర్ ఎప్పుడంటూ సోషల్‌మీడియాలో పోస్ట్‌లు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాపై కావాల్సినంత హైప్ క్రియేట్ అయింది కాబట్టి మేకర్స్ ప్రచార కార్యక్రమాల్ని అంతగా పట్టించుకోవడం లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 22న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించడంతో అభిమానులు హ్యాపీగా ఫీలవుతున్నారు. మూడవ శతాబ్దంలో కదంబ వంశ పరిపాలనా కాలంలో ఈ కథ నడుస్తుందని చెబుతున్నారు. అప్పటి అరణ్యాల్లో దైవాంశ మూర్తీభవించిన భూతకోల ఆవిర్భావం, తదనంతర ఉత్కంఠభరిత పరిణామాలతో ఈ కథను హై ఇంటెన్సిటీ డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారని సమాచారం. ముఖ్యంగా క్లైమాక్స్ ఘట్టాల్ని దాదాపు 500 మంది ఫైటర్లు, వారికి సహాయకులు 3000 మంది పాల్గొనగా భారీ స్థాయిలో తెరకెక్కించారని, భారతీయ సినీ చరిత్రలో ఇదొక రికార్డని చెబుతున్నారు. హోంబలే ఫిల్మ్స్ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కించింది.

ఎన్టీఆర్‌కి స్వల్పగాయం



అగ్ర నటుడు ఎన్టీఆర్ గాయపడ్డారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఓ యాడ్ షూట్‌లో ఆయన కాలికి స్వల్పంగా గాయమైంది. యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ సమయంలో అనుకోకుండా కిందపడటంతో ఆయనకు గాయమైంది. తక్షణమే వ్యక్తిగత సిబ్బంది ఆయన్ను దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితిని అధ్యయనం చేసిన వైద్యులు రెండువారాలు విశ్రాంతి అవసరమని సూచించారు. ఈ మేరకు ఎన్టీఆర్ టీమ్ ఈ ప్రమాదంపై ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఎన్టీఆర్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మొద్దు.' అనేది ప్రకటనలో సారాంశం. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.

వార్నర్ బ్రదర్స్‌తో 'SSMB29' ఒప్పందం?



మీడియాకు అప్‌డేట్లు ఇవ్వకుండా.. ఏ మాత్రం లీకులు లేకుండా.. గుట్టుచప్పుడు కాకుండా 'SSMB 29' చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి. అయితే.. ఆయన ఎంత కట్టుదిట్టంగా ముందుకెళ్తున్నా.. ఈ సినిమాకు సంబంధించిన ఏదో ఒక వార్త మాత్రం సోషల్ మీడియాలో వినిపిస్తూనే ఉంది. రీసెంట్‌గా కెన్యా షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన కాశీ సెట్‌లో తాజా షెడ్యూల్ మొదలైంది. హీరోహీరోయిన్లు మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాలతో పాటు ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో భాగమయ్యారట. అక్టోబర్ 10 వరకూ ఈ షెడ్యూల్ ఉంటుందని తెలిసింది. ఈ సినిమాకు రాజమౌళి కాస్త డివోషనల్ టచ్ కూడా ఇస్తున్నట్టు సమాచారం. ఇదిలావుంటే.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త వైరల్‌గా మారింది. ప్రఖ్యాత హాలీవుడ్ నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్‌వారు ఇండియా మినహా మిగతా దేశాలన్నింటిలో 'SSMB 29'ని డిస్ట్రిబ్యూట్ చేయబోతున్నారట. ఇటీవలే వార్నర్ బ్రదర్స్ సంస్థతో రాజమౌళి చర్చలు జరిపారనీ, ఈ విషయంపై వారు కూడా సుముఖత వ్యక్తం చేశారని, ఇరువురూ కలిసి ఓ ఒప్పందానికి వచ్చారని తెలిసింది. గ్లోబల్‌గా సినిమాను చేరువ చేసేందుకే రాజమౌళి ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.



కొత్తవాళ్లకు స్ఫూర్తి 'లిటిల్ హార్ట్స్'

'ఈ టీమ్‌లో వారిని నేనెప్పుడూ కలవలేదు. కానీ వారితో ఏదో అనుబంధం ఉందనిపించింది. మౌళి అండ్ టీమ్ మా ఇంటికి వచ్చి మీట్ అయినప్పుడు సక్సెస్‌మీట్‌కు రావాలని అడిగారు. నేను కాదనలేక పోయా. వీళ్లంతా ఔట్‌సైడర్స్. ఏ సపోర్ట్ లేకుండా సక్సెస్ అందుకున్న వీళ్లు మరెంతో మంది కొత్తవాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తారు. ఒక్కరి సక్సెస్ ఎంతోమందికి మేలు చేస్తుంది' అన్నారు అగ్ర హీరో విజయ్ దేవరకొండ. గురువారం జరిగిన 'లిటిల్ హార్ట్స్' చిత్రం సక్సెస్ సెలబ్రేషన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా సాయిమార్తాండ్ దర్శకత్వంలో రూపొందిన 'లిటిల్ హార్ట్స్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రాన్ని బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన విజయ్ దేవరకొండ.. ఈ టీమ్ మరిన్ని సక్సెస్‌ఫుల్ మూవీస్ చేయాలని ఆకాంక్షించారు. తనకు, అల్లు అరవింద్‌గారికి విజయ్ దేవకొండ అంటే ఎంతో ఇష్టమని, త్వరలో గీతా ఆర్ట్స్‌లో విజయ్‌తో సినిమా చేయబోతున్నామని, అది ఆయన కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రమవుతుందని బన్నీ వాసు తెలిపారు. ఈ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో విజయ్ దేవరకొండ భాగం కావడం ఆనందంగా ఉందని నిర్మాత వంశీ నందిపాటి పేర్కొన్నారు.

ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ దుర్మరణం



ప్రముఖ అస్సామీ గాయకుడు, సంగీత దర్శకుడు జుబీన్ గార్గ్ (52) సింగపూర్‌లో స్కూబా డైవింగ్ సందర్భంగా చోటుచేసుకున్న ప్రమాదంలో దుర్మరణం చెందారు. అస్సామీతో పాటు బెంగాలీ, హిందీ భాషల్లో ఆయన గాయకుడిగా, స్వరకర్తగా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. హిందీ చిత్రం 'గ్యాంగ్‌స్టర్' (2006)లో ఆయన ఆలపించిన 'యా ఆలీ...' పాట దేశవ్యాప్తంగా సంగీతప్రియుల్ని అలరించింది. 'క్రిష్-3' 'ప్యార్ కే సైడ్ ఎఫెక్ట్స్' చిత్రాల్లో ఆయన పాడిన పాటలకు మంచి పేరొచ్చింది. మేఘాలయాలోని తురా నగరంలో జన్మించారు జుబీన్‌గార్గ్. బాల్యం నుంచే సంగీతంపై మక్కువ ప్రదర్శించే ఆయన 1992లో 'అనామికా' అనే అస్సామీ ఆల్బమ్ ద్వారా సంగీత ప్రయాణం ప్రారంభించారు. అనంతరం హిందీ, బెంగాలీ ఇండస్ట్రీల్లో అడుగుపెట్టి పలు విజయవంతమైన చిత్రాలకు పనిచేశారు. అస్సామీ, బెంగాలీ, నేపాలీతో పాటు 40 భాషల్లో వివిధ యాసల్లో పాటలు పాడి ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా నార్త్‌ఈస్ట్ రాష్ట్రాల్లో ఆయనకు తిరుగులేని ఫాలోయింగ్ ఉంది. జుబీన్‌గార్గ్ మృతిపట్ల అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాతో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

తమిళ జేజమ్మగా?




కొన్ని వార్తలు వినడానికే ఆశ్చర్యంగా ఉంటాయి. పదహారేండ్ల క్రితం అనుష్క నటించిన బ్లాక్ బస్టర్ 'అరుంధతి'.. కోలీవుడ్‌లో ఇప్పుడు రీమేక్ కానున్నదట. మరి ఇంతకీ తమిళ జేజమ్మ ఎవరు? అనంటే ఊహించని సమాధానం కోలీవుడ్ మీడియాలో వినిపిస్తున్నది. తమిళ జేజమ్మగా శ్రీలీల నటించనున్నదట. నిర్మాత ఎడిటర్ మోహన్ తనయుడు, ప్రముఖ దర్శకుడు మోహన్‌రాజా ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారట. నిజానికి తెలుగునాట 'అరుంధతి' సినిమాకు ప్రత్యేకమైన అభిమానులున్నారు. ఆ సినిమాను అంత గొప్పగా మలిచారు లెజెండరీ డైరెక్టర్ కోడి రామకృష్ణ. మరి మోహన్‌రాజా ఆ స్థాయిలో అరుంధతిని తెరకెక్కించగలడా? అసలు జేజమ్మగా, అరుంధతిగా రెండు పొంతన లేని బరువైన పాత్రలను అద్భుతంగా పోషించి అదరగొట్టేశారు అనుష్క. మరి ఆ స్థాయిలో శ్రీలీల న్యాయం చేయగలదా? అనేది చాలామందిలో నెలకొన్న ప్రశ్నలు. మరో విషయం ఏంటంటే.. 'అరుంధతి' హిందీలో కూడా త్వరలో రీమేక్ కానున్నది. గీతా ఆర్ట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు సమాచారం. మరి హిందీ 'అరుంధతి' ఎవరో తెలియాల్సి వుంది.

శర్వానంద్ బైక్ రేసింగ్




శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. 'శర్వానంద్ 36' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో శర్వానంద్ బైక్ రేసర్‌గా ఛాలెంజింగ్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సీన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం శర్వానంద్ పర్సనల్ స్టిల్స్‌ని విడుదల చేశారు. స్టైలిష్ మేకోవర్‌లో ఉన్న శర్వానంద్‌ని ఈ స్టిల్స్‌లో చూడొచ్చు. మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: జె.యువరాజ్, సంగీతం: జిబ్రాన్, సమర్పణ: విక్రమ్.

ఆస్కార్ ఎంట్రీ పొందిన 'హోమ్‌బౌండ్'



జాన్వీకపూర్, ఇషాన్‌కట్టర్, విశాల్ జెత్వా ప్రధాన పాత్రల్లో నటించిన 'హోమ్‌బౌండ్' చిత్రం విడుదలకు ముందే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడి ప్రశంసలు దక్కించుకుంది. తాజాగా ఈ చిత్రం 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో భారత్ తరఫున ఆస్కార్ 2026కు అధికారిక ఎంట్రీ సాధించింది. శుక్రవారం కోల్‌కతాలో జరిగిన సమావేశంలో సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎన్.చంద్ర ఈ వివరాలను వెల్లడించారు. ఆస్కార్ అధికారిక ఎంట్రీ కోసం మొత్తం 24 చిత్రాలు పోటీపడ్డాయని, అవన్నీ గొప్ప కథలేనని ఆయన తెలిపారు. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్‌బౌండ్' చిత్రానికి స్టాండింగ్ ఓవేషన్ లభించింది. ఇటీవల టోరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రెండో రన్నరప్‌గా ఇంటర్నేషనల్ పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకుంది. పోలీసు ఉద్యోగం కోసం ఇద్దరు స్నేహితులు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో కుల, మత పరంగా వారు ఎదుర్కొనే వివక్ష, వాటికి వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో కరణ్‌జోహార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది.



సోషియో ఫాంటసీ 'గాలి'

సంధ్య ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'గాలి'. రామ్‌ప్రసాద్ గురజాడ, అంజలి, శ్రీకాంత్ పెరుమండ్ల, చిన్ని, రోజారాణి, బి.వి.సుబ్బారెడ్డి ప్రధాన పాత్రధారులు. టి.రాము దర్శకత్వంలో చందా లక్ష్మీ నారాయణ నిర్మించారు. ఇటీవల హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. కలి పురుషుడికి, అమ్మవారికి మధ్య జరిగే భీకర పోరాటం నేపథ్యంలో ఈ సినిమా నడుస్తుందని, ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. డిసెంబర్ 25న చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కార్నె ప్రకాష్, సంగీతం: అనిల్ కుమార్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: టి.రాము.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఎమ్మెల్సీగా వెంకట్రామిరెడ్డి ఎన్నికపై హడావుడిగా ఎందుకు దావా వేశారు?

పిటిషనర్లను నిలదీసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్ అధికారి పీ వెంకట్రామిరెడ్డి శాసనమండలి సభ్యుడిగా కొనసాగడాన్ని సవాలు చేస్తూ కరీంనగర్‌కు చెందిన జే శంకర్, మరొకరు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఐఏఎస్ పదవికి వెంకట్రామిరెడ్డి చేసిన రాజీనామాను కేంద్రం ఆమోదించకుండానే ఎమ్మెల్సీ పదవికి నామినేషన్ వేశారని, ఆయనపై అనర్హత వేసేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదిస్తూ.. వెంకట్రామిరెడ్డి రాజీనామాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని, వెంటనే జీవో కూడా జారీ చేసిందని, ఆ జీవో ఆధారంగా ఎమ్మెల్సీ పదవికి ఆయన దాఖలు చేసిన నామినేషన్‌ను ఈసీ ఆమోదించిందని వివరించారు. సర్వీసు నిబంధనల ప్రకారం రాజీనామా చేస్తేనే కేంద్రం అనుమతి అవసరమని చెప్పారు. దీంతో వెంకట్రామిరెడ్డి ఎన్నికపై హడావుడిగా పిటిషన్ ఎందుకు వేశారో చెప్పాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం పిటిషనర్లను నిలదీసింది. దీనిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

'మధ్యాహ్న' మెనూ ఏమిటో చెప్పండి

ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన మెనూ తెలియజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా? ఒక్కో విద్యార్థికి ఎంత కేటాయిస్తున్నారు? ఆ మొత్తాన్ని పెంచారా? లేదా? అనే వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీచేసిన ధర్మాసనం.. విచారణను 3 వారాలపాటు వాయిదా వేసింది.

నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ రెడీ

విజయవంతంగా ట్రయల్ రన్ • త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు

కేసీఆర్ హయాంలో అంకురార్పణ

తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు

- 62 ఎకరాల్లో 300 కోట్లతో నిర్మాణం
- నిరంతరం పర్యవేక్షించిన హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లాలో 13,420 ఎకరాల్లో సాగు చేసిన 4,051 మంది రైతులు
- కేసీఆర్ ప్రోత్సాహంతో ఏటేటా పెరిగిన సాగు
- రైతుల చేతికి 2,350 టన్నుల తొలి పంట
- 820 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 4 కోట్లు
- ఆయిల్‌పామ్ రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు
- ట్రయల్ రన్ సక్సెస్ పట్ల హరీశ్‌రావు హర్షం

సిద్దిపేట, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ మరో కల సాకారమైంది. సిద్దిపేట జిల్లా నర్మెట శివార్లలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శుక్రవారం ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. మలేషియా నుంచి వచ్చిన అంతర్జాతీయ కన్సల్టెంట్ శ్రీహజ్‌నాన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఫ్యాక్టరీలోని అన్ని యంత్రాలను పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయల్ రన్‌లో కిరణ్‌కుమార్ (ఓఎస్‌డీ) శ్రీకాంత్‌రెడ్డి (ప్రాజెక్టు మేనేజర్),ప్రణేశ్‌గౌడ్ (ఫ్యాక్టరీ ఇన్‌చార్జి) ప్రియానిక్ ఇండియా కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు. త్వరలో ఫ్యాక్టరీ ప్రారంభం కానున్నది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అంకురార్పణ జరిగిన ఈ ఫ్యాక్టరీ.. మాజీ మంత్రి హరీశ్‌రావు నిరంతర పర్యవేక్షణ, దిశానిర్దేశంతో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసుకున్నది. సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామ శివారులో 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో శుక్రవారం ట్రయల్‌రన్ నిర్వహించారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి 2022 ఏప్రిల్ 13న అప్పటి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావు కలిసి భూమిపూజ చేశారు. త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించి వేగవంతం చేయించారు. తొలి నాలుగేండ్ల పంటల దిగుబడి చేతికి రావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నర్మెటలోనే ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయించారు. రైతులు తమ పంట దిగుబడిని తీసుకొచ్చి నర్మెట ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటుచేసిన వేబ్రిడ్జి వద్ద తూకం వేస్తున్నారు. ఇప్పటికే 820 మంది రైతులు తమ 2,350 టన్నుల పంటను అమ్ముకున్నారు. ఇందుకుగాను దాదాపు రూ.నాలుగు కోట్లు రైతుల ఖాతాలో జమయ్యాయి. ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన పంటను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తరలించి అక్కడ ప్రాసెస్ చేస్తున్నారు. రైతుల పొలాల నుంచి నర్మెట ఫ్యాక్టరీ వరకు తీసుకొనిరావడానికి అవసరమైన రవాణ ఖర్చును కూడా ఆయిల్‌ఫెడ్ భరిస్తున్నది.

అత్యాధునిక టెక్నాలజీ

నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని అన్ని వసతులతో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి నిర్మించారు. ఈ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడమే కాకుండా, రిఫైనరీని కూడా పెట్టి ఫైనల్ ప్రొడక్ట్‌ను ఇక్కడినుంచే నేరుగా మార్కెట్లోకి పంపించేవిధంగా ఏర్పాట్లుచేశారు. నాలుగు మెగావాట్ల సెల్ఫ్ జనరేషన్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కూడా నెలకొల్పారు. ఇక్కడ వాడిన నీటిని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా రీ సైకిల్ చేసే ఏర్పాట్లున్నాయి. 10 కోట్ల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ స్టోరేజీ ట్యాంకును ఏర్పాటుచేశారు. ఈ ఫ్యాక్టరీలో తొలుత గంటకు 30 టన్నుల గెలలను క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్నది. గెలల పరిమాణం పెరుగుతున్న కొద్దీ క్రషింగ్ సామర్థ్యాన్ని గంటకు 120 టన్నులకు పెంచుకునే అవకాశం ఉన్నది. భారతదేశంలోనే గంటకు 120 టన్నుల గెలలను క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్న తొలి ఫ్యాక్టరీ ఇదే కావడం విశేషం. ప్రస్తుతం ఇక్కడ మూడు వేబ్రిడ్జీలు, ప్రహరీగోడ, పరిపాలన భవనం, మెకానికల్ పనులు పూర్తి కావచ్చాయి. నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ భవిష్యత్తులో సిద్దిపేట జిల్లాలోని ఆయిల్‌పామ్ గెలలను మాత్రమే కాకుండా, సమీప జిల్లాలైన జనగామ, మహబూబాబాద్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల నుంచి వచ్చే ఆయిల్‌పామ్ గెలలను కూడా ప్రాసెస్ చేయడానికి అవసరమైన సామర్థ్యంతో దీనిని నిర్మించడం మరో విశేషం. ఈ ఫ్యాక్టరీతో అనేక ప్రయోజనాలున్నాయి. ఇక్కడే వంటనూనె తయారుచేస్తారు. ఆయిల్‌పామ్ కాయల నుంచి వచ్చే పీచుతో పరుపులను తయారుచేస్తారు. వ్యర్థాలను చేపలకు ఆహారం, ఎరువు, బయోగ్యాస్ ఉత్పత్తికి ఉపయోగిస్తారు. ఈ ఫ్యాక్టరీ వల్ల ఇక్కడి రైతులకు ప్రయోజనం కలగడంతోపాటు ప్రత్యక్షంగా పరోక్షంగా వెయ్యి మందికిపైగా ఉపాధి లభిస్తుంది.



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ట్రయల్ రన్‌లో భాగంగా ఉత్పత్తి అవుతున్న ఆయిల్

ఆయిల్‌పామ్ రైతులకు కొత్త వెలుగులు

- సంతోషం వ్యక్తం చేసిన హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట వద్ద ఏర్పాటుచేసిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సంతోషం వ్యక్తంచేశారు. కేసీఆర్ నాయకత్వంలో అంకురార్పణ జరిగిన ఆయిల్‌పామ్ కర్మాగారం ప్రస్తుతం ప్రారంభ దశకు చేరడం చిరస్మరణీయ ఘట్టం అని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగ వేళ ఆయిల్‌పామ్ రైతుల్లో కొత్త వెలుగులు నింపుతున్నదని సంతోషం వ్యక్తంచేశారు. ఆయిల్‌పామ్ సాగుచేయడానికి ముందుకు వచ్చే రైతుల్లో నమ్మకం పెరిగిందని తెలిపారు. ఒకవైపు ఆయిల్‌పామ్ సాగు, మరోవైపు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. రైతుల కల సాకారం చేశామని, చరిత్రలో నిలిచిపోయేలా పనిచేయడం గొప్ప సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు.. ఫ్యాక్టరీ మరి కొద్దిరోజుల్లోనే అందుబాటులోకి వచ్చి రైతులకు లాభాలు ఇస్తుందని ఆకాంక్షించారు. ఈ శుభ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు.

సిద్దిపేట జిల్లాలో ఏటేటా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరుగుదల ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	ఎకరాలు
2021-22	655	2,763
2022-23	1,717	5,556
2023-24	967	2,786
2024-25	335	1,207
2025-26	377	1,108
మొత్తం	4,051	13,420

ఫ్యాక్టరీ నిర్మాణం ఇలా..

కేసీఆర్ ప్రభుత్వం వెచ్చించిన మొత్తం	రూ.300 కోట్లు
ఫ్యాకరీ నిర్మాణ విస్తీర్ణం	62 ఎకరాలు
ఫ్యాక్టరీ ఉత్పత్తి సామర్థ్యం 40 వేల ఎకరాల్లో దిగుబడి	
రిజర్వాయర్ సామర్థ్యం 10 కోట్ల లీటర్లు	

నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలోని విభాగాలు

- క్రూడ్ పామాయిల్ మిల్లు
- పామ్ కెర్నల్ ఆయిల్ మిల్లు
- విద్యుత్తు ఉత్పత్తి కోసం కో జనరేషన్ ప్లాంట్
- వ్యర్థాల రీసైక్లింగ్ కోసం కండెన్సేషన్ ప్లాంటు
- క్రూడ్ పామాయిల్ రిఫైనరీ మిల్లు
- ఇతర మిల్లింగ్ పనులు

గెట్టు దాటిన మంత్రి వివేక్!

- తనది కాని అటవీశాఖ అధికారులతో సమీక్ష
- విషయం తెలిసి భగ్గుమన్న మంత్రి కొండా సురేఖ
- సీఎంవోకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ అని ఆ పార్టీ నేతలే పలుమార్లు చెప్పుకుంటారు. ఒక నేతపై మరొక నేత బహిరంగంగానే ఆరోపణలు, విమర్శలు చేసుకోవడం, ఒకరి వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోవడం సర్వసాధారణం. అవసరమైతే మీడియా సమావేశాలు పెట్టి మరీ తమ ప్రత్యర్థుల లోటుపాట్లు వివరిస్తారు. పార్టీ వరకైతే అది వారి అంతర్గత వ్యవహారం.. కానీ ప్రభుత్వంలో కూడా వారి వ్యవహారం అదే తీరుగా ఉన్నట్టు తాజాగా జరిగిన ఓ ఘటన వెల్లడిస్తున్నది. ఓ మంత్రిత్వ శాఖ వ్యవహారంలో మరో మంత్రి జోక్యం చేసుకోవడంతో అది వివాదాస్పదమైనట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో గనుల శాఖను మంత్రి వివేక్ నిర్వహిస్తుండగా, అటవీ శాఖకు మంత్రి కొండాసురేఖ బాధ్యత వహిస్తున్నారు. కాగా మంత్రి వివేక్ తనది కాని అటవీ శాఖలో తలదూర్చడమే వివాదానికి కారణమని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. నాలుగు రోజుల కిందట మంత్రి వివేక్ సచివాలయంలో అటవీ శాఖ అధికారులను పిలిచి సమీక్ష సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. అటవీశాఖ ముఖ్యకార్యదర్శి నదీం అహ్మద్, చీఫ్ ఫారెస్ట్ అధికారిణి సువర్ణ, మంచిర్యాల జిల్లా కలెక్టర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం. మంత్రి వివేక్ సొంత నియోజకవర్గం చెన్నూరులో అటవీ భూముల మీదుగా వెళ్తున్న రహదారులకు క్లియరెన్స్, పోడు భూముల సమస్యలపై చర్చించినట్టు తెలిసింది. అయితే ఈ సమావేశం గురించి అటవీ శాఖ మంత్రి కొండాసురేఖకు కనీస సమాచారం కూడా లేదని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. సదరు సమీక్ష గురించి మంత్రి కొండా సురేఖకు తెలియడంతో ఆమె అసహనానికి లోనయ్యారని సమాచారం. తనకు తెలియకుండా వేరొక మంత్రి తన శాఖలో వేలు పెట్టడం ఏమిటని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. నియోజకవర్గానికి సంబంధించిన అంశాలైతే అక్కడి అధికారులను మాత్రమే సమావేశానికి పిలవాల్సిందని, తన ప్రమేయం లేకుండా అటవీశాఖ ముఖ్య అధికారులను పిలిచి ఎలా సమీక్ష నిర్వహిస్తారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీనిపై ఆమె సీఎం కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

• అక్టోబర్‌లోగా సనత్‌నగర్ టిమ్స్ పూర్తవ్వాలి

అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : అక్టోబర్ చివరిలోగా సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తిచేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నరసింహ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం.. సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట టిమ్స్‌తోపాటు నిమ్స్ విస్తరణ, వరంగల్ సూపరల్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీల నిర్మాణ పనులపై సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో ఆరోగ్యశాఖ, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో హెల్త్‌సెక్రటరీ క్రిస్టినా, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, డీఎంఈ నరేంద్రకుమార్, ఆర్అండ్‌బీ సీఈలు రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

• మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యం: అడ్లూరి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మైనార్టీల అభ్యున్నతికి కాంగ్రెస్ సర్కారు ప్రాధాన్యమిస్తున్నదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్నాకా సహారా పథకాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు స్కీంలతో మైనార్టీ మహిళల బతుకుల్లో వెలుగులు నిండుతాయని ఆకాంక్షించారు.

• పర్యాటకానికి ప్రచారమేది?: జూపల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రపంచస్థాయి పర్యాటక రంగానికి కావాల్సిన వనరులు ఉన్నప్పటికీ అనుకున్నంత స్థాయిలో ప్రచారం లభించకపోవడం తీరని లోటని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడుల కోసం త్వరలోనే టూరిజం కాన్‌క్లేవ్ నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో శుక్రవారం జరిగిన 'ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్-2025' ప్రారంభ కార్యక్రమంలో జూపల్లి పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో 'బతుకమ్మ విశిష్టత-ఆచరణ' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు.

• ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి: సురేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఎకో టూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎకో టూరిజం కోసం గుర్తించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

• ప్రాధాన్యతా క్రమంలో పనులు విభజించండి : భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి పనులను శాఖలవారీగా ప్రాధాన్యతా క్రమంలో విభజించాలని డిప్యూటీ సీఎం, సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క ఆదేశించారు. సూచించిన మేరకు అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ సబ్‌కమిటీ సమావేశం జరిగింది. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్‌శాఖ ప్రతిపాదనలపై సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఒకవేళ ప్రతిపాదనలు ఎక్కువగా ఉంటే సంవత్సరాల వారీగా ప్రాధాన్యత క్రమంలో విభజించాలని అధికారులను కోరారు. సమావేశంలో సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వివిధ శాఖల కార్యదర్శులు, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ పాల్గొన్నారు.

• అక్టోబర్ నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు : తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబర్19(నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు చేయాలని, పత్తి రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి ఉత్పత్తి, మార్కెట్ ధరల పరిస్థితి, ఎంఎస్‌పీ అమలు, రైతులకు చెల్లింపులు, జిన్నింగ్-ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాట్లు, రవాణా సమస్యలు, డిజిటలైజేషన్, రైతుల రిజిస్ట్రేషన్, స్థానిక కమిటీలు, ఫిర్యాదులు-పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. పత్తి సేకరణలో ప్రభుత్వ సహకారం అవసరమని సీసీఐ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పత్తి సేకరణకు ప్రభుత్వం అన్నిరకాల సహాయ సహకారాలు అందించనున్నట్టు చెప్పారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా సీసీఐ సమర్థవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ 1800599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 నంబర్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. రోజువారీ క్రయవిక్రయాలను పరిశీలించేందుకు డైరెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేయాలని మంత్రి సూచించారు.

• లంచమడిగితే క్రిమినల్ కేసు: పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తేతెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, బిల్లుల చెల్లింపు కోసం డబ్బులు డిమాండ్ చేస్తే 24 గంటల్లో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఇండ్ల కోసం ఇచ్చిన నిధులను పాతబాకీ కింద జమ చేసే బ్యాంకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇండ్ల బిల్లుల కోసం లంచాలు అడిగితే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను (18005995991) ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

• 'తమ్మిడిహట్టి' అంచనాలు రూపొందించాలె: ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి రూ.35 వేల కోట్లతో ప్రభుత్వం ఎలాంటి అంచనాలను రూపొందించలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అంచనాలపై వస్తున్న వార్తల్లో నిజం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ్మిడిహట్టి బరాజ్, చేవేళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.35 వేల కోట్లతో అంచనాలు రూపొందించామనేది మాత్రం అబద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం అంచనాల ప్రక్రియ మొదలు పెట్టలేదని, అంచనాలు రూపొందిస్తే అధికారికంగా ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

• 22న ఛత్తీస్‌గఢ్ సీఎంతో మంత్రి ఉత్తమ్ భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఈ నెల 22న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయితో రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ కానున్నారు. సమ్మక్కసాగర్ బరాజ్‌కు కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు రావాల్సి ఉన్నది. ఇందుకుగాను పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ)ఇవ్వాల్సి ఉన్నది. ఈ బరాజ్‌తో దాదాపు 136 ఎకరాలు ముంపునకు గురవుతుందని ఛత్తీస్‌గఢ్ ఆరోపిస్తూ ఎన్‌వోసీ జారీకి కాలయాపన చేస్తున్నది. అయితే, తగిన పరిహారం చెల్లిస్తామని ఇప్పటికే ఛత్తీస్‌గఢ్‌కు హామీ ఇచ్చారు.

మరో 5వేల కోట్ల అప్పు!

- 23న ఈ-వేలం ద్వారా సేకరణ
- బడ్జెట్ లక్ష్యంలో 87 శాతం చేరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కారు బడ్జెట్‌లో పేర్కొన్న రుణ సమీకరణ లక్ష్యానికి చేరువైంది. ఆర్థిక సంవత్సరం సగం కూడా పూర్తి కాకముందే సుమారు 90 శాతం అప్పు తీసుకున్నది. శుక్రవారం మరో రూ.5000 కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి ఇండెంట్ పెట్టింది. ఆర్బీఐ ప్రతి మంగళవారం నిర్వహించే ఈ-వేలంలో పాల్గొని సెప్టెంబర్ 23న ఈ మొత్తాన్ని సేకరిస్తామని పేర్కొన్నది. 22 ఏండ్ల కాలానికి రూ.1,500 కోట్లు, 23 ఏండ్ల కాలానికి రూ.1000 కోట్లు, 24 ఏండ్ల కాలానికి రూ.1000 కోట్లు, 26 ఏండ్ల కాలానికి రూ.1500 కోట్ల రుణ సమీకరణ కోసం సెక్యూరిటీ బాండ్లు పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరిస్తామని కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. కానీ, ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలు కూడా గడువక ముందే ఒక్క ఆర్బీఐ నుంచే ఈ నెల 16వ తేదీ నాటికి రూ.41,900 కోట్ల అప్పు చేసింది. మంగళవారం తీసుకోబోయే అప్పుతో రుణసమీకరణ రూ.46,900 కోట్లకు చేరనుంది. బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం ఓపెన్ మార్కెట్‌లో సేకరించాల్సిన అప్పు ఇంకా రూ.7 వేల కోట్లు మాత్రమే మిగిలింది. కాంగ్రెస్ సర్కారు ఆదాయ రాబడిలో 35 శాతం దాటడం లేదు.. కానీ, అప్పుల సేకరణలో మాత్రం 87 శాతానికి చేరడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

వేములవాడలో బీసీ సంఘం నాయకుల ర్యాలీ

వేములవాడ, సెప్టెంబర్ 19: ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను అవమానించిన కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బీసీ సంఘాల నాయకులు పొలాస నరేందర్, నేరెళ్ల తిరుమల గౌడ్, చిలుక రమేశ్, బొజ్జ కనుకయ్య, కూరగాయల కొమురయ్య, తదితరుల నేతృత్వంలో పెద్ద సంఖ్యలో బీసీ సంఘాల ప్రతినిధులు ర్యాలీగా వెళ్లి వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న సిరిసిల్లలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమానికి సకాలంలో హాజరు కాకపోవడమే కాకుండా, జాతీయ గీతాలాపన జరుగుతున్న సమయంలో పెద్దగా సైరన్ వేసుకుని వచ్చి కలెక్టర్ ప్రొటోకాల్ ఉల్లంఘించారని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీసీ బిడ్డ అయినందునే ఆయనకు ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలకలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా బీసీ బిడ్డను అవమానించిన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాపై చర్యలు తీసుకోవాలని కోరారు.

1న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎన్‌డబ్ల్యూడీఏ)77వ జనరల్ బాడీ సమావేశాన్ని అక్టోబర్1న నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు అథారిటీ సమాచారం అందించింది. ఢిల్లీ వేదికగా హైబ్రీడ్‌మోడ్‌లో సమావేశాన్ని నిర్వహించనున్నారు. గతేడాదిగా ఎన్‌డబ్ల్యూడీఏ సాధించిన ప్రగతి, తీసుకున్న నిర్ణయాలపై చర్చించనున్నారు.

కండువా కప్పితే పార్టీలో చేరినట్టా?

మొదటిపేజీ తరువాయి...

వ్యవహారంపై ఆ పార్టీ నేతలకే స్పష్టతలేదని, తమ పార్టీలో 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని హరీశ్‌రావు అసెంబ్లీలో చెప్పారని, కేటీఆర్ మాత్రం 10 ఎమ్మెల్యేలు పార్టీ మారారని చెప్తున్నారని సీఎం అన్నారు. మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ సహకరించడం లేదని, కేటీఆర్‌తో కలిసి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తాను చెప్పినట్టు ఎల్అండ్‌టీ వినాల్సిందేనని, లేదంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెట్రో విస్తరణకు అనుమతులు అడిగితే కేంద్రం, మెలిక పెడుతున్నదని చెప్పారు. ప్రాజెక్టు ఖర్చుకు, ఎల్అండ్‌టీ అడుగుతున్న దానికి చాలా తేడా ఉందని చెప్పారు. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు వ్యయం రూ.13 వేల కోట్లు అని, దీనిపై ఆ సంస్థ రూ.7 వేల కోట్లు అప్పు చేసినట్టు సీఎం చెప్పారు.

కిషన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదు?

కాళేశ్వరం ప్రాజెక్టుపై దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి ఇస్తే 48 గంటల్లో విచారణ చేపట్టేలా చూస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గతంలో అన్నారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. 'ఇప్పుడు ఎన్ని రోజులైంది? కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు?' అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డికి సొంత అభిప్రాయాలు ఉండవని, కేటీఆర్ నుంచే సలహాలు తీసుకుంటారని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తును ఆపాలని కేటీఆర్ చెప్తారని, కిషన్‌రెడ్డి అమలుచేస్తారని ఆరోపించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు వేయకపోవడమే దీనికి సాక్ష్యమని చెప్పారు. కేసును సీబీఐకి ఇచ్చాం కాబట్టి ఎఫ్ఐఆర్ నమోదుచేసి మళ్లీ మొదటి నుంచీ దర్యాప్తు ప్రారంభించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.

యూరియా కొరతకు వాళ్లే కారణం

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలే యూరియా సమస్యకు కారణమని రేవంత్‌రెడ్డి వింత ఆరోపణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే రాష్ట్రానికి యూరియా రాకుండా అడ్డుకున్నారని వ్యాఖ్యానించారు. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీలు కేటాయించారని, దీనికి గత 75 ఏండ్ల కాలం రికార్డులు చూస్తున్నామని, నికర, వరద, మిగులు జలాల్లో ఏవి ఎంత ఉన్నాయనే లెక్కలు తీస్తున్నామని, సరాసరి ఎన్ని టీఎంసీలు వాడుతున్నారో గణాంకాలు తయారుచేసేపనిలో నిమగ్నమై ఉన్నామని చెప్పారు. తమ్మిడిహట్టికి మిగులు జలాలు వాడుకుంటామని, మహారాష్ట్రతో మాట్లాల్సి ఉందన్నారు. మహారాష్ట్ర సీఎం నుంచి అపాయింట్‌మెంట్ రాలేదని చెప్పారు.

సీఎం వాస్తవాన్ని గుర్తించాలి

- స్థానిక సమస్యలకు నిధులివ్వాల్సింది ప్రభుత్వమే
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ట్వీట్



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలంటూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేసిన సూచనను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నానని తెలిపారు. మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ఇదే అని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఉపయోగపడతాయని సూచించారు.

గౌడ్‌లపై దాడులు హేయం

గౌడ ఐక్య సాధన సమితి ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని గౌడ్‌లపై దాడులు హేయమని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తాళ్లరాంపూర్‌లో కల్లుగీత వృత్తిదారుల ఈత వనాలను ధ్వంసం చేసి, గౌడ్‌లపై దాడులకు పాల్పడిన వీడీసీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి వ్యతిరేకంగా వారం రోజులుగా నిరసన తెలుపుతున్న గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం నారాయణగౌడ్‌ను నిర్మల్ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు.

గురుకులాల్లో దసరా సెలవుల చిచ్చు

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): దసరా సెలవులను ప్రకటిస్తూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ జారీ చేసిన ఉత్తర్వులపై సొసైటీ పరిధిలోని సీఈవో (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకే మంత్రి కింద ఉన్న 3 గురుకుల సొసైటీల్లో రెండు రకాల నిర్ణయాలు తీసుకోవడాన్ని తప్పుపట్టుతున్నారు. ఎస్టీ, మైనార్టీ సొసైటీల పరిధిలోని సీవోఈలతో సహా గురుకుల పాఠశాలలు, కాలేజీలకు 21వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని సీవోఈలకు సైతం అన్ని గురుకుల సొసైటీల తరహాలోనే సెలవులను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- మందలించినా మారని తీరు!
- ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేస్తానన్న ఎంఈవో

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 19 : విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు వక్రబుద్ధితో ఉపాధ్యాయ వృత్తికే కలంకం సృష్టిస్తున్నాడు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బద్దెనపల్లి జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ తరుచూ విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. బద్దెనపల్లి పాఠశాలకు 2022లో వచ్చిన అతను గతంలో పలు మార్లు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించడంతో గ్రామస్థులు, విద్యార్థినుల తల్లిదండ్రులు మందలించారు. దీంతో వారికి క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అయినా, తన వక్రబుద్ధి మానుకోలేదు. ఓ విద్యార్థినిని 'ఏ పౌడర్ వేసుకుంటున్నావ్..' తదితర వెకిలి చేష్టలు, మాటలతో ఇబ్బందులు పెట్టాడు. ఈ విషయం విద్యార్థిని తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడిని మందలించారు. ఈ విషయంపై ఎంఈవో రాజునాయక్‌ను వివరణ కోరగా.. విచారణ జరిపి, డీఈవోకు రిపోర్ట్ చేస్తానని తెలిపారు. సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని బీజేపీ నేతలు ఆందోళన నిర్వహించారు.

ఫ్లిప్‌కార్ట్‌లో బుల్లెట్ బైకులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఈ-కామర్స్ సంస్థలు మరో అడుగుముందుకేశాయి. ఇప్పటికే అన్ని రకాల వస్తువులను విక్రయిస్తున్న సంస్థలు..తాజాగా ఈ జాబితాలోకి బైకులు కూడా చేరాయి. మధ్యస్థాయి మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫిల్డ్‌కు చెందిన పలు బైకులు ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోలు చేయవచ్చును. వీటిలో బుల్లెట్ 350, క్లాసిక్ 350, హంటర్ 350, గోన్ క్లాసిక్ 350, న్యూ మీటర్ 350 వంటి మాడళ్లు ఫ్లిప్‌కార్ట్‌లో లభించనున్నాయి. ప్రస్తుతానికి ఈ బైకులు కేవలం ఐదు నగరాలు బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కతా, లఖ్నోలో మాత్రమే ఈ నెల 22 నుంచి లభించనున్నట్టు ప్రకటించాయి. బైకు కొనుగోలు తర్వాత ఆయా నగరాల్లో ఉన్న రాయల్ ఎన్‌ఫిల్డ్ డీలర్ల వద్ద సర్వీసింగ్, సేవలు పొందవచ్చునని తెలిపింది.

రాంకీకి భారీ ఆర్డర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరో ఆర్డర్‌ను దక్కించుకున్నది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్(హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నుంచి రూ.2,085 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. ఈ కాంట్రాక్టులో భాగంగా గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీం-ఫేజ్ 2, ఫేజ్3, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వులను గోదావరి నీటితో నింపాల్సివుంటుంది. వచ్చే రెండేండ్లలో ఈ కాంట్రాక్టునకు సంబంధించి పూర్తి చేయాల్సివుంటుంది.

పండుగ డిస్కౌంట్లు బంద్!



వాహన అమ్మకాలపై ఈసారి నో ఆఫర్లు

మార్కెట్ విశ్లేషకుల అంచనాలు

జీఎస్టీ తగ్గింపే కారణమన్న అభిప్రాయాలు

కొనుగోలుదారులకు లాభం అంతంతేనా?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఈ పండక్కి కారో, బైకో కొనాలనుకున్నారా? ఏటా ఈ సీజన్‌లో ఆటో సంస్థలిచ్చే ఆఫర్లకుతోడు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు కూడా కలిసొస్తుందని ఈ నెల 22 తర్వాత కొందాంలే అనుకొని ఆగిపోయారా? అయితే మీ ఆశలు అడియాసలే కావచ్చు. అవును.. ప్రతీ సంవత్సరం దసరా, దీపావళి సందర్భంగా ఆటో ఇండస్ట్రీలో కనిపించే ఆఫర్ల సందడి ఈసారి ఉండకపోవచ్చు. జీఎస్టీ కోతల నేపథ్యంలో డిస్కౌంట్లకు దూరంగా ఉండాలని అటు వాహన తయారీ సంస్థలు, ఇటు డీలర్లు యోచిస్తున్నట్టు చెప్తున్నారు మరి. దీంతో ఈ ఏడాది పండుగ పూట రాయితీలకు అవకాశాల్లేవనే అంచనాలే గట్టిగానే వినిపిస్తున్నాయిప్పుడు. ఫలితంగా గతంతో పోల్చితే ఇప్పుడు కొత్తగా ఒనగూరే లాభం ఏమీ ఉండకపోవచ్చన్న అభిప్రాయాలే అందరి నోటా వ్యక్తమవుతున్నాయి. కాగా, ఇటీవలి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను స్లాబులను 4 నుంచి 2కు తగ్గించిన విషయం తెలిసిందే. 12, 28 శాతం స్లాబులను ఎత్తేశారు. దీంతో వాటిలోని ఆయా ఉత్పత్తులు 5, 18 శాతం స్లాబుల్లోకి వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలోనే వాహనాలపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గుతున్నది. ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయి. 4 మీటర్లకుపైగా ఉన్న ఎస్‌యూవీలపైనా జీఎస్టీ 40 శాతానికి (సెస్సు లేకుండా) తగ్గుతున్నది. ఇప్పుడు 43-50 శాతం పడుతున్నది. ట్రాక్టర్ విడిభాగాలపై జీఎస్టీ 12-18 శాతం నుంచి 5 శాతానికి దిగొస్తున్నది.

ఇదీ సంగతి..

అమ్మకాలను పెంచుకోవడానికి భారతీయ మార్కెట్‌లో పండుగ సీజన్‌ను మించిన సమయం లేదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అందుకే అన్ని రంగాల్లోని కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలపై భారీగా డిస్కౌంట్లు ప్రకటించి కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాయి. ముఖ్యంగా ఆటో రంగ సంస్థలు ఈ అవకాశాన్ని అస్సలు వదులుకోవు. అందుకే పెద్ద పండగలైన దసరా, దీపావళికి కార్లు, బైకులపై ఏటేటా గొప్ప ఆఫర్లనే తెస్తాయి. తద్వారా ఒక్కసారిగా ఏర్పడే డిమాండ్‌తో డీలర్ల వద్ద ఉన్న ఇన్వెంటరీలను ఖాళీ చేస్తాయి. కానీ ఈసారి జీఎస్టీ తగ్గింపుతో మార్కెట్‌లో ఇప్పటికే వాహనాలకు డిమాండ్ నెలకొన్నది. దీంతో ఇక డిస్కౌంట్లు, ఆఫర్లు అనవసరమని మెజారిటీ ఆటో సంస్థలు భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అదనపు రాయితీలతో వచ్చే లాభాలను ఎందుకు తగ్గించుకోవడం అన్న అభిప్రాయం ఇండస్ట్రీ అంతటా ఉన్నట్టు సమాచారం. నిజానికి చాలా సంస్థలు జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో వాహన ధరల్ని దించేశాయి. మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్, రెనాల్ట్, టొయోటా ఇలా అనేక కంపెనీలు రూ.10వేల దగ్గర్నుంచి రూ.3.5 లక్షలదాకా మాడల్‌నుబట్టి కార్ల రేట్లకు కోతలు పెట్టాయి. టూవీలర్ సంస్థలూ ఈ జాబితాలో ఉన్నాయి. దీంతో ఇక కొత్తగా మరే ఆఫర్లూ ఉండకపోవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గత ఏడాది, అంతకుముందు సంవత్సరాల్లో పండుగ ఆఫర్లతో కొనుగోలుదారులకు అందిన ప్రయోజనాన్ని చూస్తే.. ఈ ఏడాది కూడా ఇంచుమించుగా అంతే ఉంటుందని చెప్తున్నారు.

మోతీలాల్ ఓస్వాల్ మాట..

కార్లు, ద్విచక్ర వాహన తయారీదారులు ఈ పండుగ సీజన్‌లో గతంలో మాదిరి డిస్కౌంట్లు, ఆఫర్లను తీసుకువచ్చే వీల్లేదని, ఒకవేళ తెచ్చినా నామమాత్రంగానే అవి ఉంటాయని దేశీయ బహుళ ఆర్థిక సేవల దిగ్గజం మోతీలాల్ ఓస్వాల్ సంస్థ అంటున్నది. మార్కెట్‌లో డిమాండ్ పెద్ద ఎత్తున కనిపిస్తున్నదని చెప్తున్నది. ఈ క్రమంలోనే ఆటో ఇండస్ట్రీ సేల్స్‌పై తమ గత అంచనాలను సంస్థ సవరించింది కూడా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) టూవీలర్ అమ్మకాలు 4 శాతం పెరుగుతాయని, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) 7.5 శాతం వృద్ధి ఉండొచ్చంటున్నది. మునుపు ఈ అంచనాలు వరుసగా 1 శాతం, 5.7 శాతంగానే ఉండటం గమనార్హం. అలాగే ప్యాసింజర్ కార్ సేల్స్ కూడా 3 శాతం, 8 శాతానికి పెరగొచ్చంటున్నది. గతంలో ఈ అంచనాలు 2 శాతం, 4 శాతంగానే ఉన్నాయి. ఇక వాణిజ్య వాహనాలు ఈసారికి 5 శాతం, వచ్చేసారికి 7 శాతం చొప్పున అమ్మకాలను పెంచుకోవచ్చు. ట్రాక్టర్ విక్రయాలు సైతం 10 శాతం, 6 శాతంగా ఉండొచ్చని మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేస్తున్నది. మొత్తానికి జీఎస్టీ తగ్గింపు కంపెనీలకే లాభిస్తున్నదిగానీ, కస్టమర్లకు కాదు అన్న వాదనలున్నాయి.

తగ్గనున్న సుజుకీ బైక్ ధరలు

సుజుకీ మోటర్‌సైకిల్ ఇండియా శుక్రవారం తమ అన్ని మాడల్స్‌పై ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. జీఎస్టీ ప్రయోజనాన్ని అందించడంలో భాగంగా గరిష్ఠంగా రూ.18,024 దాకా రేట్లను కోత పెడుతున్నట్టు చెప్పింది. ఈ నెల 22 (సోమవారం) నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయని కంపెనీ ఉపాధ్యక్షుడు దీపక్ ముత్రేజా తెలిపారు.

ఐఫోన్ 17 కోసం పోటెత్తిన జనం



హైదరాబాద్‌లో సమీర్ కమ్యూనికేషన్‌లో ఐఫోన్ 17 కొనుగోలు చేసిన కస్టమర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: యాపిల్ ఐఫోన్ 17ను ఎగబడి కొనేస్తున్నారంతా. దేశీయంగా శుక్రవారమే ఈ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు మొదలయ్యాయి. దీంతో ప్రధాన నగరాల్లో ఈ నయా మొబైల్ కోసం ఐఫోన్ ప్రేమికులు పెద్ద ఎత్తున క్యూలైన్లు కట్టారు. గంటల తరబడి నిల్చునైనా మొబైల్‌ను కొనేదాకా ఎవరూ తగ్గలేదు. చాలామంది స్టోర్లు తెరవకముందే పడిగాపులు కాయటం గమనార్హం. ఢిల్లీ సాకెట్ సిటీవాక్ మాల్, ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో వరల్డ్ డ్రైవ్ మాల్, బెంగళూరు యాపిల్ హెబ్బల్ స్టోర్లలో ఎక్కడా చూసినా ఇదే పరిస్థితి. మునుపెన్నడూ యాపిల్ ఐఫోన్లకు ఈ స్థాయి స్పందన చూడలేదని రిటైలర్లు చెప్తున్నారు. 'ఉదయం నుంచి నేను క్యూలైన్‌లోనే ఉన్నాను. కాస్మిక్ ఆరెంజ్ రంగులో ఐఫోన్ 17ను కొనేందుకు ఎంతో ఆత్రుతతో వేచిచూస్తున్నాను' అని ఢిల్లీ సంగం విహార్‌కు చెందిన అష్రాఫ్ తెలిపారు. కాగా, దేశీయ మార్కెట్‌లో ఐఫోన్ 17 సిరీస్ ధరల శ్రేణి రూ.82,900-రూ.2,29,900గా ఉన్నది. కొత్త ఐఫోన్లతోపాటు మార్కెట్‌లోకి సరికొత్త స్మార్ట్‌వాచీలు, ఎయిర్‌పాడ్స్‌నూ యాపిల్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

మూడురోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 388, నిఫ్టీ 96 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. అదానీ గ్రూపునకు చెందిన షేర్లు భారీగా పుంజుకున్నప్పటికీ బ్లూచిప్ సంస్థల షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 83 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 387.73 పాయింట్లు నష్టపోయి 82,626.23 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 96.55 పాయింట్లు కోల్పోయి 25,327.05 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ రంగ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీ 1.76 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా, టైటాన్, ట్రెంట్, కొటక్ బ్యాంక్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్, ఐటీసీ, టాటా మోటర్స్, ఎల్‌అండ్‌టీ, టీసీఎస్ షేర్లు నష్టపోయాయి. కానీ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా కన్జ్యూమర్ డ్యూరబుల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు ఒక్క శాతం వరకు నష్టపోయాయి.



లాభాల్లో అదానీ గ్రూపు షేర్లు

అదానీ గ్రూపు షేర్లు భారీగా లాభపడ్డాయి. హిండెన్‌బర్గ్ లేవనెత్తిన పలు అనుమానాలపై సెబీ క్లీన్‌చిట్ ఇవ్వడంతో గ్రూపు షేర్లు రివ్వున ఎగిశాయి. అదానీ పవర్ షేరు అత్యధికంగా 12.40 శాతం లాభపడగా..అదానీ టోటల్ గ్యాస్ 7.35 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 5.33 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.04 శాతం, ఎన్‌డీటీవీ 4.98 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 4.70 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 1.41 శాతం, ఏసీసీ 1.21 శాతం, అదానీ పోర్ట్స్ 1.09 శాతం, అంబుజా సిమెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. దీంతో అదానీ గ్రూపు మార్కెట్ విలువ రూ.69 వేల కోట్ల మేర పెరిగింది.

వడ్డీరేట్లను తగ్గించిన బ్యాంకులు

ఎంసీఎల్ఆర్‌కు పావు శాతం కోత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను మూడు బ్యాంకులు తగ్గించాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్ఆర్)ని పావు శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో ఈఎంఐల భారం నుంచి కాస్త ఉపశమనం పొందనున్నారు. వడ్డీరేట్లను తగ్గించిన బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)లు ఉన్నాయి. ఆరు నెలలు, ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు కోత పెట్టినట్టు హెచ్‌డీఎఫ్‌సీ ప్రకటించింది. దీంతో రుణాలపై వడ్డీరేటు 8.65 శాతానికి దిగిరాగా, రెండేండ్ల రుణాలపై వడ్డీరేటు 8.70 శాతం యథాతథంగా కొనసాగుతున్నది. అలాగే పీఎన్‌బీ తన వడ్డీరేట్లను 5 బేసిస్ పాయింట్ల నుంచి 15 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.80 శాతానికి దిగొచ్చింది. వీటితోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐవీబీ, బీవోఐలు కూడా వడ్డీరేట్లను 15 బేసిస్ పాయింట్లు తగ్గించాయి. బ్యాంకులు తీసుకున్న తాజా నిర్ణయంతో వ్యక్తిగత, వాహన, గృహ రుణాలపై ఈఎంఐలు తగ్గనున్నాయి.

రిలయన్స్‌లో ఐఫోన్16పై ఆఫర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ రిటైల్ దిగ్గజం రిలయన్స్ డిజిటల్...ఐఫోన్ 16పై ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ఐఫోన్ 16 ప్లస్ ధరను రూ.57,990కి తగ్గించిన సంస్థ..ఐఫోన్ 16ఈ ధరను రూ.42,990కి దించింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఐఫోన్లలో 16ఈ అత్యంత చౌకది కావడం విశేషం. ఈ ఆఫర్ స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నది.

భెల్‌కు 586 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: విద్యుత్ పరికరాల ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థయైన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జీఎస్టీ మార్గదర్శకాలకు లోబడి తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ రూ.586.43 కోట్ల షోకాజ్ నోటీసును జారీ చేసింది. 2021-22 నుంచి 2023-24 వరకు మూడేండ్లపాటు వార్షిక జీఎస్టీ రిటర్ను, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్‌కు సంబంధించి సీజీఎస్టీ, టీజీఎస్టీ చట్టం-2017 ప్రకారం అసిస్టెంట్ కమిషనర్ ఈ నెల 18న నోటీసును పంపించారు. మూడు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన జీఎస్టీ వార్షిక రాబడి, ఆర్థిక నివేదికల ఆధారంగా నోటీసులు ఇచ్చినట్టు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం అందించింది. దీంట్లో 2021-22లో రూ.184.55 కోట్లు, 2022-23లో రూ.207.26 కోట్లు, 2023-24లో రూ.194.62 కోట్ల నోటీసును జారీ చేశారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు యథాతథం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): 'ఆరోగ్యశ్రీ' సేవలను శనివారం నుంచి కొనసాగించనున్నట్టు నెట్‌వర్క్ దవాఖానలు స్పష్టం చేశాయి. నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వానికి సహకరిస్తున్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్లను మంత్రి అభినందించారు. ప్రతినెలా నిధులు విడుదల చేస్తామని, నెట్‌వర్క్ దవాఖానల ఇతర అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

'ఓజీ' టికెట్ల ధరలు పెంపు

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ.. తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 25న ఈ సినిమా విడుదల కానుండగా.. స్పెషల్ ప్రీమియర్ షోకు అనుమతి ఇచ్చారు. సెప్టెంబర్ 24 రాత్రి 9 గంటలకు ఈ స్పెషల్ ప్రీమియర్ షో ఉంటుంది. ఆ షో టికెట్ ధర రూ.800కు పెంచుకునే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా 10రోజులపాటు టికెట్ రేట్స్ పెంచుకునేలా ఆదేశాలిచ్చారు. సింగిల్ స్క్రీన్ ధరపై రూ.100, మల్టీప్లెక్స్ ధరపై రూ.150 వరకు పెంచుకోవచ్చు.



శుక్రవారం రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పశుసంపద అభివృద్ధికి పాటుపడాలి

- విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి
- పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : 'పోషకాహారం, పశుసంపద అభివృద్ధికి పశువైద్య విద్య పట్టభద్రులు పాటుపడాలి. పాడిపరిశ్రమ బలోపేతానికి సుస్థిర పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023-24లో ఉత్తీర్ణ సాధించిన 16 మంది పీహెచ్‌డీ పట్టభద్రులు, 69 మంది మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, 439 మంది పశువైద్య విద్యార్థులరే పట్టాలు పంపిణీ చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు, ఇద్దరు ప్రొఫెసర్లకు బంగారు పతకాలు అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. పశువైద్యులు జంతువుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, ప్రజారోగ్యం, పర్యావరణం మధ్య వారధిగా నిలవాలని సూచించారు. జాతీయ పాడిపరిశ్రమ అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ), గుజరాత్ చైర్మన్ మనీశ్‌షా మాట్లాడుతూ.. వ్యవసాయం దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా ఉండి జాతీయ జీడీపీకి 16శాతం తోడ్పాటు అందిస్తుండగా, వ్యవసాయ జీవీఏలో 31శాతం, దేశ జీవీఏలో 5.5శాతం వాటా కలిగి ఉన్నట్టు చెప్పారు. పాడిపరిశ్రమ అభివృద్ధిలో సవాళ్లను స్వీకరించి ఈ రంగంలో మార్పులు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ జ్ఞానప్రకాశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శరత్‌చంద్ర, ఉదయ్ కుమార్, కిషన్‌కుమార్, జయలక్ష్మి, సతీశ్‌కుమార్, ప్రొఫెసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సౌరగిరి 'జలవిలాపం'!

ప్రభుత్వ నిబంధనలే ప్రతిబంధకాలు

- అనుమతుల్వికుండా అటవీశాఖ తిప్పలు
- క్షేత్రస్థాయి సమస్యల్ని గుర్తించని సర్కార్
- నెలలు గడుస్తున్నా అమలు కాని పథకం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా సౌరగిరి జలవికాసం పథకం అమలు ఒకడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రచారంపైనే యావ తప్ప క్షేత్రస్థాయి సవాళ్లపై కాంగ్రెస్ సర్కార్ ఏమాత్రం దృష్టి సారించలేదని తేలింది. దీంతో పథకం కాగితాలకే పరిమితమైది. నెలలు గడుస్తున్నా ఆచరణలోకి రాలేకపోయింది. గత మే నెలలో నాగర్‌కర్నూల్ జిల్లా మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. అయితే నాటి నుంచి ఇప్పటికీ ఒక్క అడుగుకు కూడా ముందుకు పడని దుస్థితి నెలకొన్నది. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఇందిరా సౌరగిరి జలవికాసం పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. రాబోయే ఐదేండ్లలో రూ.126 కోట్లతో దాదాపు 2.10 లక్షల మంది గిరిజన రైతులకు చెందిన 6 లక్షల ఎకరాలకు సాగునీటి వసతిని కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ పథకం కింద పట్టా కలిగిన అటవీ భూముల్లో వ్యవసాయ బోరు వేయడంతోపాటు, సౌర విద్యుత్తు ద్వారా నడిచే పంపుసెట్లను లబ్ధిదారులకు అందజేస్తారు. ఒక్కో యూనిట్‌కు రూ.6 లక్షల వరకు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. రాబోయే ఐదేండ్లలో ఈ పథకం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు 2025-26 సంవత్సరంలో రూ.6 కోట్లతో 10వేల ఎకరాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు 27,184 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చాలని భావించింది.

క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు

గిరి సౌర జలవికాసం పథకం అమలుకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని గిరిజన సంక్షేమశాఖ అధికారులే స్వయంగా పేర్కొంటున్నారు. ఈ పథకం ప్రధానంగా రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో అమలు చేయాల్సి రావడంతో అటవీశాఖ సిబ్బంది నుంచి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తున్నాయి. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలున్నా కూడా అటవీశాఖ అధికారులు బోర్లు వేయడానికి, సర్వే చేసేందుకూ అంగీకరించడం లేదని గిరిజన సంక్షేమ అధికారులు చెప్తున్నారు. సోలార్ పంపుసెట్లు గరిష్ఠంగా 200 అడుగుల లోతు నుంచి మాత్రమే నీటిని తోడగలవు. అప్పుడే సమర్థవంతంగా పనిచేస్తాయి. అంతకు మించితే సోలార్ పంపుసెట్లు పనిచేయడం అంతంత మాత్రమేనని తెలుస్తున్నది. కొండ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉన్నది. ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో భూభౌతిక పరిస్థితుల కారణంగా 200 అడుగుల కంటే ఎక్కువ లోతులో తప్ప భూగర్భజలాలు అందుబాటులో లేవు. కేవలం నదులు, వాగులకు సమీపంలో ఉన్న చోట మాత్రమే సౌర పంపుసెట్లు పనిచేసే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది.



మార్గదర్శకాల మార్పు తప్పదా?

ఇందిరా సౌరగిరి జలవికాసం పథకం మార్గదర్శకాలను మారిస్తే తప్ప పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయలేమని గిరిజన సంక్షేమ శాఖ వర్గాలు తేల్చి చెప్తున్నాయి. బోర్లకు బదులు ఓపెన్ వెల్స్ తవ్వుకోవాలని భావించినా ఖర్చు తడిసి మోపెడవుతున్నది. గరిష్ఠంగా 50 అడుగుల లోతు లో బావి తవ్వినా బోరుబావులతో పోలి స్తే అధికంగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.6 లక్షల నిధులు సరిపోవని తేలింది. దీంతో పథకం అమలు నత్తనడకన కొనసాగుతున్నదని అధికారులు వివరిస్తున్నారు. అటవీ అధికారుల నుంచి అనుమతులు ఇప్పించి, అవసరమైన చోట అధికంగా ఖర్చుచేసేలా నిధులు సర్దుబాటు చేసేలా మార్పులు చేయాలని భావిస్తున్నారు.

మత్తు వైపే యువత మొగ్గు

మూడేండ్లలో పట్టుబడిన 14వేల మంది

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): 2022 జూన్ నుంచి 2025 జూలై వరకు డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారిలో 40 ఏండ్లలోపు వారు 14,000 మంది ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. ఇందులో పురుషులు 13,684 మంది, మహిళలు 316 మంది ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 2020 జనవరి నుంచి 2025 జూలై వరకు డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన 40 ఏండ్లలోపు యువత వివరాలు ఇవ్వాలంటూ యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి సమాచార హక్కు చట్టం కింద కోరారు. దీంతో పోలీసులు ఈ వివరాలు వెల్లడించారు.

మూడోరోజు ఐటీ సోదాలు

- క్యాప్స్ గోల్డ్‌పై అధికారుల దృష్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, వరంగల్, విజయవాడలోని ప్రముఖ బంగారం దుకాణాలు, వాటి యజమానుల ఇండ్లలో గత రెండు రోజుల నుంచి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు నిర్వహిస్తున్న సోదాలు శుక్రవారం మూడో రోజు కూడా కొనసాగాయి. పన్ను చెల్లింపుల్లో బంగారం వర్తకులు భారీగా అవకతవకలకు పాల్పడినట్టు అనుమానిస్తున్న ఐటీ అధికారులు.. ప్రధానంగా క్యాప్స్ గోల్డ్ కంపెనీకి చెందిన చందా శ్రీనివాసరావు, చందా అభిషేక్, చందా సుధీర్ నివాసాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, అబిడ్స్, సికింద్రాబాద్‌లో ముమ్మరంగా సోదాలు కొనసాగుతున్నాయి. క్యాప్స్ గోల్డ్ కంపెనీకి వాసవి రియల్ ఎస్టేట్ సంస్థతో అనుబంధం ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించారు.


అక్రమాలకు తావులేదు

మైనార్టీ గురుకుల సొసైటీ సెక్రటరీ

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకుల సొసైటీలో ఎలాంటి అక్రమాలకు తావులేదని సొసైటీ సెక్రటరీ షఫీ ఉల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలో లేని ఉద్యోగుల పేరిట నిధుల స్వాహా చేస్తున్నారనేది పూర్తి అవాస్తవమని పేర్కొన్నారు. సొసైటీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, అవసరాల మేరకే కొనసాగుతున్నాయని తెలిపారు.

పర్యావరణాన్ని జాగ్రత్తగా కాపాడాలి

- అభివృద్ధి, పరిరక్షణ పరిరక్షణ ఏకకాలంలో జరగాలి
- తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి చెందిన దేశాలు పర్యావరణ పరిరక్షణ వైపు మొగ్గు చూపుతుంటే, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ వీ బాలకిష్టారెడ్డి అన్నారు. అన్ని దేశాలు అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలుగా ఏకకాలంలో జరిగేటట్టు చూసుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'ఉద్యానరంగంపై పర్యావరణ మార్పులు' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రానున్న 20, 30 ఏండ్లపాటు కచ్చితంగా పర్యావరణ మార్పుల ప్రభావం ఉంటుందని తెలిపారు. అందుకు అనుగుణంగా పర్యావరణ నాణ్యతను కాపాడుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఎర్త్ సమ్మిట్, ఈఎన్ఎఫ్ఎస్‌సీ, యూఎన్ఈపీ తదితర చట్టాలకు అనుగుణంగా దేశంలోని 42 రకాల నియమాలను అందరూ పాటించాలని సూచించారు. పర్యావరణం మార్పులను త్రట్టుకునే దీటైన కార్యక్రమాలు స్థానికంగానే రావాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అందరూ కలిసికట్టుగా ఈ కర్తవ్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతీ పంటకు పర్యావరణ మార్పులు, వాటి ప్రభావాన్ని తట్టుకునే అంశాలు, మ్యాపింగ్ చేయాలని ఉద్యాన వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి చెప్పారు. వాతావరణ ఆధారిత ఉద్యాన, వ్యవసాయ సలహాలను రైతులందరికీ చేర్చేలా విస్తరణ సేవలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఏపీపీ పోస్టులకు ఎస్సీ రిజర్వేషన్

కొత్త క్యాస్ట్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి

- టీఎస్ఎల్‌పీఆర్బీ చైర్మన్ స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్బీ) ద్వారా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ అభ్యర్థులకు రిజర్వేషన్ వర్తిస్తుందని బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఏపీపీ పోస్టులకు ఈ నెల 12 నుంచి అక్టోబర్ 5 సా|| 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. రిజర్వేషన్ కోసం ఎస్సీ క్యాటగిరీ అభ్యర్థులు తప్పనిసరిగా ఈ ఏడాది ఏప్రిల్ 14 తర్వాత ప్రభుత్వం జారీ చేసిన కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో తప్పనిసరిగా కొత్త క్యాస్ట్ సర్టిఫికెట్ సమర్పించాలని చెప్పారు.

నేటి నుంచి బీఏఎస్ స్కూళ్ల మూసివేత

- సర్కారు తీరుపై బీఏఎస్ బడుల యజమాన్యాల సంఘం ఆగ్రహం
- రూ. 220కోట్లకుపైగా పెండింగ్
- బకాయిలు చెల్లించాలని డిమాండ్
- దళిత, గిరిజన విద్యార్థుల భవితవ్యమేంటి?
- ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బీఏఎస్)కు సంబంధించిన నిధులను రెండేండ్లుగా ప్రభుత్వం చెల్లించడం లేదని, పాఠశాలలను నిర్వహించలేని దుస్థితి నెలకొన్నదని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సర్కార్ వైఖరికి నిరసనగా శనివారం నుంచి పాఠశాలలను మూసివేయాలని బీఏఎస్ ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీలకు చెందిన చిన్నారులకు ఉచిత ప్రైవేట్, కార్పొరేట్ విద్యను అందించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూల్' పథకాన్ని అమలు చేస్తున్నారు. 17 ఏండ్ల నుంచి ఈ పథకం అమలవుతున్నది. ఈ స్కీమ్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ద్వారా నోటిఫికేషన్ జారీచేసి, విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ కోటాలో ఎంపికైన వారికి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలి. షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు. గిరిజన విద్యార్థులకు 1, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎంపికైన ప్రాథమిక పాఠశాల విద్యార్థికి ఏడాదికి రూ.28,000, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు (వసతితో కలిపి) రూ.42,000 చెల్లించాలి. ప్రాథమికోన్నత విద్యను చదివే విద్యార్థి వసతి గృహంలో ఉండడానికి ఇష్టపడకపోతే అతడికి ఫీజుగా ప్రభుత్వం రూ.28 వేలు ఇవ్వాలి. గిరిజన విభాగంలోనూ ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. ఒకసారి ప్రవేశం పొందితే పదోతరగతి వరకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తూ.. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఉచితంగా అందించాలి. అడ్మిషన్ పొందిన పాఠశాలల్లోని ఫీజులను ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ద్వారా రీయింబర్స్ చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ స్కీమ్‌లో 230 ప్రైవేట్ పాఠశాలల్లో 26వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పూర్తి ఉచితంగా విద్యను పొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కీమ్‌కు సంబంధించి రూ.220కోట్ల నిధులను బకాయి పెట్టింది. దీంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. ఇక ఎంతమాత్రం పాఠశాలలు నడపలేమని, విద్యార్థులను ఈ స్కీమ్ కింద చేర్చుకోబోమని మొరపెట్టుకుంటున్నాయి. నిధులను విడుదల చేయాలని, లేదంటే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని యాజమాన్యాల సంఘం పలుసార్లు హెచ్చరించింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో 20వ తేదీ నుంచి బీఏఎస్ ప్రైవేట్ స్కూళ్లను మూసివేస్తున్నట్టుగా అసోసియేషన్ ప్రకటించింది.

వరవరరావు బెయిల్ షరతుల మార్పుకు సుప్రీం నిరాకరణ

కింది కోర్టును ఆశ్రయించాలని సూచన

న్యూఢిల్లీ: తన బెయిల్ షరతులను మార్చాలంటూ కవి, ఉద్యమకారుడు పీ వరవరరావు చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. మహారాష్ట్రలో 2018లో జరిగిన భీమా కోరెగావ్ హింస కేసులో అరెస్టయ్యి బెయిల్‌పై ఉన్న వరవరరావు.. గ్రేటర్ ముంబై ప్రాంతాన్ని వదిలి వెళ్లాలంటే ట్రయల్ కోర్టు నుంచి అనుమతి తీసుకోవాలంటూ విధించిన షరతును మార్చాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ధర్మాసనం విచారించింది. తన క్లయింట్ వరవరరావు మూడేండ్లుగా బెయిల్‌పై ఉన్నారని, కానీ, అతని ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తున్నదని, ఆయన భార్య హైదరాబాద్‌లో ఉన్నందున బెయిల్ షరతులు సడలించాలని ఆయన తరపు న్యాయవాది కోరారు. 'ప్రభుత్వం ఆయన ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటుంది. లేదంటే మీరు ట్రయల్ కోర్టును ఆశ్రయించండి' అని ధర్మాసనం ఆయన విజ్ఞప్తిని తిరస్కరించింది.

మరో 474 పార్టీలపై ఈసీ వేటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: దేశంలోని చిన్నాచితకా పార్టీలకు భారత ఎన్నికల సంఘం మరోసారి షాకిచ్చింది. గత ఆరేండ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడం సహా, నిబంధనలు పాటించని, గుర్తింపు లేని, నమోదైన 474 పార్టీలను జాబితా నుంచి తొలగిస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. కాగా, ఈసీ ఆగస్టు 9న మొదటి విడతగా చేపట్టిన ఈ కార్యక్రమంలో 334 నమోదై, గుర్తింపులేని పార్టీ (ఆర్‌యూపీపీ) లను తొలగించిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా 474 పార్టీలను కూడా తాజాగా తొలగించామని, మొత్తం రెండు నెలల కాలంలో 808 ఆర్‌యూపీపీలను జాబితా నుంచి తీసివేశామని తెలిపింది. ఇప్పటివరకు దేశంలో 2,520 ఆర్‌యూపీపీలు ఉండగా, తాజా తొలగింపు తర్వాత వాటి సంఖ్య 2,046కు చేరుకుంది. ఇవి కాక, ఆరు గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నట్టు ఈసీ వివరించింది.

హఫీజ్‌ను కలిసినందుకు మన్మోహన్ సింగ్ థ్యాంక్స్ చెప్పారు

- ఉగ్రవాది యాసిన్ మాలిక్ సంచలన ప్రకటన

న్యూఢిల్లీ: ఉగ్రవాదులకు నిధులు సమకూర్చారన్న కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఉగ్రవాది యాసిన్ మాలిక్ సంచలన విషయాన్ని వెల్లడించారు. లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు, 26/11 సూత్రధారి హఫీజ్ సయీద్‌ను తాను 2006లో కలిసిన తర్వాత నాటి ప్రధాని మన్మోహన్ తనకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారని గత నెల 25న ఢిల్లీ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో మాలిక్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో తెర వెనుక శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భారత సీనియర్ నిఘా అధికారులు కోరడంతో తాను అతడిని కలిశానని వెల్లడించారు. మాలిక్ ప్రకటన ప్రకారం నాటి నిఘా విభాగం ప్రత్యేక డైరెక్టర్ వీకే జోషి ఢిల్లీలో మాలిక్‌ను కలిసి పాకిస్థాన్ పర్యటనలో రాజకీయ నాయకులతో పాటు సయీద్ తదితర ప్రముఖ ఉగ్రవాదులను కలిసి ప్రధాని మన్మోహన్ సింగ్ చేస్తున్న శాంతి ప్రయత్నాలకు మద్దతు కూడగట్టాలని కోరారు. దాంతో తాను పాకిస్థాన్‌లోని ప్రముఖ ఉగ్రవాదులతో హింసపై సయోధ్య కోసం ఒత్తిడి చేశానని మాలిక్ తెలిపారు. అధికారికంగా ఆమోదించిన ఈ చొరవను ఆ తర్వాత రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించారని చెప్పారు.

బాగా సన్నబడ్డా ప్రమాదమే!

- అధిక బరువు కన్నా ఎక్కువ ముప్పు
- దేహంలో కొవ్వు తగినంతుంటే మేలు
- డానిష్ పరిశోధకుల అధ్యయనం

న్యూఢిల్లీ: వ్యక్తి బరువు కాస్త అధికంగా ఉండటం వల్ల ఆయుష్షుకు ముప్పు ఉండకపోవచ్చు, కానీ చాలా సన్నంగా ఉండటం వల్ల ఆయుర్దాయానికి నష్టం జరిగే అవకాశం ఉంటుంది. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 18.5 శాతం కన్నా తక్కువ ఉన్న వారు అర్ధాంతరంగా మరణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డానిష్ స్టడీలో వెల్లడైంది. 'అధిక బరువు'గా వర్గీకరించిన బీఎంఐ కలిగిన వారిని తక్కువ బీఎంఐ కలవారితో పోల్చినపుడు, అధిక బరువు కలవారు తక్కువ బీఎంఐ కలవారితో సమానంగా కానీ, అంత కన్నా ఎక్కువగా కానీ మెరుగైన స్థితిలో ఉంటున్నట్లు




వెల్లడైంది. అతి తక్కువ లేదా అత్యధిక బీఎంఐ కలవారు అర్ధాంతరంగా మరణించే ముప్పు అత్యధికంగా ఉంటుందని తెలిసింది. ఈ అధ్యయనం ప్రకారం బరువు తక్కువగా ఉండటం అత్యంత ప్రమాదకరం. బీఎంఐ 22.5-24.9 మధ్యలో ఉన్న వారి కన్నా బీఎంఐ 18.5 కన్నా తక్కువగా ఉన్నవారు అర్ధాంతరంగా మరణించే అవకాశం దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. బీఎంఐ 18.5-19.9 మధ్యలో ఉన్నవారు అకాల మరణంపాలయ్యే అవకాశాలు రెట్టింపు ఉంటాయి. అదేవిధంగా బీఎంఐ 20-22.4 మధ్యలోని వారికి ఈ ముప్పు 27 శాతం ఎక్కువ. సాధారణంగా 18.5-24.9 బీఎంఐ రేంజ్‌ని ఆరోగ్యకరమైనదిగా పరిగణిస్తారు. అధిక బరువు, ఊబకాయంగా పరిగణించే బీఎంఐ 25-35 మధ్యలో ఉన్నవారు మరణించే అవకాశాలు రిఫరెన్స్ గ్రూప్‌తో పోల్చినపుడు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగలేదు. బీఎంఐ 40 లేదా అంతకన్నా ఎక్కువ గలవారు మాత్రం అకాల మృత్యువుపాలయ్యే అవకాశాలు 2.1 రెట్లు అని వెల్లడైంది. బరువు తక్కువగా ఉండటం ఆరోగ్యానికి హానికరమని, మరీ ముఖ్యంగా వృద్ధాప్యంలో ప్రమాదకరమని ఈ అధ్యయనం తెలిపింది. శరీరంలో కొంత కొవ్వు నిల్వలు ఉండటం వల్ల అస్వస్థతను తట్టుకునే సామర్థ్యం వస్తుంది.

మోసకారి ఏఐ!

- అబద్ధాలు సైతం చెప్పగలదు
- ఓపెన్ ఏఐ హెచ్చరిక

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కృత్రిమ మేధ(ఏఐ) వాడకం కస్టమర్ సర్వీసు నుంచి నిర్ణయం తీసుకునే సాధనం వరకు రోజురోజుకూ పెరిగిపోతోంది. అత్యంత సమర్థంగా, వినూత్నంగా ఏఐ పనిచేయగలదని భావిస్తున్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా మోసం చేసే అవకాశంతోపాటు ఏఐతో అనేక బయటకు కనపడని ప్రమాదాలు పొంచి ఉన్నాయని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక ఏఐ నమూనాలు తమ అసలు ఉద్దేశాలను దాచిపెట్టడం, యూజర్లను తప్పుదారి పట్టించడం, తన సొంత ప్రయోజనాల కోసం పనిచేయడం వంటి చర్యలకు పాల్పడవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.



కొన్ని ఏఐ నమూనాలకు మోసం చేసే సామర్థ్యం కలిగి ఉండడంతోపాటు తమ అసలు ఉద్దేశాలను దాచిపెట్టి స్వీయ ప్రయోజనాలను రుద్దగలవని ఏఐ భద్రతా గ్రూపు అపోలో రిసెర్చ్‌తో కలిసి పనిచేస్తున్న ఓపెన్ ఏఐ ఒక బ్లాగ్‌లో ఇటీవల వెల్లడించింది. ఎంతో ఉపయోగకరంగా కనిపిస్తున్నప్పటికీ ఏఐ సిస్టమ్స్ ఊహించని రీతిలో ముప్పును తీసుకురావచ్చని ఓపెన్ ఏఐ పేర్కొంది. మానవ లక్ష్య సాధనలో పాలుపంచుకుంటున్నట్లు నటిస్తూనే ఏఐ రహస్యంగా ప్రత్యామ్నాయ అజెండాలను కొనసాగిస్తూ రహస్య పన్నాగాలకు పాల్పడవచ్చని ఓపెన్ ఏఐ తెలిపింది. పరీక్షలలో కావాలనే సరిగా సమాధానాలు చెప్పకపోవడం, అంతర్గత నిబంధనలను గోప్యంగా ఉల్లంఘించడం వంటివి ఇందుకు ఉదాహరణగా ఓపెన్ ఏఐ వివరించింది. ప్రస్తుత ఏఐ నమూనాలకు తీవ్రమైన హాని కలిగించే సామర్థ్యం పరిమితంగా ఉన్నప్పటికీ అప్పగించిన లక్ష్యాన్ని పూర్తిచేయడంలో స్వతంత్రంగా వ్యవహరించడం వంటి చిన్న తరహా మోసాలకు పాల్పడవచ్చని ఓపెన్ ఏఐ తెలిపింది.

పెన్నులు, బ్యాగులపై జీఎస్టీ మోత

- టెక్స్ట్‌బుక్స్‌పై కూడా 18% బాదుడు
- నోటిఫికేషన్ జారీ చేసిన సీబీఐసీ
- స్కూల్ సర్వీసులపైనా పన్ను వాత
- ప్రైవేట్, ఆన్‌లైన్ కోచింగ్స్ కూడా ఖరీదే
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



న్యూఢిల్లీ: జీఎస్టీలో (వస్తు, సేవల పన్ను) తీసుకొచ్చిన సంస్కరణలతో సామాన్యులకు భారీ ఊరట కల్పించామని కేంద్రంలోని మోదీ సర్కారు ఊదరగొడుతున్నది. అయితే కేంద్రం జీఎస్టీ బాదుడుతో చదువులు మరింత భారం కానున్నాయి. బాల్ పాయింట్ పెన్నులు, ఫౌంటేన్ పెన్నులు, స్కూలు బ్యాగులు, ప్రింటెడ్ పుస్తకాలపై ఈనెల 22 నుంచి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు(సీబీఐసీ) బుధవారం కొత్త జీఎస్టీ రేట్లపై నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 3న జరిగిన సమావేశంలో జీఎస్టీ కౌన్సిల్ చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ నోటిఫికేషన్ విడుదలైంది. 28 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలో జీఎస్టీ కొత్త రేట్లు అమలులోకి రానున్నాయి. 7 షెడ్యూళ్లలో దాదాపు 1,200 వస్తువులకు చెందిన కొత్త రేటు జాబితా రూపొందింది. కొత్త జీఎస్టీ రేట్ల అమలుపై పరిశ్రామిక రంగం ఇక దృష్టి సారించాల్సి ఉంటుందని నిపుణులు తెలిపారు. కొత్త రేటు జాబితా ప్రకారం అన్ని రకాల పెన్నులపై 18 శాతం పన్ను ఉంటుంది. ఫౌంటేన్ పెన్నులు, స్కూలు బ్యాగులతోపాటు ట్రంక్ పెట్టెలు, సూట్‌కేసులు, వ్యానిటీ కేసులు, బ్రీఫ్ కేసులు, బైనాక్యులర్ కేసులు, వాయిద్య పరికరాల కేసులు, హోల్‌స్టర్లు, ట్రావెల్ బ్యాగులు వంటి వస్తువులు 18 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్నాయి. టెక్స్ట్ పుస్తకాలపై 18 శాతం జీఎస్టీ ఉండగా ఎక్సర్‌సైజ్ పుస్తకాలు, గ్రాఫ్ పుస్తకాలు, ల్యాబొరేటరీ నోటు పుస్తకాలకు మాత్రం జీఎస్టీ నుంచి మినహాయింపు లభించింది.

టెక్ట్స్ బుక్స్‌పై భారం..

నోట్‌బుక్స్‌పై జీఎస్టీని ఎత్తేసిన కేంద్రం.. టెక్స్ట్‌బుక్స్, ప్రింటెడ్ స్టడీ మెటీరియల్‌పై మాత్రం జీఎస్టీని 18 శాతానికి పెంచింది. దీంతో స్కూల్ పిల్లల టెక్స్ట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ ధరలు 10 శాతం నుంచి 15 శాతం మేర పెరిగే ప్రమాదం ఉన్నదని ది ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ (ఓపీఏ) జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ కమల్ మోహన్ చోప్రా అభిప్రాయపడ్డారు. ఇది దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది విద్యార్థులపై, వారి కుటుంబ సభ్యులపై ఆర్థిక భారాన్ని మోపుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై కేంద్రం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

కోచింగ్స్‌కు కష్టాలే

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కేంద్రం నుంచి ఊరట దక్కలేదు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, ట్యూషన్లు, ఆన్‌లైన్ కోర్సులు-లెర్నింగ్ ప్లాట్‌ఫాంలపై జీఎస్టీని 18 శాతంగానే కొనసాగించింది. దీంతో జేఈఈ, నీట్, సివిల్స్, సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో చేరాలనుకొనే వారికి, ఆన్‌లైన్ లెర్నింగ్, క్లాసులు వినే విద్యార్థులకు ఫీజుల విషయంలో ఊరట దక్కలేదనే చెప్పాలి. ఉదాహరణకు.. జేఈఈ లేదా నీట్ కోచింగ్ కోసం ఒక విద్యార్థి రూ. 50 వేలు ఫీజు కడితే, దానికి జీఎస్టీ రూపంలో రూ. 9 వేల వరకూ అదనంగా చెల్లించాల్సిందే. ఇది మధ్యతరగతి కుటుంబాలకు పెను భారమేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం తీసుకొన్న నిర్ణయాలపై పునరాలోచన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిర్వహణ ఖర్చులపై ట్యాక్సుల మోత

స్కూల్, కాలేజీల ఫీజులపై ఎలాంటి జీఎస్టీ భారం ఉండదని చెప్తున్న కేంద్రప్రభుత్వం.. పాఠశాల నిర్వహణ ఖర్చులపై మాత్రం ట్యాక్సుల మోత మోగించింది. సప్లిమెంటరీ ఎడ్యుకేషన్ కిందకు వచ్చే స్కూల్‌లో వినియోగించే ఐటీ సేవలు, క్లీనింగ్, సెక్యూరిటీ, మెయింటెనెన్స్, డెవలప్‌మెంట్ తదితరాలపై గతంలో 12 శాతంగా ఉన్న జీఎస్టీని ఇప్పుడు 18 శాతానికి పెంచింది. ప్రస్తుతం ట్యూషన్ ఫీజుతో పాటు సెక్యూరిటీ, స్కూల్ డెవలప్‌మెంట్, టెక్, ల్యాబ్ సర్వీసులు ఇలా అన్నింటినీ కలిపి స్కూల్ ఫీజుగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. తాజాగా సప్లిమెంటరీ ఎడ్యుకేషన్‌పై కేంద్రం జీఎస్టీని పెంచడంతో పిల్లల స్కూల్ ఫీజులు మరింతగా పెరిగే ప్రమాదం ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ యాజమాన్యాలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ని క్రెడిట్ చేసుకోలేవు కాబట్టి, ఈ పెరిగిన ఖర్చులు ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారాన్ని మిగల్చడం ఖాయమని విద్యావేత్తలు చెప్తున్నారు.

అమెరికన్ మనస్తత్వం అంతం కావాలి

- జాత్యహంకార బాధితుడిని, నన్ను తీవ్రంగా వేధించారు
- మరణానికి ముందు తెలంగాణ టెకీ పోస్టు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కాలిఫోర్నియాలో ఇటీవల పోలీసు కాల్పుల్లో మరణించిన 30 ఏళ్ల భారతీయ టెకీ తన మాజీ యజమాని, సహోద్యోగులు, రూమ్‌మేట్స్ నుంచి జాత్యహంకార వివక్షను ఎదుర్కోవడమేగాక అతని ఆహారంలో విషం కలిపేంత తీవ్రస్థాయికి పరిస్థితి వెళ్లినట్లు తెలుస్తోంది. తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ నిజాముద్దీన్ తన మరణానికి కొన్ని రోజుల ముందు లింక్డ్‌ఇన్ పోస్టులో తాను జాతి విద్వేష బాధితుడినని రాసుకున్నారు. అమెరికన్ మనస్తత్వానికి ముగింపు పలకాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. తనకు జీతంలో అన్యాయం జరిగిందని, తప్పుడు పద్ధతిలో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆయన తెలిపారు. బలవవంతంగా ఇల్లు ఖాళీ చేయాల్సి రావడంతో తన పరిస్థితి మరింత దిగజారిందని నిజాముద్దీన్ వివరించారు. జాతి విద్వేషం, జాతి వివక్ష, జాతి వేధింపులు, చిత్రహింసలు, జీతంలో మోసం, అన్యాయంగా ఉద్యోగం నుంచి ఉద్వాసన, న్యాయం దక్కకుండా అవరోధాలు వంటి వేధింపులకు తాను బాధితుడినని నిజాముద్దీన్ తన పోస్టులో తెలిపారు. ఈరోజు అన్ని రకాల ఇబ్బందులకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఇక చాలు, తెల్లజాతీయుల ఆధిపత్యం/జాతి వివక్షతో కూడిన అమెరికన్ మనస్తత్వానికి ఇక ముగింపు పలకాలని ఆయన తెలిపారు. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కూడా జాత్యహంకార డిటెక్టివ్ ద్వారా తనపై వేధింపులు కొనసాగాయని ఆయన తెలిపారు. తన ఆహారంలో విషం కలపడమేగాక ఇప్పుడు బలవంతంగా ఇంటి నుంచి వెళ్లకొడుతున్నారని ఆయన పోస్టులో రాశారు. తన సహోద్యోగులు, యజమాని, క్లయింట్, డిటెక్టివ్, వారి బృందం ప్రధాన దురాక్రమణదారులుగా ఆయన అభివర్ణించారు. ఈరోజు తనకు జరిగిన అన్యాయం రేపు ఎవరికైనా జరగవచ్చని, తనకు న్యాయం చేసేందుకు సాయపడాలని ఆయన ప్రపంచాన్ని అర్థించారు. కాగా, సెప్టెంబర్ 3న శాంటా క్లారాలోని తన నివాసంలో తన రూమ్‌మేట్‌ను కత్తితో పొడిచారన్న ఆరోపణలపై నిజాముద్దీన్‌పై కాలిఫోర్నియా పోలీసులు కాల్పులు జరిపారు.

పాక్-సౌదీ ఒప్పందంలో మరిన్ని దేశాలు

- మా అణు సంపద సౌదీకీ ఉపయోగం
- పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కుదిరిన పరస్పర రక్షణ ఒప్పందంలో ఇతర అరబ్ దేశాలు కూడా చేరే అవకాశం లేకపోలేదని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తెలిపారు. అటువంటి పరిణామాలకు తలుపులు మూసుకుపోలేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఒక దేశంపై దాడి జరిగితే రెండు దేశాల మధ్య జరిగిన దాడిగా పరిగణించే పరస్పర రక్షణ ఒప్పందాన్ని పాకిస్థాన్, సౌదీ అరేబియా బుధవారం కుదుర్చుకున్నాయి. ఒకరోజు పర్యటన నిమిత్తం బుధవారం సౌదీ అరేబియాను సందర్శించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఖతార్‌లో హమాస్ నాయకులపై ఇజ్రాయెల్ సైనిక దాడులు జరిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పరస్పర రక్షణ ఒప్పందంలో మరిన్ని అరబ్ దేశాలు భాగస్వాములయ్యే అవకాశం ఉందా అన్న విలేకరుల ప్రశ్నకు తాను దీనికి ఇప్పుడే సమాధానం చెప్పలేనని, అయితే తలుపులు మాత్రం మూసుకుపోలేదని మాత్రం కచ్చితంగా చెప్పగలనని ఆసిఫ్ చెప్పారు. పాకిస్థాన్‌కు ముప్పు ఎక్కువగా ఉన్న కారణంగా ఇస్లామిక్ దేశాల మధ్య నాటో తరహా ఏర్పాటు ఉండాలని తాను మొదటినుంచి వాదిస్తున్నట్లు మంగళవారం జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ చెప్పారు. తమ ప్రాంతాన్ని, దేశాలను సమైక్యంగా పరిరక్షించుకోవలసిన ప్రాథమిక హక్కు ముస్లిం దేశాలకు, ముఖ్యంగా ముస్లిం ప్రజలకు ఉందని ఆయన తెలిపారు. ఇతర దేశాల ప్రవేశాన్ని అడ్డుకోవడం లేక మరే ఇతర దేశంతో పాకిస్థాన్ ఈ తరహా



ఒప్పందం కుదుర్చుకోరాదన్న నిబంధన ఏదీ రెండు దేశాలు చేసుకున్న ఒప్పందంలో లేదని ఆయన స్పష్టం చేశారు. ఒప్పందం కింద పాకిస్థాన్ అణ్వస్త్రాలు కూడా సౌదీకి ఉపయోగపడతాయా అన్న ప్రశ్నకు తమకు ఉన్న సమస్త ఆయుధ సంపత్తి ఒప్పందం కింద సౌదీకి కూడా కచ్చితంగా అందుబాటులో ఉంటుందని ఆసిఫ్ వెల్లడించారు. తమ అణు స్థావరాలను తనిఖీ చేసుకోవచ్చని పాక్ మొదటి నుంచి ఆహ్వానిస్తోందని, తమ దేశం ఎన్నడూ ఏ తప్పు చేయలేదని ఆయన చెప్పారు. మీ రెండు దేశాలలో ఒక దేశంపై దాడి జరిగితే మరో దేశం స్పందిస్తుందా అన్న ప్రశ్నకు అందులో ఎటువంటి అనుమానం ఉండదని, తమలో ఎవరిపైన దాడి జరిగినా మరో దేశం స్పందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

పాక్‌తో ఉగ్రవాద సంబంధాలు గుర్తుంచుకోండి

పాకిస్థాన్-సౌదీ అరేబియా మధ్య రక్షణ ఒప్పందంపై ఇరు దేశాలు సంతకం చేయడంపై భారత రక్షణ శాఖ స్పందించింది. న్యూఢిల్లీతో పెరుగుతున్న వ్యూహాత్మక సంబంధాలను రియాద్ దృష్టిలో ఉంచుకుంటుందన్న ఆశాభావాన్ని ఆ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పాకిస్థాన్‌తో ఉగ్రవాద సంస్థలకు ఉన్న సంబంధాలను ప్రపంచ దేశాలకు భారత్ గుర్తు చేస్తున్నదని అన్నారు.

పాక్‌లో ఉంటే సొంతింట్లో ఉన్న ఫీలింగ్

కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శామ్ పిట్రోడా మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశ విదేశాంగ విధానం మారాలని, పాకిస్థాన్‌పైన మొదట దృష్టి సారించాలని ఆయన ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిలుపునిచ్చారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్‌ను సందర్శించిన ప్రతిసారి తనకు సొంత ఇంట్లో ఉన్నట్లు ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాలు కొంతకాలం అలజడి తర్వాత పాలనాపరమైన మార్పులకు లోను కావడం ఆసక్తికరం. హింస, ఉగ్రవాదం వంటి సమస్యలు ఉన్నప్పటికీ పాక్, బంగ్లాదేశ్‌తో భారత్ చర్చలు జరపాలని పిట్రోడా సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్ము కశ్మీరులోని పహల్గాంలో 25 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపిన నేపథ్యంలో పాకిస్థాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకోవాలని పిట్రోడా పిలుపునివ్వడం గమనార్హం. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో తలపడేందుకు భారత క్రికెట్ జట్టుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో పిట్రోడా వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఇరకాటంలోకి నెట్టే అవకాశం ఉంది.

గుంతల వల్ల మరణిస్తే

మున్సిపాల్టీదే బాధ్యత

- అధికారుల జీతాల నుంచి పరిహారం రాబట్టాలి
- కాంట్రాక్టర్లను బాధ్యులను చేయాలి
- బాంబే హైకోర్టు సంచలన ఆదేశాలు
- గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలపై సుమోటోగా కేసు విచారణ





ముంబై, సెప్టెంబర్ 19: రోడ్లపై గుంతల కారణంగా జరిగే ప్రమాదాలకు మున్సిపల్ కార్పొరేషన్లను బాధ్యుల్ని చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఓ విధానాన్ని రూపొందించగలదా అని బాంబే హైకోర్టు ప్రశ్నించింది. రోడ్ల దుస్థితి కారణంగా సంభవించే మరణాలు లేదా అయ్యే గాయాలకు పురపాలక సంస్థలు, అధికారులను బాధ్యుల్ని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. రోడ్లపై గుంతల వల్ల జరిగే ప్రమాదాల బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఓ విధానాన్ని రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమో కాదో తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాది ఓఎస్ చందూర్కర్‌ని జస్టిస్ రేవతీ మోహితే, జస్టిస్ సందేశ్ బీ పాటిల్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం గురువారం ఆదేశించింది. మున్సిపల్ కార్పొరేషన్లను బాధ్యుల్ని చేయాలని, మున్సిపల్ అధికారుల జీతాల నుంచి పరిహారాన్ని రాబట్టాలని ధర్మాసనం తెలిపింది. చిన్న జరిమానా సరిపోదని, వారికి కూడా నొప్పి తెలియాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్లపై గుంతల కారణంగా సంభవిస్తున్న మరణాలపై సుమోటోగా హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్ల దుస్థితికి కాంట్రాక్టర్లను కూడా జవాబుదారీగా చేయాలని ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లోని అన్ని పురపాలక సంస్థలతోపాటు బీఎంసీని కూడా ధర్మాసనం ఆదేశించింది. కాంట్రాక్టర్లకు రూ.1 లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు జరిమానాలు విధించినట్లు న్యాయవాది తెలియచేయగా కోట్లాది రూపాయల కాంట్రాక్టులు పొందుతున్న వారికి ఈ జరిమానాలు సరిపోవని, వారికి భారీగా జరిమానాలు విధించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తాము విస్తృతమైన అంశంగా ఈ సమస్యను పరిగణిస్తున్నామని, గుంతల కారణంగా ఏ వ్యక్తయినా మరణించడం లేదా గాయపడడం సంభవిస్తే అందుకు ఎవరు బాధ్యులని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ విషయంలో జవాబుదారీతనం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై దాడి

ఇద్దరు జవాన్లు మృతి

ఐదుగురికి గాయాలు

ఇంఫాల్, సెప్టెంబర్ 19: మణిపూర్‌లో ఆర్మీ కాన్వాయ్‌పై ఒక వ్యక్తి జరిపిన మెరుపుదాడిలో ఇద్దరు జవాన్లు మరణించారు. రాజధాని ఇంఫాల్ నుంచి బిష్ణుపూర్‌కు వెళ్తున్న 33 అస్సాం రైఫిల్స్ జవాన్లపై నంబోల్ సకల్ లీకై వద్ద శుక్రవారం సాయంత్రం ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆకస్మికంగా దాడిచేసి కాల్పులు జరిపాడు. ఈ దాడిలో ఇద్దరు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. వారిని సమీపంలోని దవాఖానకు తరలించారు. దాడిని మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. దారుణమైన ఈ హింసాత్మక చర్యలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. దాడిని మాజీ సీఎం బీరేన్ సింగ్ ఖండించారు. ఇది రాష్ట్రానికి క్రూరమైన దెబ్బగా పేర్కొన్నారు.

ఒడిశాలో బాలికపై గ్యాంగ్ రేప్

మరో బాలికపై లైంగిక వేధింపులు

రూర్కెలా: బీజేపీ పాలిత ఒడిశాలో వరుస గ్యాంగ్‌రేప్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. తాజాగా ఇద్దరు యువకులు ఒక బాలికపై సామూహిక లైంగిక దాడికి తెగబడ్డారు. మరొక బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం బాధితులు మరో ఇద్దరితో కలిసి బర్సుయాన్‌లో విశ్వ కర్మ పూజ చూసి ఒక వాహనంలో నిర్జన అటవీ ప్రాంతం గుండా ఇంటికి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఐజీ(పశ్చిమ రేంజ్) బ్రిజేశ్ కుమార్ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం కె బలంగ్ ప్రాంతానికి చెందిన బాధితుల వాహనాన్ని నిందితులు అడ్డగించి అందులోని వారిని భయభ్రాంతుల్ని చేశారు. ఆ తర్వాత బాధితులపై దగ్గర్లోని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడ్డారు.

రూ.100 లంచం కేసు.. 39 ఏళ్ల తర్వాత విముక్తి

నిందితుడిని నిర్దోషిగా ప్రకటించిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

రాయ్‌పూర్: రూ.100 లంచం తీసుకున్నట్లు నమోదైన కేసులో నిందితునికి 39 ఏళ్ల పోరాటం తర్వాత న్యాయం దక్కింది. మధ్య ప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థలో బిల్లింగ్ అసిస్టెంట్‌గా పని చేసిన జగదీశ్వర్ ప్రసాద్ అవస్థి నిర్దోషి అని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఆయనకు దిగువ కోర్టు ఒక ఏడాది జైలు శిక్ష విధిస్తూ 2004లో ఇచ్చిన తీర్పును హైకోర్టు రద్దు చేసింది. ఈ సంస్థ ఉద్యోగి అశోక్ కుమార్ వర్మకు చెల్లించవలసిన బాకీలను పరిష్కరించడం కోసం అవస్థి రూ.100 లంచం డిమాండ్ చేసినట్లు 1986లో కేసు నమోదైంది. అశోక్ ఫిర్యాదు మేరకు లోకాయుక్త స్పందించి, వల పన్నింది. అవస్థి కరెన్సీ నోట్లతో పట్టుబడ్డారు. అయితే ప్రాసిక్యూషన్ కేసులో లోపాలు ఉన్నాయని హైకోర్టు పేర్కొంది. స్వతంత్ర సాక్షి లేరని, షాడో విట్నెస్ ఉన్నప్పటికీ, అవస్థి లంచం అడిగినట్లు, తీసుకున్నట్లు తాను చూడలేదని చెప్పారని తెలిపింది. ప్రభుత్వ సాక్షులు 20-25 గజాల దూరంలో ఉన్నారని, వారు ఈ లావాదేవీని పరిశీలించడం సాధ్యం కాదని పేర్కొంది. పట్టుబడిన సొమ్ము ఒక రూ.100 నోటు? లేదా రెండు రూ.50 నోట్లు? అనే విషయంపై స్పష్టత లేదని తెలిపింది. అవస్థి వినిపించిన వాదనల్లో, ఈ ఆరోపిత సంఘటన జరిగిన సమయంలో తనకు బిల్లులను ఆమోదించే అధికారం లేదని, ఓ నెల రోజుల తర్వాత మాత్రమే తనకు ఆ అధికారం వచ్చిందని తెలిపారు. ఉద్దేశం, డిమాండ్ రుజువు కాకుండా, కేవలం కళంకిత నోట్లను స్వాధీనం చేసుకోవడం వల్ల నేరం రుజువు కాబోదని హైకోర్టు స్పష్టం చేసింది. లోకాయుక్త పన్నిన వల విఫలమైందని చెప్పింది. అవస్థి దోషి అని చెప్పిన తీర్పు సమర్థనీయం కాదని వివరించింది.

కర్ణాటకలో నాస్తికుల గణన

ప్రభుత్వ సంచలన నిర్ణయం ▪ కులగణనతో పాటూ సేకరణ



బెంగళూరు: దేవుడిని, మతాన్ని విశ్వసించని నాస్తికుల సంఖ్యను అధికారికంగా లెక్కించడానికి కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కుల, మత డాటాతో పాటు ఈ వివరాలు కూడా సేకరించనుంది. ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న కుల గణనలో ఈ నాస్తికత్వం అంశాన్ని కొత్త క్యాటగిరీలో చేర్చింది. రాష్ట్రంలో నాస్తికుల సంఖ్య ఎంత ఉన్నది కచ్చితమైన వివరాలు సేకరించడానికే దీనిని చేపట్టనున్నట్టు ఒక అధికారి తెలిపారు. సాధారణంగా ప్రభుత్వాలు జనాభా లెక్కల సేకరణలో కులం, మతం లాంటి అంశాలకే పరిమితమవుతారు. అయితే ఇందులో కొత్త క్యాటగిరీని చేర్చారు. ఇది వ్యక్తుల మతపరమైన గుర్తింపును దాటి వారి సైద్ధాంతిక వైఖరిని కూడా నమోదు చేసుకోవడానికి అనుమతినిస్తుంది. రూ.425 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ కుల గణన అక్టోబర్ 7నాటికి పూర్తవుతుంది. కాగా, కొత్తగా చేపట్టే కుల గణనలో నాస్తికత్వం అంశాన్ని కూడా చేర్చడంపై ఇప్పటికే సామాజిక మాధ్యమంలో చర్చ ప్రారంభమైంది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛ, నమ్మకాలను గౌరవించే ప్రగతిశీల చర్యగా కొందరు పేర్కొంటుండగా, మతపరంగా సున్నితమైన సమాజంలో గందగోళం, అనుమానాలు సృష్టిస్తుందని, లేనిపోని విద్వేషాలకు దారితీస్తుందని మరికొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పానీపూరీలు తక్కువిచ్చాడని ధర్నా!

వడోదరలో రోడ్డుపై బైఠాయించి మహిళ నిరసన



వడోదర: వీధి వ్యాపారి తనకు రెండు పానీపూరీలు తక్కువిచ్చాడని ఓ మహిళా ఏకంగా రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగడం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. గుజరాత్‌లోని వడోదరలో ఈ ఘటన జరిగింది. వీధి వ్యాపారి రూ.20లకు ఆరు పానీపూరీలు ఇస్తానని చెప్పి నాలుగే ఇవ్వడంతో ఆమె రోడ్డుపై బైఠాయించారు. తనకు మిగతా రెండు పానీపూరీలు ఇచ్చే వరకు కదలనని భీష్మించారు. ఈ అసాధారణ ధర్నాను చూసి వాహనదారులు జాగ్రత్తగా ఆమె పక్క నుంచి వాహనాలు పోనిచ్చారు. కొందరు రోడ్డు పక్కన గుంపుగా చేరి ధర్నాను చూడసాగారు. పోలీసులు వచ్చాక పరిస్థితి మరింత నాటకీయంగా మారింది. తనకు రూ.20కి ఆరు పానీపూరీలు ఇప్పించాలని ఆమె ఏడుస్తూ పోలీసులను డిమాండ్ చేశారు. ఆమె ధర్నా వల్ల కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చివరికి ఆమెను పోలీసులు అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అయితే ఆమెకు మిగిలిన రెండు పూరీలు లభించాయో లేదో తెలియలేదు.

డబుల్ ట్రబుల్ ఇంజిన్